

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



నిఖత్ పసిడి పంచ్

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో స్వర్ణం 11

శుక్రవారం | 21-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 233 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి మ.2.48 తదుపరి విదియ; నక్షత్రం: అనూరాధ మ.1.56 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా.8.11-9.59; దుర్ముహూర్తం: ఉ.8.40-9.25, మ.12.23-1.07; అమృతఘడియలు: ఉ.6.56-8.43; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.27; సూర్యాస్తమయం: 5.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కేటీఆర్ విచారణకు
అనుమతి


హైదరాబాద్ ఫార్ములా-ఈ కారు రేసు కార్యక్రమంలో కేటీఆర్ (ఫైల్); గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- ఏసీబీకి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పచ్చజెండా
- ఫార్ములా-ఈ రేసు కేసులో కీలక పరిణామం
- చార్జిషీటు దాఖలుకు ఏసీబీ సన్నాహాలు
- రేవంత్ ఆదేశించారు.. గవర్నర్ పాటించారు!
- ఇదంతా కాంగ్రెస్, బీజేపీ కుట్ర: బీఆర్ఎస్
- కాంగ్రెస్ సర్కారు కక్ష సాధింపులకు పోదు
- చట్టప్రకారమే విచారణ: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ1గా ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్‌ను విచారించేందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం అనుమతి ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు ఇప్పటికే పలుమార్లు కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఈ క్రమంలో కేటీఆర్, ఇతర నిందితులపై చార్జిషీట్ దాఖలు చేయడానికి ఏసీబీ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. నాడు మంత్రి హోదాలో నిర్ణయాలు తీసుకున్న కేటీఆర్‌ను విచారించేందుకు అనుమతించాలంటూ ఏసీబీ నుంచి వచ్చిన

మిగతా 12వ పేజీలో...



> గవర్నర్లు, రాష్ట్రపతి తమ విధుల నిర్వహణలో కోర్టులకు జవాబుదారీ కాదు అని చెబుతున్న ఆర్టికల్ 361 కోర్టులకు శిరోధార్యం. కానీ, గవర్నర్లు ఆర్టికల్ 200 కింద నిర్ణయం తీసుకోవడంలో సుదీర్ఘంగా ఏ చర్యా లేకుండా ఉంటే కోర్టులకు ఉన్న పరిమిత న్యాయసమీక్ష అధికారాన్ని వినియోగించుకోకుండా ఈ 361 ఆర్టికల్ అడ్డుకోలేదు. విధుల నిర్వహణలో గవర్నర్‌కు వ్యక్తిగతంగా రక్షణ ఉంటుంది కానీ ఆయన కార్యాలయం కోర్టు విచారణ పరిధిలోనే ఉంది.
>
> \- సుప్రీం కోర్టు

రాష్ట్రపతి, గవర్నర్లకు
గడువు తగదు

బిల్లులపై గవర్నర్లు సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చు

- మంత్రి మండలి సలహా పాటించడం తప్పనిసరి కాదు
- గవర్నర్లు నిరవధికంగా బిల్లులను తొక్కి పెట్టడం కుదరదు
- అయితే అసెంబ్లీకి పంపాలి... లేదంటే ఢిల్లీకి పంపాలి
- గడువు మీరితే బిల్లు పాసైనట్లే అనడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదు
- కారణం లేకుండా పెండింగ్‌లో పెడితే కోర్టులు కలుగజేసుకోవచ్చు
- రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాలపై సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేవనెత్తిన 14 ప్రశ్నలకు సమాధానాలు

న్యూఢిల్లీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల ఆమోదంలో గడువు విధించడం తగదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే, గవర్నర్ ఎటువంటి కారణం చెప్పకుండా నిరవధికంగా ఆలస్యం చేయడం తగదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం అభిప్రాయ పడింది. అటువంటి సమయంలో సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌ను న్యాయస్థానం ఆదేశించవచ్చని చెప్పింది. రాష్ట్రాల శాసన సభలు ఆమోదించి పంపించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలిపే అంశానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక నిర్ణయాన్ని వెలువరించింది. రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని 143వ నిబంధన కింద 14 ప్రశ్నలతో న్యాయ సలహా(ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్) కోరిన నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. 111 పేజీలతో 11 ప్రశ్నలకు సమాధానం ఇస్తూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. తమిళనాడుకు చెందిన పది బిల్లులను గవర్నర్ తొక్కిపట్టినప్పటికీ అవి ఆమోదం పొందినట్లు పరిగణిస్తున్నామని ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో

మిగతా 2వ పేజీలో...

ఇకపై అంతటా ఆధార్!

- సినిమాహాళ్లు, సభలు, ఆఫీసులు.. ఎక్కడికెళ్లినా గుర్తింపు తనిఖీ
- 'ఆఫ్‌లైన్ ఆధార్'పై కేంద్రం కసరత్తు 2
- యూఐడీఏఐ సర్వర్‌తో అనుసంధానం కాకుండానే యాప్ ద్వారా ధ్రువీకరణ
- అధికార వర్గాల వెల్లడి

నిబంధన సరే.. బస్సుల్లో సీటు బెల్టులేవీ?

- 50 శాతానికిపైగా బస్సుల్లో అవి లేనేలేవు
- అసలు లేని సీటు బెల్టులు ధరించేదెలా? 13
- నిబంధన సాధ్యమయ్యేనా?
- యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు


డెడికేటెడ్ కమిషన్ నివేదికకు
ఆమోదం

బీసీ రిజర్వేషన్లపై నేడో, రేపో ఉత్తర్వులు

- అనంతరం జిల్లాల్లో జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల ఖరారు
- పంచాయతీ ఎన్నికలకు 26న షెడ్యూల్?.. ఆ వెంటనే నోటిఫికేషన్ జారీ
- ఎన్నికల ప్రక్రియపై ఎస్ఈసీ, సీఎస్, డీజీపీ వీడియో కాన్ఫరెన్సు
- క్షేత్రస్థాయి సన్నద్ధతపై జిల్లాల అధికారులతో పూర్తయిన సమీక్ష
- మూడు దశల్లో ఎన్నికల నిర్వహణ: డీజీపీ శివధర్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ అలా నివేదిక సమర్పించగానే.. ఇలా మంత్రులందరికీ పంపి ఆమోదం కోసం సంతకాలు కూడా తీసేసుకుంది. ఈ నెల 26న గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ జారీ చేయడంతోపాటు అవసరమైతే.. ఒక్క రోజు వ్యవధిలోనే నోటిఫికేషన్ కూడా ఇచ్చే ఆలోచన కూడా ప్రభుత్వం చేస్తోంది. డిసెంబర్ 15లోపు మొత్తం అన్ని దశల ఎన్నికలూ పూర్తి చేయాలనే ఆలోచనతో ఉంది. ఒకవేళ ప్రభుత్వం రెండు లేదా మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తే.. ఒక్కో దశ ఎన్నికకూ మధ్య కనీసం రెండు రోజులు సమయం ఉండేలా నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను పాత పద్ధతి ప్రకారం (50 శాతానికి లోబడి ఉండేలా) ఖరారు చేసి ఇవ్వాలని ఇటీవలే జరిగిన మంత్రివర్గ సమావేశంలో

మిగతా 13వ పేజీలో...




బేగంపేట ఎయిర్‌పోర్టు వద్ద వైసీపీ శ్రేణులకు జగన్ అభివాదం

హైదరాబాద్‌లోనూ
'రప్పా రప్పా'


- బేగంపేట నుంచి ర్యాలీగా నాంపల్లి సీబీఐ కోర్టుకు జగన్
- వైసీపీ కార్యకర్తల హంగామా.. పోలీసులపైనా దూకుడు
- జగన్ కోర్టు నుంచి బయటికి వస్తుండగా తోపులాట

హైదరాబాద్ సిటీ/అఫ్జల్‌గంజ్/బంజారాహిల్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శ్రేణులు, జగన్ అభిమానులు హైదరాబాద్‌లో రచ్చ రచ్చ చేశారు. 'రప్పా రప్పా' ప్లకార్డులు ప్రదర్శిస్తూ, కాబోయే సీఎం జగన్, జై జగన్ నినాదాలతో నానా హంగామా చేశారు. గుంపులు, గుంపులుగా చేరి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

మిగతా 14వ పేజీలో...

మీరేమైనా చెప్పదల్చుకున్నారా?

- జగన్‌కు జడ్జి ప్రశ్న
- ఏమీ లేదన్న మాజీ సీఎం
- కోర్టులో ఎదురుపడినా పలకరించుకోని జగన్, సునీత 14



నితీశ్ దశావతారం

- బిహార్ సీఎంగా పదోసారి ప్రమాణం చేసిన నితీశ్‌కుమార్
- బీజేపీ నుంచి 14, జేడీయూ నుంచి 8 మంది మంత్రులుగా ప్రమాణం
- కామన్వెల్త్ గోల్డ్ మెడలిస్ట్ శ్రేయసి సింగ్‌కు క్యాబినెట్‌లో చోటు
- హాజరైన మోదీ, షా, చంద్రబాబు సహా బీజేపీ, ఎన్డీయే సీఎంలు 2




భారత్‌కు అమెరికా జావెలిన్ క్షిపణి

- యుద్ధ ట్యాంకు విధ్వంసక వ్యవస్థ విక్రయానికి అగ్రరాజ్యం ఆమోదం
- రూ. 825 కోట్లతో కొనుగోలు 2

భార్యాబిడ్డలను హతమార్చిన వ్యక్తికి ఉరి

- 2019 నాటి కేసులో వికారాబాద్ కోర్టు సంచలన తీర్పు
- 43 ఏళ్ల ఆ కోర్టు చరిత్రలో తొలిసారి దోషికి ఉరి శిక్ష 12







దానం, కడియంలకు మరోసారి
స్పీకర్ నోటీసులు

బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై వివరణ ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై తక్షణమే అఫిడవిట్ రూపంలో వివరణ ఇవ్వాలంటూ ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు గురువారం నాడు స్పీకర్ ప్రసాద్‌కుమార్.. నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. తమ పార్టీ

మిగతా 12వ పేజీలో...

దేశమంతా.. సన్నబియ్యం

పథకాన్ని అమలు చేయండి

- ప్రజలు తినే బియ్యాన్ని పంపిణీ చేయడంతో రాష్ట్రంలో ఆశించిన లక్ష్యం నెరవేరింది
- పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ తగ్గింది
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో సీఎం రేవంత్
- బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని..
- లెవీ రైస్ సబ్సిడీ విడుదల చేయాలని విజ్ఞప్తి
- ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని అభ్యర్థన


కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో సీఎం రేవంత్, ఉత్తమ్

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతమైందని.. కేంద్ర ప్రభుత్వం కూడా దేశమంతా ఈ పథకాన్ని అమలుచేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి

మిగతా 13వ పేజీలో...

'ఫిజికల్ ఇంటెలిజెన్స్' సిటీగా హైదరాబాద్!

- రాజధానిలో 8 వారాల పాటు పైలట్ ప్రాజెక్టు
- సీఎంతో ఎనలాగ్ ఏఐ సీఈవో కిప్‌మన్ భేటీ

ఈశాన్య రాష్ట్రాలకు తెలంగాణ మరో ఇల్లు

- హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో ఉన్నారు
- ఫ్యూచర్ సిటీలో 'నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రానికి' భూ కేటాయింపు: సీఎం

నేతన్నల రుణమాఫీకి 33 కోట్లు విడుదల

మంత్రి తుమ్మల 13

స్కాలర్‌షిప్ బకాయిలు 161 కోట్లు ఇవ్వండి.. ఆర్థిక శాఖ అధికారులతో భట్టి

రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు తగదు

(మొదటిపేజీ తరువాయి)

తీర్పును కేంద్ర ప్రభుత్వం సవాలు చేయకుండా మీకు ఆ అధికారాలు ఉన్నాయా చెప్పండంటూ సుప్రీంకోర్టును రాష్ట్రపతి ద్వారా న్యాయ సలహా కోరింది. దీనికి సమాధానంగా సుప్రీం... రాష్ట్రపతి, గవర్నర్లు తీసుకునే చర్యలు న్యాయస్థానాల పరిశీలనకు అతీతం కాదని చెబుతూనే రాజ్యాంగ అధినేతలకు బిల్లుల ఆమోదం కోసం గడువు విధించడం సరైంది కాదని స్పష్టం చేసింది.

గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయని సుప్రీంకోర్టు తెలిపింది. అవి...

1) ఒక బిల్లు గవర్నర్ దగ్గరికి వచ్చినప్పుడు అన్నీ పరిశీలించి సమ్మతి తెలియజేయడం.
2) ఏదైనా సహేతుకమైన కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం.
3) బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం

ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో రాజ్యాంగంలోని 200 నిబంధన కింద గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారని, అటువంటి సమయంలో న్యాయస్థానాలు గడువు విధించడం సరికాదని రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. "బిల్లులకు ఆమోదం తెలిపేటప్పుడు కానీ, ఆమోదాన్ని నిలిపివేసే సమయంలో కానీ గవర్నర్ తన సొంత విచక్షణ ప్రకారం వ్యవహరించవచ్చు. అలాంటి సమయాల్లో మంత్రి మండలి సలహా ప్రకారం నడుచుకోవాల్సిన అవసరం లేదు. అయితే, సుదీర్ఘకాలం వివరించలేని కారణాల వల్ల ఒక బిల్లుపై నిర్ణయం తీసుకోకపోతే సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవలసిందిగా కోర్టు గవర్నర్‌కు పరిమితమైన ఆదేశాలు జారీ చేయవచ్చు. 361 అధికరణ కింద వారికి రక్షణ కవచం ఉన్నప్పటికీ సుదీర్ఘమైన ఆలస్యం జరిగినప్పుడు హేతుబద్ధమైన సమయంలో బిల్లులను ఆమోదించేందుకు, తిరిగి పంపేందుకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయవచ్చు. తన పరిశీలనకు వచ్చిన ప్రతి బిల్లుపై రాష్ట్రపతి రాజ్యాంగంలోని 143వ అధికరణం కింద సుప్రీంకోర్టు సలహా కోరనవసరం లేదు. అయితే, ఒక బిల్లుకు ఆమోదం సుదీర్ఘ కాలం తెలపకపోతే దాన్ని ఆమోదించినట్టు భావించాల్సిందేనన్న వైఖరిని రాజ్యాంగం అనుమతించదు. అలాంటి పెండింగ్ బిల్లులను ఆమోదించినట్టే భావించాలని ఆర్టికల్ 142ను అనుసరించి న్యాయస్థానం చెప్పడం కుదరదు. గవర్నర్లు నిరవధికంగా ఒక బిల్లును తమ వద్ద ఉంచుకోరాదు అనేదే ప్రధానం. అందువల్ల పరిమితమైన న్యాయ సమీక్ష ఉండవచ్చు" అని రాజ్యాంగ ధర్మాసనం తన ఏకగ్రీవ తీర్పులో అభిప్రాయపడింది. రాజ్యాంగంలో బిల్లును సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని ఉన్నప్పటికీ దాన్ని గవర్నర్లకు, రాష్ట్రపతికి డెడ్‌లైన్ పెట్టేందుకు రాజ్యాంగం ఇచ్చిన అనుమతిగా భావించనక్కరలేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. డెడ్‌లైన్ పెట్టి, ఆలోగా ఆమోదం ఇవ్వకపోతే లభించినట్లుగానే భావించడం రాజ్యాంగంలోని అధికారాల విభజన సూత్రానికి భంగం కలిగిస్తుందని తెలిపింది. చట్టసభల ద్వారా నియమితులైన మంత్రివర్గం డ్రైవింగ్ సీటులో కూర్చోవాలనే విషయంలో సుప్రీంకోర్టుకు భిన్నాభిప్రాయమేమీ లేదని చెప్పింది.

రాష్ట్రపతి ప్రశ్నలు- సుప్రీంకోర్టు సమాధానాలు

1) గవర్నర్ దగ్గరకు బిల్లు వచ్చినపుడు ఆయన ముందు ఉండే ఆప్షన్లు ఏమిటి?

ఆమోదించవచ్చు. రాష్ట్రపతి పరిశీలనకు పంపొచ్చు. నిలిపి ఉంచవచ్చు. నిలిపి ఉంచితే ఆర్టికల్ 200లో చెప్పినట్లు తన సూచనలతో తప్పనిసరిగా శాసనసభకు పంపాలి. శాసనసభకు పంపడం అనేది మరో ఆప్షన్ కాదు. నిలిపిఉంచడంలో భాగమే. శాసనసభకు పంపితేనే నిలిపి ఉంచడానికి హేతువు లభిస్తుంది. కాబట్టి ఆమోదించకుండా దగ్గర పెట్టుకోవడం కుదరదు. శాసనసభకు పంపాల్సిందే. పంపకపోవడం సమాఖ్య వ్యవస్థను కించపరచడమే అవుతుంది. సభకు పంపకుండా గవర్నర్ దగ్గర పెట్టుకోవచ్చు అని కేంద్ర ప్రభుత్వం వాదించింది కానీ దాన్ని తిరస్కరిస్తున్నాం. అసెంబ్లీ రెండోసారి ఆమోదించి పంపితే గవర్నర్ తప్పనిసరిగా ఆమోదించాల్సిన పనిలేదు. కానీ, తన దగ్గర ఉంచుకోవడం కుదరదు. రాష్ట్రపతి పరిశీలనకు పంపొచ్చు.

2) గవర్నర్ బిల్లుపై నిర్ణయం తీసుకొనే సమయంలో మంత్రిమండలి సలహాకు కట్టుబడాలా?

సాధారణంగా మంత్రిమండలి సలహా మేరకు నడచుకోవాలి. అయితే, ఆర్టికల్ 200 కింద గవర్నర్‌కు విచక్షణాధికారం ఉంది. అందులో రెండో విభాగంలో "ఆయన అభిప్రాయంలో" అనే ప్రస్తావన ఉంది. కాబట్టి ఒక బిల్లును తిరస్కరించే అధికారం, రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం గవర్నర్‌కు ఉంది.

3) గవర్నర్ ఆర్టికల్ 200 కింద విచక్షణ అధికారాన్ని ప్రదర్శించడాన్ని కోర్టులు విచారించగలవా?

లేదు. ఆ విచక్షణాధికారాన్ని న్యాయస్థానాలు విచారించలేవు. తీసుకున్న నిర్ణయాల మంచీచెడును సమీక్షించలేవు. కానీ, సుదీర్ఘకాలం లేదా చెప్పుకోదగ్గ కారణం లేకుండా నిరవధికంగా ఎలాంటి చర్య లేకుండా బిల్లును దగ్గర పెట్టుకుని కూర్చుంటే కోర్టులు తమ అధికారాలను ఉపయోగించి పరిమిత ఆదేశాలు(మాండమస్) జారీ చేయవచ్చు. ఆర్టికల్ 200 కింద విధులు నిర్వర్తించమని గవర్నర్‌కు చెప్పొచ్చు. తగినంత సమయంలో నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయవచ్చు. ఆ క్రమంలో ఆయన విచక్షణాధికారాల వినియోగంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయరాదు.

4) ఆర్టికల్ 200 కింద గవర్నర్ల అధికారంపై న్యాయసమీక్ష విషయంలో కోర్టులకు ఆర్టికల్ 361 శిరోధార్యమా?

అవును. గవర్నర్లు, రాష్ట్రపతి తమ విధుల నిర్వహణలో కోర్టులకు జవాబుదారీ కాదు అని చెబుతున్న ఆర్టికల్ 361 కోర్టులకు శిరోధార్యం. కానీ, గవర్నర్లు ఆర్టికల్ 200 కింద నిర్ణయం తీసుకోవడంలో సుదీర్ఘంగా ఏ చర్యా లేకుండా ఉంటే కోర్టులకు ఉన్న పరిమిత న్యాయసమీక్ష అధికారాన్ని వినియోగించుకోకుండా ఈ 361 ఆర్టికల్ అడ్డుకోలేదు. విధుల నిర్వహణలో గవర్నర్‌కు వ్యక్తిగతంగా రక్షణ ఉంటుంది కానీ ఆయన కార్యాలయం కోర్టు విచారణ పరిధిలోనే ఉంది.

5) గవర్నర్ల విధుల నిర్వహణలో రాజ్యాంగంలో ఎలాంటి కాలపరిమితి లేనపుడు కోర్టులు తీర్పుల ద్వారా కాలపరిమితి నిర్ణయించవచ్చా? అధికారాలను ఎలా ఉపయోగించాలో చెప్పొచ్చా?

6) ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి అధికారాల వినియోగం మీద కోర్టులు తీర్పులు ఇవ్వొచ్చా?

7) రాష్ట్రపతి అధికారాల వినియోగానికి సంబంధించి రాజ్యాంగంలో గడువులు కానీ, ఎలా చేయాలో కానీ చెప్పనపుడు కోర్టు తీర్పుల ద్వారా రాష్ట్రపతికి నిర్దేశించవచ్చా?

(మూడు ప్రశ్నలకు ఒకే సమాధానం) ఆర్టికల్ 200, 201 రూపొందించిన విధానాన్ని చూస్తే రాజ్యాంగాధిపతులకు నిర్ణయాలు తీసుకోవడంలో పరిస్థితులను బట్టి ఎక్కువ సమయం తీసుకొనే వెసులుబాటు కల్పించినట్లే భావించాల్సి ఉంటుంది. సమాఖ్య, ప్రజాస్వామ్య దేశంలో చట్టాలు చేసే క్రమంలో తలెత్తే భిన్న సందర్భాలను, పరిస్థితులు, పర్యవసానాలను దృష్టిలో పెట్టుకొని సమతూకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కోర్టులు నిర్దిష్టమైన గడువులు పెట్టడం రాజ్యాంగం జాగ్రత్తగా ఆలోచించి రాజ్యాంగాధిపతులకు కల్పించిన వెసులుబాటుకు వ్యతిరేకం. గవర్నర్లకైనా, రాష్ట్రపతికైనా అదే వర్తిస్తుంది. కోర్టులు తీర్పులు ఇవ్వజాలవు.

8) గవర్నర్లు బిల్లును పక్కనపెట్టినపుడల్లా లేదా రాష్ట్రపతి పరిశీలనకు బిల్లులు పంపినపుడల్లా రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టును న్యాయసలహా కోరాల్సి ఉంటుందా?

కోరాల్సిన అవసరం లేదు. కారణంపై రాష్ట్రపతి సంతృప్తి చెందితే చాలు.

9) గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయం తీసుకొనే దశలో ఉండగా బిల్లుపై కోర్టులు తీర్పులు చెప్పగలవా? చట్టం కాకముందే బిల్లులోని అంశాలపై కోర్టులు నిర్ణయాలు తీసుకోగలవా?

లేదు. చట్టం అమల్లోకి రావడానికి ముందు గవర్నర్లు, రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలేవీ కోర్టుల పరిశీలన పరిధిలోకి రావు. చట్టంగా మారిన తర్వాత మాత్రమే కోర్టులో సవాలు చేయవచ్చు.

10) రాష్ట్రపతి, గవర్నర్లు జారీచేసే రాజ్యాంగబద్ధ ఆదేశాలకు బదులుగా సుప్రీంకోర్టు ఆర్టికల్ 142 కింద ఆదేశాలు జారీ చేయవచ్చా?

కుదరదు. బిల్లులను నిర్దిష్ట గడువులోగా తేల్చకపోతే ఆమోదం పొందినట్టుగా భావించాలని ఆదేశించే అధికారం ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టుకు లేదు.

11) గవర్నర్ ఆర్టికల్ 200 కింద ఆమోదం తెలపకుండా అసెంబ్లీ ఆమోదించిన బిల్లు చట్టం అవుతుందా?

పదో ప్రశ్నకు సమాధానంలోనే ఈ విషయం ఉంది. గవర్నర్ ఆర్టికల్ 200 కింద ఆమోదం తెలపకుండా శాసనసభ ఆమోదించిన బిల్లు చట్టం కాబోదు. ఈ ఆర్టికల్ కింద గవర్నర్ అధికారాలను మరో రాజ్యాంగ వ్యవస్థ నెరవేర్చే అవకాశం లేదు.

12) ఏదైనా కేసును విచారిస్తున్నపుడు రాజ్యాంగ నిబంధనలకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని గ్రహిస్తే తీర్పు ఇవ్వకుండా ఆర్టికల్ 143(3) కింద ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాల్సిన బాధ్యత సదరు బెంచ్‌కు లేదా?

రాష్ట్రపతి న్యాయసలహా కోరిన అంశం పరిధిలోని ప్రశ్న కాదు.

13) ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టుకు సంక్రమించిన అధికారాలు కేవలం ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టం అమలయ్యేలా చూడటానికి మాత్రమేనా లేక రాజ్యాంగంలోని నిబంధనల అమలు పద్ధతికి వ్యతిరేకంగా కూడా ఆదేశాలు ఇవ్వవచ్చా?

పదో ప్రశ్న సమాధానంలో దీనికి సమాధానం ఉంది.

14) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమస్య వచ్చినపుడు ఆర్టికల్ 131 కింద ఒరిజినల్ జ్యూరిస్డిక్షన్ హోదాలో సుప్రీంకోర్టు విచారించగలదు. ఇంకా ఏఏ అంశాల ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమస్యల్లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోగలదు?

అప్రస్తుతం కాబట్టి సమాధానం ఇవ్వడం లేదు.

నేపథ్యం

తమిళనాడుకు సంబంధించిన పలు బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తొక్కిపెడుతుండటంతో అక్కడి ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. సహేతుకమైన సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు గవర్నర్‌ను ఆదేశించింది. బిల్లులను తొక్కిపట్టే విధానాన్ని తప్పుబట్టింది. అయితే, గవర్నర్ మాత్రం బిల్లులను ఆమోదించడం లేదు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ ఈ ఏడాది ఏప్రిల్ 8న సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా పది బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టారని ప్రకటించింది. రాజ్యాంగ విధుల్లో విఫలయ్యారని, రాజ్యాంగబద్ధ పాలన కూలిపోయే పరిస్థితి కల్పించారని మండిపడింది. బిల్లులు తిప్పిపంపకుండా దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. తిప్పి పంపిన తర్వాత మళ్లీ శాసనసభ ఆమోదిస్తే గవర్నర్ ఆమోదించాల్సిందేనని స్పష్టం చేసింది. గవర్నర్‌కు పంపిన బిల్లులు ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మే 13న రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టును 14 ప్రశ్నలతో న్యాయ సలహా కోరింది. వాటికి సుప్రీంకోర్టు గురువారం సమాధానం ఇచ్చింది. వాదనల సమయంలో ఏప్రిల్ 8 నాటి సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చే ఉద్దేశం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పదేపదే చెప్పారు. గురువారం నాటి తీర్పు కాపీలోనూ... మరో తీర్పును తోసిపుచ్చేందుకు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సలహా కోరడాన్ని ఉపకరణంగా వాడటం కుదరదని పేర్కొంది.



తీర్పు రాసిందెవరు?

రెండు రోజుల్లో పదవీ విరమణ చేయబోతున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధ, గురువారాల్లో రెండు రాజ్యాంగ ధర్మాసనాలకు నేతృత్వం వహించి తీర్పులిచ్చారు. రాష్ట్రపతి న్యాయ సలహా కోరిన అంశంపై గురువారం ఏకాభిప్రాయంతో తీర్పు ఇచ్చినప్పటికీ తీర్పు రచయిత ఎవరో పేర్కొనలేదు. ఇలా చేయడం అసాధారణం. 2019లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం అయోధ్య తీర్పు ఇచ్చినపుడు కూడా అందులో తీర్పు రచయిత పేరు పేర్కొనలేదు. శైలిని బట్టి న్యాయకోవిదులు అందరూ ఇది జస్టిస్ డీవై చంద్రచూడ్ తీర్పు కాపీయేనని అంచనా వేశారు.

లోకం తీరు



ఇకపై అంతటా ఆధార్!

» సినిమాహాళ్లు, సభలు, ఆఫీసులు.. ఎక్కడికెళ్లినా గుర్తింపు తనిఖీ

» 'ఆఫ్‌లైన్ ఆధార్'పై కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ, నవంబరు 20: ఇకపై సినిమా చూడటానికి హాల్లోకి వెళ్తున్నప్పుడు థియేటర్ సిబ్బందికి టికెట్ మాత్రమే చూపిస్తే సరిపోదు.. మీ ఆధార్‌ను కూడా అక్కడున్న యంత్రంలో ధ్రువీకరించాల్సి ఉంటుంది. థియేటర్ మాత్రమే కాదు.. ఏదైనా హోటల్‌కు, సభకు వెళ్లినా, ఏదైనా గేటెడ్ కమ్యూనిటీలో ఎవరినైనా కలవటానికి వెళ్లినా, కాలేజీకి, ఆఫీసుకు వెళ్లినా ఇదే పరిస్థితి ఎదురుకావచ్చు. ఎందుకంటే, ఆధార్ వినియోగాన్ని విస్తృతపరిచేలా 'ఆఫ్‌లైన్ ఆధార్' అనే కొత్త సదుపాయాన్ని తీసుకురావాలని కేంద్రప్రభుత్వం కసరత్తు జరుపుతోంది. ఈ మేరకు ఆధార్‌ను పర్యవేక్షించే యూఐడీఏఐ ఓ కొత్త యాప్‌ను రూపొందిస్తోంది. ప్రస్తుతం దీనిపై తుదిదశ పరీక్షలు జరుగుతున్నాయని, యాప్‌ను నియంత్రించే నిబంధనల రూపకల్పన మీద కూడా కసరత్తు జరుగుతోందని సంబంధిత అధికారులు వెల్లడించారు. మరికొన్ని నెలల్లో ఈ యాప్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆఫ్‌లైన్ ఆధార్ అమల్లోకి వస్తే.. ఇప్పటిలాగా ఆధార్ కార్డునో, జిరాక్స్ కాపీనో చూపించాల్సిన అవసరం ఉండబోదని, క్యూఆర్ కోడ్ తరహాలో ధ్రువీకరిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. యూఐడీఏఐ సర్వర్‌తో అనుసంధానం కాకుండానే ఆఫ్‌లైన్ ఆధార్ పని చేస్తుందన్నారు. పూర్తి సాంకేతిక వివరాలు మాత్రం ప్రస్తుతానికి వెల్లడి కాలేదు. మనీకంట్రోల్ అనే వెబ్‌సైట్ ఈ మేరకు ఒక కథనాన్ని ప్రచురించింది. అయితే, నిత్యజీవితంలో అడుగడుగునా గుర్తింపును ధ్రువీకరించుకోవాల్సిన పరిస్థితి వస్తే వ్యక్తిగత స్వేచ్ఛ మాటేమిటన్న ప్రశ్న ముందుకొచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. కాగా, దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఉపాధ్యాయుల వేధింపులు తాళలేక 16 ఏళ్ల బాలుడి ఆత్మహత్య

» ముగ్గురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలంటూ సూసైడ్ నోట్

» ప్రిన్సిపల్, ముగ్గురు టీచర్ల సస్పెన్షన్

న్యూఢిల్లీ, నవంబరు 20: బడిలో ఉపాధ్యాయుల వేధింపులు తాళలేక ఓ విద్యార్థి మెట్రో స్టేషన్‌పై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఢిల్లీలో ఈ విషాద ఘటన జరిగింది. మృతుడు 16 ఏళ్ల విద్యార్థి శౌర్యా పాటిల్. ఢిల్లీలోని సెయింట్ కొలంబియా అనే ఓ కార్పొరేట్ స్కూల్లో చదువుతున్నాడు. ఏడాది క్రితం శౌర్య వేదిక మీద నృత్యాన్ని సాధన చేస్తుండగా పట్టుతప్పి కింద పడిపోయి.. బాధతో విలవిల్లాడి రోదించాడు. అతడిని పైకి లేపి.. ఓదార్చాల్సిన స్థితిలో ఓ ఉపాధ్యాయుడు.. "ఎంత ఏడుస్తావో ఏడువు.. నాకేం బాధ లేదు" అని నిర్లక్ష్యంగా మాట్లాడాడు. అప్పట్నుంచి ఉపాధ్యాయులు అందరి ముందు అతడిని వెక్కిరిస్తూ తీవ్రంగా అవమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు.. బడికి వెళ్లి.. ప్రశ్నించినా యాజమాన్యం పట్టించుకోలేదు. మరోసారి వెళ్లి ప్రశ్నిస్తే.. వారిపై చర్యలు తీసుకోకపోగా "మీ అబ్బాయికి టీసీ ఇచ్చి పంపిస్తాం" అని బడి యాజమాన్యం ఉల్టా తీవ్రంగా హెచ్చరించింది. మంగళవారం బడి నుంచి ఇంటికి బయలుదేరిన శౌర్య, రాజేంద్ర ప్లేస్ మెట్రో స్టేషన్‌లో ఓ ప్లాట్‌ఫామ్‌పైకి ఎక్కి.. కిందకు దూకాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బడిలోని ముగ్గురు ఉపాధ్యాయులే తన చావుకు కారణం అని సూసైడ్ నోట్ రాశాడు. కాగా.. ఈ ఘటనకు సంబంధించి స్కూల్ ప్రిన్సిపల్, ముగ్గురు ఉపాధ్యాయులను యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఘటనపై అత్యున్నత స్థాయి విచారణకు ఢిల్లీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకుగాను ఐదుగురు సభ్యులతో ప్రత్యేకంగా విచారణ కమిటీని ఏర్పాటు చేసింది.

'సర్'ను తక్షణమే ఆపండి

» ఈసీకి బెంగాల్ సీఎం మమత లేఖ

కోల్‌కతా, నవంబరు 20: పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(సర్) ప్రక్రియపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అస్తవ్యస్తంగా, బలవంతంగా జరుగుతున్న సర్ ప్రక్రియను తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు గురువారం మూడు పేజీల లేఖ రాశారు. కనీస సన్నాహాలు, తగిన ప్రణాళిక లేకుండా అధికారులు, ప్రజలపై సర్‌ను బలవంతంగా రుద్దడం తగదని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వరి కోతలు, రబీ సాగు పనుల కోసం రాష్ట్రంలోని లక్షలాది రైతులు, వ్యవసాయ కూలీలు ప్రస్తుతం రోజంతా పొలాలకే పరిమితం అవుతున్నారని పేర్కొన్నారు. సర్ విధులు నిర్వర్తించే బీఎల్‌వో(బూత్ లెవల్ ఆఫీసర్)లకు తగిన శిక్షణ ఇవ్వకపోవడం, గుర్తింపు పత్రాల విషయంలో గందరగోళం నెలకొనడం మొత్తం ప్రక్రియకు ఇబ్బందిగా మారిందన్నారు. బెంగాల్‌లో సర్ నిర్వహణకు ఇది తగిన సమయం కాదని ఆమె పేర్కొన్నారు.

భారత్‌కు ఎస్‌యూ-57 ఫైటర్ సాంకేతికత!

అత్యాధునిక ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలను భారత్‌లోనే తయారు చేసుకునేందుకు వీలు

» పూర్తిస్థాయిలో టెక్నాలజీ బదిలీకి రష్యా సుముఖత

» దుబాయ్ ఎయిర్‌షోలో సంకేతాలు ఇచ్చిన రష్యా రక్షణ రంగ సంస్థ రాస్‌టెక్ ప్రతినిధులు



న్యూఢిల్లీ, నవంబరు 20: త్వరలో భారత వైమానిక దళ సామర్థ్యం ద్విగుణీకృతం కానుంది. రష్యా అభివృద్ధి చేసిన అత్యాధునిక ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం సుఖోయ్ 'ఎస్‌యూ-57' భారత సైన్యానికి అందేందుకు రంగం సిద్ధమవుతోంది. రష్యాలో ఈ ఫైటర్లను ఉత్పత్తి చేసి సరఫరా చేయడంతోపాటు భారత్‌లోనూ ఉత్పత్తి చేసుకునేందుకు వీలుగా 'ఎస్‌యూ-57' ఫైటర్ల పూర్తిస్థాయి సాంకేతికతను భారత్‌కు అందించేందుకు రష్యా సిద్ధమైంది. దుబాయ్‌లో జరుగుతున్న ఎయిర్‌షో-2025లో ఈ దిశగా స్పష్టమైన సంకేతాలు వెలువడ్డాయి. రష్యా రక్షణ రంగ సంస్థ రాస్‌టెక్ సీఈవో సెర్గీ చెమెజోవ్ మీడియాతో మాట్లాడుతూ.. భారత్, రష్యా సుదీర్ఘకాలం నుంచి మంచి భాగస్వాములని.. భారత్‌పై ఆంక్షలు ఉన్న సమయంలో కూడా ఆ దేశ భద్రత కోసం రష్యా ఆయుధాలు సరఫరా చేసిందని చెప్పారు. ఇకపైనా ఈ బంధం అలాగే కొనసాగుతుందన్నారు. ఇరుదేశాల మధ్య పరస్పర ప్రయోజనాలు, సంబంధాల బలోపేతం కోసం భారత్ కోరుతున్న అన్ని రకాల రక్షణ ఉత్పత్తులను అందజేసేందుకు సిద్ధమని చెప్పారు. ఇక రాస్‌టెక్ సంస్థకు సంబంధించిన యుద్ధ విమానాలను తయారు చేసే సబ్సిడరీ సంస్థ 'యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యూఏసీ)' డైరెక్టర్ జనరల్ వాడిమ్ బడేఖా మాట్లాడుతూ.. ఎస్‌యూ-57 ఫైటర్లకు సంబంధించి భారత్ కోరుతున్న అన్ని అంశాల విషయంలో రష్యా సానుకూలంగా ఉందని, భారత అధికారులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. రష్యా రక్షణ ఉత్పత్తుల ఎగుమతులను పర్యవేక్షించే రాసొబొరాన్ ఎక్స్‌పోర్ట్ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ.. ఎస్‌యూ-57లోని ఇంజన్లు, రాడార్లు, సాఫ్ట్‌వేర్లు, అత్యాధునిక ఆయుధాలకు సంబంధించిన సాంకేతికత కూడా భారత్‌కు బదిలీ అవుతుందని అని వెల్లడించారు.

మన రక్షణ మరింత బలోపేతం

ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతమున్న అత్యాధునిక ఐదోతరం యుద్ధ విమానాల్లో ఎస్‌యూ-57 కీలకమైనది. శత్రుదేశపు రాడార్లకు దొరకకుండా సమర్థమైన స్టెల్త్ సాంకేతికతలను దీనిలో వినియోగించారు. ఇలాంటి కీలక యుద్ధ విమానాలు భారత అమ్ములపొదిలో చేరితే.. మన రక్షణ మరింత బలోపేతం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పూర్తిస్థాయి సాంకేతికతల బదిలీతో మరింత ప్రయోజనం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

విదేశీ నిపుణులను ఆహ్వానిస్తా!

» వారు అమెరికన్లకు మెళకువలు నేర్పాలి

» విదేశీ నిపుణుల విషయంలో 'మాగా' మద్దతుదారుల ఆగ్రహాన్ని ఎదుర్కొనేందుకూ సిద్ధం

» అమెరికా-సౌదీ పెట్టుబడుల ఫోరంలో ట్రంప్ వ్యాఖ్యలు



వాషింగ్టన్, నవంబరు 20: విదేశీ ఉద్యోగుల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట మార్చారు. నిపుణులైన విదేశీ ఉద్యోగులను తాను ఆహ్వానిస్తానన్నారు. అలాంటి వారు చిప్‌లు, క్షిపణులు వంటి సంక్లిష్ట ఉత్పత్తులను ఎలా అభివృద్ధి చేయాలన్నది అమెరికా ఉద్యోగులకు నేర్పిస్తారని చెప్పారు. ఈ విషయంలో తన మద్దతుదారుల నుంచి కొంత ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని, దానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అమెరికా-సౌదీ పెట్టుబడుల ఫోరంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సదస్సులో సౌదీ అరేబియా రాజు మహ్మద్ బిన్ సల్మాన్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత్-పాక్‌పై 350% సుంకాలు తప్పవని హెచ్చరించా

భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ మరోసారి చెప్పారు. యుద్ధాన్ని ఆపకపోతే ఇరుదేశాలపై 350% సుంకాలు విధిస్తానని, అమెరికాతో వాణిజ్యం లేకుండా చేస్తానని హెచ్చరించినట్లు తెలిపారు. యుద్ధాన్ని ఆపితే మంచి వాణిజ్య ఒప్పందం చేసుకుందామని చెప్పానన్నారు. అప్పుడు భారత ప్రధాని మోదీ తనకు ఫోన్ చేసి 'మేం యుద్ధానికి వెళ్లడం లేదు' అని చెప్పారని ట్రంప్ వెల్లడించారు.

వలసదారుల పాత్ర ఎనలేనిది: సుందర్ పిచాయ్

అమెరికా టెక్నాలజీ రంగం అభివృద్ధిలో వలసదారుల పాత్ర ఎనలేనిదని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ అన్నారు. అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాల వ్యవస్థలో మార్పులు ప్రతిపాదించడంపై రాజకీయ దుమారం చెలరేగిన నేపథ్యంలో పిచాయ్ వ్యాఖ్య లు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఓ వార్తా సంస్థతో పిచాయ్ మాట్లాడుతూ.. "టెక్నాలజీ అభివృద్ధి చరిత్రను పరిశీలిస్తే.. వలసదారుల భాగస్వామ్యం అత్యద్భుతం" అని చెప్పారు. హెచ్-1బీ వ్యవస్థలో లోటుపాట్లు ఉంటే, సరిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కాగా, న్యూయార్క్ నగర మేయర్‌గా ఎన్నికైన డెమొక్రటిక్ నేత జోహ్రాన్ మమ్దానీ శుక్రవారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ కానున్నారు. శ్వేతసౌధంలో ఈ సమావేశం జరగనున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

ఉక్రెయిన్‌లో శాంతికోసం.. ట్రంప్ 28 సూత్రాల ప్రణాళిక!

మూడేళ్లుగా యుద్ధంతో అట్టుడుకుతున్న ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈసారి 28 సూత్రాల శాంతి ప్రణాళికను రూపొందించారు. రష్యా కోసం ట్రంప్ నియమించిన ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, రష్యా దౌత్యవేత్త కిరిల్ దిమిత్రీవ్, ఉక్రెయిన్ అధికారుల మధ్య సంప్రదింపులతో సిద్ధం చేసిన ఈ ప్రణాళికను ట్రంప్ తాజాగా ఆమోదించినట్టు తెలిసింది. అమెరికా ఉన్నతాధికారులను ఉటంకిస్తూ సీఎన్ఎన్ సహా పలు అంతర్జాతీయ పత్రికలు దీనిపై కథనాలు ప్రచురించాయి. ఉక్రెయిన్ భూభాగాలను వదులుకోవడం నుంచి సైన్యాన్ని, ఆయుధాలను తగ్గించుకోవడం దాకా పలు కీలకమైన షరతులు ఈ శాంతి ప్రణాళికలో ఉన్నట్టు తెలిసింది.

నితీశ్ దశావతారం

» బిహార్ సీఎంగా పదోసారి ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్



నితీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ

పట్నా, నవంబరు 20: బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ పదోసారి ప్రమాణ స్వీకారం చేశారు. పట్నా గాంధీ మైదానంలో గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ నితీశ్‌తో సీఎంగా, బీజేపీకి చెందిన సమ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలతో డిప్యూటీ సీఎంలుగా ప్రమాణ స్వీకారం చేయించారు. బీజేపీకి చెందిన మొత్తం 14మంది, జేడియూకు చెందిన 8 మంది, ఎల్‌జేపీ నుంచి ఇద్దరు, హిందూస్థాన్ అవామ్ మోర్చా, ఆర్ఎల్ఎం నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణం చేశారు. వాస్తవానికి ఆర్ఎల్ఎం తరఫున ఆ పార్టీ అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహ భార్య స్నేహలత మంత్రిగా ప్రమాణం చేస్తారని ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా ఎమ్మెల్యేగా కానీ, ఎమ్మెల్సీగా కానీ ఎన్నిక కాని దీపక్ ప్రకాశ్ (ఉపేంద్ర కుష్వాహ కుమారుడు) మంత్రిగా ప్రమాణం చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. భారీ జనసందోహం సాక్షిగా సాగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఏపీ సీఎం చంద్రబాబు సహా పలువురు బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరయ్యారు. ప్రధాని మోదీ వేదికపై నుంచి తన కండువాను ఊపుతూ అభిమానులను ఉత్సాహపరిచారు. బిహార్‌లో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన సీఎంగా నితీశ్ మొత్తం 19 ఏళ్ల అధికారంలో కొనసాగారు. మరోవైపు కొత్తగా కొలువుతీరిన ప్రభుత్వానికి ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ అభినందనలు తెలిపారు. కాగా, బిహార్ ఎన్నికల్లో ఘోర పరాజయానికి బాధ్యత వహిస్తూ జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్ పశ్చిమ చంపారన్ జిల్లాలోని గాంధీ ఆశ్రమంలో ఒకరోజు మౌనవ్రతం చేపట్టారు.

స్వర్ణ పతక విజేత శ్రేయసికి మంత్రి పదవి

2018 కామన్‌వెల్త్ గేమ్స్ షూటింగ్‌లో భారత్‌కు స్వర్ణపతకం సాధించిన ఎమ్మెల్యే శ్రేయసి సింగ్ బిహార్ మంత్రిగా ప్రమాణం చేశారు. జముయ్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా వరుసగా రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తన ప్రత్యర్థి ఆర్జేడీ నేత షంషాద్ ఆలమ్‌ను ఆమె 54వేల ఓట్ల తేడాతో ఓడించారు. 2020లో బీజేపీలో చేరిన శ్రేయసి నాటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ నేత విజయ్ ప్రకాశ్‌పై గెలిచారు. తాజా ఎన్నికల్లోనూ గెలిచి యువ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

భారత్‌కు అమెరికా జావెలిన్ క్షిపణి

న్యూయార్క్/వాషింగ్టన్, నవంబరు 20: భారతదేశానికి 93మిలియన్ డాలర్ల (దాదాపు రూ.825 కోట్ల) విలువైన ట్యాంకు విధ్వంసక జావెలిన్ క్షిపణి వ్యవస్థ, ఎక్స్‌కాలిబర్ ప్రెసిషన్ గైడెడ్ ఆర్టిలరీ ప్రొజెక్టైల్స్, సంబంధిత రక్షణ పరికరాలను విక్రయించేందుకు అమెరికా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. భారత్ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను ట్రంప్ 50శాతానికి పెంచిన తర్వాత.. అమెరికాతో మనదేశం కుదుర్చుకున్న అతిపెద్ద రక్షణ పరికరాల ఒప్పందం ఇదే. భారత్ రక్షణ సామర్థ్యాన్ని ఈ ఆయుధ విక్రయం మరింత మెరుగుపరుస్తుందని, ఇండో పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాల్లో శాంతి, రాజకీయ స్థిరత్వాలను కొనసాగించడంలో భారత్ ప్రధాన శక్తిగా కొనసాగడానికి ఉపకరిస్తుందని అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ ఆశాభావం వ్యక్తం చేసింది. మొత్తం 216 'ఎం982ఏ1 ఎక్స్‌క్యాలిబర్ టాక్టికల్ ప్రొజెక్టైల్స్', 100ఎఫ్‌జీఎం-148 జావెలిన్ క్షిపణుల కొనుగోలుకు భారత ప్రభుత్వం తమను అభ్యర్థించిందని ఆ ఏజెన్సీ వెల్లడించింది. వీటితోపాటు.. ప్రధాన రక్షణ పరికరాల కిందికి రాని పలు అనుబంధ ఉపకరణాలు, పోర్టబుల్ ఎలక్ట్రానిక్ ఫైర్ కంట్రోల్ సిస్టమ్స్ విత్ ఇంప్రూవ్డ్ ప్లాట్‌ఫామ్ ఇంటిగ్రేషన్ కిట్(ఐపీఐకే), ప్రైమర్లు, ప్రొపెల్లెంట్ చార్జెస్, అమెరికా ప్రభుత్వ సాంకేతిక సహాయం, సాంకేతిక సమాచారం, రిపేర్ అండ్ రిటర్న్ సేవలు, లాజిస్టిక్స్, ప్రోగ్రామ్ సపోర్ట్‌వంటివి కూడా ఈ అమ్మకంలో భాగమని పేర్కొంది. కాగా అమెరికా ఇచ్చిన ఎఫ్‌జీఎం-148 యాంటీ ట్యాంక్ జావెలిన్ క్షిపణుల సాయంతో.. ఉక్రెయిన్ సైన్యం రష్యా యుద్ధ ట్యాంకులను సమర్థంగా ధ్వంసం చేసింది. ఉక్రెయిన్‌వాసులు.. ఆ క్షిపణులను తమను రక్షించే దేవదూతలు అనే అర్థం వచ్చేలా 'సెంట్ జావెలిన్'గా వ్యవహరించడం ప్రారంభించారు. కెనడాకు చెందిన ఒక ఆర్టిస్టు 'సెంట్ జావెలిన్' చిత్రాన్ని రూపొందించి ఉక్రెయిన్‌వాసుల కోసం పది లక్షల డాలర్లకుపైగా విరాళాలు సేకరించాడు. దీని ప్రత్యేకత ఏమిటంటే.. ఇది ప్రపంచవ్యాప్తంగా దాదాపు 25 దేశాలు ఉపయోగిస్తున్న అత్యంత అధునాతనమైన యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్ సిస్టమ్. దీన్ని సైనికులు తమ భుజం మీద పెట్టుకుని శత్రు ట్యాంకుల పైకి ప్రయోగించవచ్చు. ఇమేజింగ్ ఇన్‌ఫ్రారెడ్ సీకర్ అనే అత్యంత అధునాతన సెన్సర్ ద్వారా ఒక్కసారి లక్ష్యాన్ని లాక్ చేసి ట్రిగర్ నొక్కాక.. దీన్ని ట్రాక్ చేయాల్సిన అవసరం ఉండదు. మిసైల్ తన కెమెరా/సెన్సర్ల సాయంతో తానే లక్ష్యాన్ని వెంబడిస్తుంది.

24న కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

» హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'మధ్యాహ్న భోజన' భవనానికి శంకుస్థాపన

కొడంగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 24న కొడంగల్‌లో పర్యటించనున్నారు. హరే రామ హరే కృష్ణ చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని 306 ప్రభుత్వ పాఠశాలలకు కొడంగల్ నుంచి చారిటబుల్ ట్రస్టు ద్వారా అల్పాహారం అందిస్తున్నారు. ఈ క్రమంలోనే మధ్యాహ్న భోజనం కూడా అందించేందుకు ట్రస్టు ముందుకొచ్చి.. ఇటీవలే సీఎంను హైదరాబాద్‌లో కలిసింది. మధ్యాహ్న భోజన తయారీ కోసం భవన నిర్మాణాన్ని ప్రారంభించేందుకు ఈనెల 14న సీఎం రేవంత్‌ను ఆహ్వానించగా బిజీగా ఉండటంతో రాలేకపోయారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 24న కొడంగల్‌కు వస్తున్న సీఎం రేవంత్.. పట్టణ శివారులోని ఎన్కెపల్లి గేటు వద్ద మధ్యాహ్న భోజన తయారీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి వద్ద ఇందిరమ్మ క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత దుద్యాల్ మండలంలో పర్యటించి హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు, స్థల పరిశీలన చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

ఆర్టీసీ బస్సులో పొగలు..!

» అద్దాలు పగలగొట్టి దూకిన ప్రయాణికులు

హాజీపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓ ఆర్టీసీ బస్సులో నుంచి పొగలు రావడంతో భయాందోళనకు గురైన ప్రయాణికులు అద్దాలు పగలగొట్టి బయటకు దూకారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలో గురువారం ఈ ఘటన జరిగింది. జగిత్యాల జిల్లా కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సాయంత్రం మంచిర్యాల నుంచి 77 మంది ప్రయాణికులతో కోరుట్లకు బయల్దేరింది. హాజీపూర్ మండలం గుడిపేట దుబ్బపల్లికి చేరుకోగానే బస్సు వెనుక చక్రాల లైనర్లు పట్టుకోవడంతో ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. ఇది గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును పక్కకు ఆపాడు. పొగలు రావడంతో భయాందోళనకు గురైన ప్రయాణికులు కొందరు బస్సు కిటికీ అద్దాలు పగలగొట్టుకొని బయటకు దూకారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి బైకుపైకి దూసుకెళ్లిన కారు

» ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

» సిద్దిపేట- సిరిసిల్ల రహదారిపై ఘటన



ప్రమాదానికి కారణమైన కారు

సిద్దిపేట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓ కారు రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొనడంతో బైకుపై ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ హృదయ విదారక సంఘటన నారాయణరావుపేట మండలం జక్కాపూర్ శివారులో సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం చోటు చేసుకుంది. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగెళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన జడల తిరుపతి (48), ఆయన భార్య రజిత బైక్‌పై సిద్దిపేటకు వస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి సిరిసిల్ల వైపు అతివేగంగా వెళ్తున్న ఓ కారు రాంగ్‌రూట్‌లో వచ్చి ఒక్కసారిగా బైక్‌పైకి దూసుకెళ్లడంతో అది గాలిలోకి ఎగిరిపడింది. ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడిన భార్యాభర్తలిద్దరిని స్థానికులు అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తిరుపతి చికిత్స పొందుతూ మృతి చెందగా, రజిత పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాద దృశ్యాలు వెనకాలే వస్తున్న మరో కారులోని డ్యాష్ బోర్డు కెమెరాలో రికార్డు అయ్యాయి. కారు డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. సంఘటనా స్థలాన్ని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఏఎస్సై వెంకటయ్య గౌడ్ పరిశీలించి కేసు నమోదు చేశారు.





మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

గన్‌మెన్ లేకుండా బస్టాండ్‌కు రా?

» ఎమ్మెల్యే నాయినికి మాజీ ఎమ్మెల్యే దాస్యం సవాల్

» అరగంటలోనే గన్‌మెన్లు లేకుండా వచ్చిన ఎమ్మెల్యే

హనుమకొండ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హనుమకొండలో గురువారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేల దాస్యం వినయ్‌భాస్కర్ మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో ఉద్రిక్తత ఏర్పడింది. హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన దాస్యం వినయ్ భాస్కర్.. ఎమ్మెల్యే నాయిని చిరు వ్యాపారుల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. ఆయన గన్‌మెన్ లేకుండా బస్టాండ్‌కు వస్తే ఆ చిరు వ్యాపారులే తరిమి కొడుతారని అన్నారు. గన్‌మెన్లు లేకుండా నగరంలో ఎమ్మెల్యే తిరిగే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. అందుకు స్పందించి నాయిని.. అరగంటలోనే హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌కు గన్‌మెన్ లేకుండా ద్విచక్ర వాహనంపై వచ్చి చిరు వ్యాపారులతో మాట్లాడారు. తాను ఎప్పటికీ ప్రజాక్షేత్రంలోనే ఉంటానని, ప్రజల పక్షాన నిలబడుతామని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ నాయకులలాగా హంగూ ఆర్భాటాలకు పోలేదని అన్నారు. దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని వినయ్ భాస్కర్‌కు సూచించారు.

పార్ట్‌టైం ఉద్యోగాల పేరిట మోసం

» రూ.8.46కోట్లు జప్తు చేసిన ఈడీ

హైదరాబాద్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైం ఉద్యోగాల పేరిట దేశవ్యాప్తంగా రూ.285 కోట్లు కొల్లగొట్టిన ముఠాలకు సంబంధించి రూ.8.46 కోట్లు ఈడీ అధికారులు జప్తు చేశారు. కడప జిల్లాలో నమోదైన పలు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన హైదరాబాద్ జోన్ ఈడీ అధికారులు దేశవ్యాప్తంగా 92 బ్యాంకు ఖాతాలకు మళ్లిన డబ్బును గుర్తించారు. వాస్తవానికి ఫేక్ జాబ్స్‌తో మోసానికి పాల్పడిన సైబర్ నేరగాళ్లు చిన్నచిన్న మొత్తాలతో వేలాదిమందిని వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా ఎర వేసిన విషయం ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. కోట్లాది రూపాయలను ఎప్పటికప్పుడు క్రిప్టో కరెన్సీలోకి మళ్లిస్తూ ఆపై వివిధ బిట్ కాయిన్ల ద్వారా తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నారని, ఈ నెట్‌వర్క్‌ను ఛేదించే క్రమంలో పలు మ్యూల్ బ్యాంకు ఖాతాలు వెలుగులోకి వచ్చాయని ఈడీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

గణనీయంగా తగ్గిన జలవిద్యుత్ ఉత్పత్తి

హైదరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో రాష్ట్రంలో జలవిద్యుత్ ఉత్పాదన కనిష్ఠ స్థాయికి చేరింది. ప్రతిరోజూ జెన్‌కోకు చెందిన జలవిద్యుత్ కేంద్రాల్లో 5 మిలియన్ యూనిట్ల దాకా హైడల్ కరెంట్ జనరేట్ అవుతుంది. సీజన్‌లో 45 మిలియన్ యూనిట్లకు పైగా ఉత్పత్తి కాగా వర్షాలు తగ్గుముఖం పట్టి ప్రాజెక్టులకు వరద కూడా తగ్గడంతో 5 మిలియన్ యూనిట్లకు పరిమితమైంది. గురువారం శ్రీశైలం ప్రాజెక్టుకు 13 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా 6439 క్యూసెక్కులను వదిలారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 14760 క్యూసెక్కులు రాగా అంతే వదులుతున్నారు.

ఐ బొమ్మవన్ వచ్చింది!

రవి అరెస్ట్‌తో ఆగని పైరసీ.. ముందే చెప్పిన సజ్జనార్, ఆనంద్

» ఆ సైట్‌లో రివ్యూలే ఉన్నాయి..

» సినిమాలేవీ ఓపెన్ కావట్లేదు: పోలీసులు

» నేనెవరినీ మోసం చేయలేదు..!

» మొదటి రోజు పోలీస్ కస్టడీలో రవి



హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పైరసీ సినిమాల వెబ్‌సైట్లు ఐ బొమ్మ, బప్పం టీవీలను పోలీసులు నిలిపివేయించారు. వాటి నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. కానీ, నాలుగు రోజుల్లోనే ఐ బొమ్మ స్థానంలో ఐ బొమ్మవన్ వచ్చేసింది! రవిని అరెస్ట్ చేసిన సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో.. ఇది పైరసీకి అంతం కాదని సీపీ సజ్జనార్‌తో పాటు ఇతర అధికారులు స్పష్టంగా చెప్పారు. 'హ్యాకర్ల హ్యాకింగ్ కొనసాగుతూనే ఉంటుంది. ఒకరు పోతే మరొకరు వస్తారు. అది కూడా మరింత అధునాతనంగా ఉంటుంది' అని హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి సీవీ ఆనంద్ కూడా పేర్కొన్నారు. రవి అరెస్టయిన నాలుగు రోజుల్లోనే ఈ విషయం నిజమని పైరసీకారులు నిరూపించారు. గురువారం ఐ బొమ్మవన్ అందుబాటులోకి వచ్చింది. ఐ బొమ్మ తరహాలోనే ఐ బొమ్మవన్‌లో కూడా పైరసీ చేసిన కొత్త సినిమాలు కనిపించాయి. కాగా, ఐ బొమ్మవన్‌పై సైబర్ క్రైం అధికారులు వివరణ ఇచ్చారు. అందులో సినిమాల రివ్యూలు మాత్రమే ఉన్నాయన్నారు. ఎటువంటి సినిమాలు ఓపెన్ కావడం లేదని తెలిపారు. ఇప్పటికే ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్లను బ్లాక్ చేయించామని.. వేరే వెబ్‌సైట్ల ద్వారా పైరసీకి పాల్పడితే వాటిపైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎవరినీ మోసం చేయలేదు..

తానెవరినీ మోసం చేయలేదని ఇమ్మడి రవి చెప్పాడు. సినిమాలను పైరసీ చేయలేదని, అక్రమంగా ప్రజల సొమ్ము తినలేదని పోలీసుల విచారణలో సమాధానమిచ్చాడు. సినిమా పైరసీ, బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వంటి కేసుల్లో నగర సైబర్ క్రైం అధికారులు రవిని అరెస్ట్ చేశారు. కోర్టు అనుమతితో ఐదు రోజుల కస్టడీకి తీసుకున్నారు. తొలిరోజైన గురువారం చంచల్‌గూడ జైలు నుంచి తీసుకొచ్చి, వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సైబర్ క్రైం కార్యాలయంలో రవిని ప్రశ్నించారు. బ్యాంకు ఖాతాలు, లావాదేవీలు, ఎక్కడి నుంచి డబ్బు వచ్చింది? ఎన్ని దేశాల నుంచి ఆపరేట్ చేస్తున్నాడు? సర్వర్లు ఏయే దేశాల్లో ఉన్నాయి? వాటిని ఎవరు నిర్వహిస్తున్నారు? అన్న విషయాలపై కూపీ లాగారు. పోలీసు విచారణలో ఎక్కడా బెదరకుండా జవాబులిచ్చిన రవి.. కొన్ని ప్రశ్నలకు మాత్రం బదులివ్వలేదని తెలిసింది. దాదాపు 20 వేల సినిమాలను పైరసీ చేసినట్లు గుర్తించిన పోలీసులు.. అందుకు వినియోగించిన టెక్నాలజీ, విదేశాల్లో సర్వర్లు వంటి కోణాల్లో ప్రశ్నించారు.

రవి కేసు ఉచితంగా వాదిస్తా


విశాఖపట్నం జిల్లా పెదగదిలి సాలిపేటలో ఉంటున్న రవి తండ్రి చినఅప్పారావును న్యాయవాది సలీమ్ కలిశారు. ఈ కేసును ఉచితంగా వాదించి, రవిని బయటకు తీసుకొస్తానని చెప్పినట్టు అప్పారావు తెలిపారు. కొన్ని పేపర్లపై సంతకాలు పెట్టాలని సలీమ్ కోరగా, తన ఆరోగ్యం బాగుండనందున కోర్టుల చుట్టూ తిరిగే ఓపిక లేదంటూ సంతకం పెట్టేందుకు నిరాకరించినట్లు చెప్పారు. కేసు వాదించి, రవిని బయటకు తీసుకురావాలంటే అతని వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకోవాలని సలీమ్ సూచించారని తెలిపారు.

పీవీకి దక్కాల్సిన ఘనత మన్మోహన్‌కు దక్కింది

» మోదీ, బాబు దూరదృష్టి ఉన్న వాళ్లు

» ఐర్లాండ్‌లో భారత రాయబారి అఖిలేశ్ మిశ్ర

(డబ్లిన్ నుంచి ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



భారత రాయబారి అఖిలేశ్ మిశ్రతో ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి కృష్ణారావు

ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు ఇరువురు దూరదృష్టిఉన్న నాయకులని ఐర్లాండ్‌లో భారత రాయబారి అఖిలేశ్ మిశ్ర అన్నారు. గురువారం తనను కలిసిన ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి కృష్ణారావుతో మాట్లాడుతూ.. సుపరిపాలనలో అందరినీ భాగస్వామ్యం చేసి సమర్థవంతమైన అభివృద్ధిని అందించడంలో టెక్నాలజీని వినూత్నంగా ఉపయోగించిన ఘనత మోదీ, చంద్రబాబులకు దక్కుతుందని అన్నారు. అభివృద్ధికీ, ప్రజలకూ అనుకూలమైన విధానాలు చేపట్టడంలో ఈ ఇద్దరు నాయకులు విలువైన పాత్ర పోషించారని ఆయన చెప్పారు. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా భారతదేశంతోపాటు ఏపీకి గుర్తింపు పెరిగిందన్నారు. వికసిత్ భారత్‌ను సాధించడంలో మోదీ, చంద్రబాబు చరిత్రాత్మక పాత్ర పోషించగలరని ఆకాంక్షించారు. తన కెరీర్ తొలి దశలో గుంటూరులో పనిచేసిన రోజులను మిశ్ర గుర్తు చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు చేపట్టకపోతే ఇవాళ దేశంలో జరుగుతున్న పెనుమార్పులు సంభవించేవి కావని చెప్పారు. పీవీకి దక్కాల్సిన ఘనత ఆయన ఆర్థికమంత్రిగా నియమించిన మన్మోహన్ సింగ్‌కు ఘనత దక్కిందని మిశ్రా అన్నారు. పీవీ నరసింహారావుపై అద్భుతమైన పుస్తకం రాశారని ఆయన కృష్ణారావును ప్రశంసించారు. భారతదేశం మాదిరే బ్రిటీష్ వారు ఐర్లాండ్‌ను చాలాకాలం పాలించారని, ఐరిష్ భాషను నాశనం చేశారని మిశ్ర పేర్కొన్నారు. కానీ, తర్వాత కాలంలో ఐర్లాండ్ ప్రభుత్వం, ప్రజలు కలిసి కట్టుగా కృషి చేసి పూర్వ వైభవం తీసుకొచ్చారని, ఇప్పుడు ప్రాథమిక పాఠశాలలోనూ ఐరిష్ భాషను బోధిస్తున్నారని అన్నారు. తెలుగు, తమిళంలాంటి అనేక ప్రాంతీయ భాషల్లో వచ్చిన ఉత్తమ సాహిత్యం ఏ యూరోపియన్ సాహిత్యానికీ తీసిపోదని, కానీ వాటిని అనువదించి ప్రపంచ వ్యాప్తంగా మన సాహిత్యానికి గుర్తింపు తేలేకపోతున్నామని మిశ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

అనుమతి లేకుండా మీడియాతో మాట్లాడవద్దు

హైదరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా పత్రికలు, మీడియా సంస్థలతో అధికార విషయాలు మాట్లాడవద్దని ఇంటర్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది. ఇంటర్ బోర్డుకు చెందిన కొందరు ఉద్యోగులు ఇటీవలే మీడియా సమావేశం నిర్వహించిన నేపథ్యంలో ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య సర్క్యులర్ జారీచేశారు. ప్రభుత్వ సర్వీస్ రూల్స్ ప్రకారం అధికారిక విషయాలపై మీడియాతో పంచుకోవద్దన్న నిబంధనలు ఉన్నాయని, ప్రభుత్వ కాలేజీల అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, ఇతర ఉన్నతాధికారులందరూ దీనిని తప్పనిసరిగా పాటించాలని కార్యదర్శి కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

విధుల్లో ఉన్న ఉద్యోగులపై దాడి చేస్తే క్రిమినల్ కేసులు

» నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, హిస్టరీ షీట్ తెరుస్తామని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ ఎక్స్ వేదికగా హెచ్చరించారు. పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది సహా ఇతర ప్రభుత్వాధికారుల విధులకు ఆటంకం కలిగించినా, బెదిరింపులకు దిగినా, దాడులు చేసినా సహించబోమని హెచ్చరించారు. ఇలాంటి వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుందని, పాస్‌పోర్ట్ జారీలో, ప్రభుత్వోద్యోగాలు పొందే సమయంలో ఇబ్బందులు వస్తాయని సజ్జనార్ పేర్కొన్నారు.



యాదగిరికొండపై భక్తుల రద్దీ

కార్తీక మాసం ఆదాయం రూ.17.62కోట్లు

» గత ఏడాది కంటే రూ.3.31కోట్ల అధికం

యాదగిరిగుట్ట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుల ఆలయ ఖజానాకు కార్తీక మాసంలో రూ.17.62కోట్ల ఆదాయం సమకూరింది. ఏటా కార్తీక మాసంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనడంతోపాటు సత్యదేవుని వ్రతాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. వాహన పూజలు, శీఘ్ర దర్శనం, ప్రచార శాఖ, సువర్ణ పుష్పార్చన, శాశ్వత పూజలు, తదితర విభాగాల్లో కానుకల రూపంలో ఆదాయం సమకూరింది. కార్తీక మాసం అక్టోబరు 22నుంచి ఈ నెల 20వ తేదీవరకు కొనసాగింది. వివిధ విభాగాల ద్వారా రూ.17,62,33,331 ఆదాయం సమకూరిందని ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. గత ఏడాది కన్నా రూ.3,31,63,850 అధిక ఆదాయం వచ్చింది. సత్యదేవుని వ్రత పూజల నుంచే రూ.2.52కోట్ల ఆదాయం వచ్చింది.

తమను చంపేస్తాడేమోనని చంపేశారు!

» 14 మందిని చంపేస్తానని హత్య కేసులో నిందితుడి ప్రతిన

» అతడు బతికుంటే ముప్పు అని భావించిన సాక్షులు

» సికింద్రాబాద్ కోర్టు వద్ద కిడ్నాప్.. సూర్యాపేటలో హత్య

» ఈనెల 14న ఘటన.. తొమ్మిది మంది అరెస్టు

సూర్యాపేట క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పారనే కసితో రగిలిపోయిన నిందితుడు, సాక్ష్యం ఇచ్చిన 14మందినీ చంపేస్తానని ప్రకటించడంతో వారంతా వణికిపోయారు. అతడు బతికుంటే తమ ప్రాణాలకే ప్రమాదం అని నిర్ణయానికొచ్చి.. ఆలోపు తామే అతడిని చంపేయాలని పథకం వేశారు. విచారణ కోసం కోర్టుకొచ్చిన అతడిని కిడ్నాప్ చేసి దారుణంగా హత్యచేశారు. ఈ మేరకు సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి శివారులో లభించిన గుర్తుతెలియని మృతదేహం కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. సూర్యాపేటలో జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ కేసు వివరాలు వెల్లడించారు. ఏపీలోని కోనసీమ జిల్లా అమలాపురం మండలం కరక్కాయపేటకు చెందిన వ్యాపారి నాగవరపు సత్యనారాయణ(50), గెల్లా ఝాన్సీరాణి భార్యాభర్తలు. భర్తతో విభేదాలు ఏర్పడటంతో ఝాన్సీ హైదరాబాద్ నేరేడ్‌మెట్‌లోని ఉంటున్న బంధువు గెల్లా కిరణ్ ఇంటికి వెళ్లి అక్కడే ఉంటోంది. 2023 జూలై 15న కిరణ్ ఇంటికి వెళ్లిన సత్యనారాయణ కొడవలితో ఝాన్సీని నరికి చంపాడు. అడ్డుకోబోయిన కిరణ్ భార్య షీలాకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో జైలుకు వెళ్లిన సత్యనారాయణ బెయిల్‌పై బయటకొచ్చాడు. కేసు విచారణలో భాగంగా కిరణ్, షీలాసహా 14 మంది సాక్ష్యం చెప్పారు. ఫలితంగా తనకు శిక్ష పడుతుందని సత్యనారాయణ భావించాడు. ఈ నెల 7న స్వగ్రామమైన కరక్కాయపేటకు వెళ్లాడు. తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిన భార్య తరపు కుటుంబసభ్యులు, కరక్కాయపేటలోని కిరణ్ నివాసంలో అద్దెకు ఉండే అమలాపురం మండలం సమనసకు చెందిన వ్యవసాయ కూలీ దొండపాటి విశ్వనాథం సహా 14మందిని చంపేస్తానని గ్రామస్థులతో చెప్పాడు. ఈ విషయాన్ని విశ్వనాథం ఫోన్‌లో కిరణ్‌కు చెప్పాడు. దీంతో కిరణ్, షీలా, విశ్వనాథం సహా 14మంది.. సత్యనారాయణను చంపాలని నిర్ణయానికొచ్చారు. ఈ నెల 14న సత్యనారాయణ సికింద్రాబాద్‌లోని కోర్టుకు సత్యనారాయణ కోర్టుకు రాగా 9 మంది అతడిని బలవంతంగా కారులో ఎక్కించుకుని, చర్లపల్లి సమీపంలో హత్య చేశారు. సూర్యాపేట పరిధిలోని పిల్లలమర్రి శివారులో జాతీయ రహదారి పక్కన ఉన్న కాల్వలో సత్యనారాయణ మృతదేహాన్ని పడేశారు. ఎవ్వరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు మృతదేహంపై యాసిడ్ పోశారు. తొమ్మిది మంది హత్యకు పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించారు. వారంతా హైదరాబాద్ జీడిమెట్లలోని ఓ ఇంట్లో ఉండగా ఈనెల 19న అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి సాగర్-శ్రీశైలం 'లాంచీ ప్రయాణం'

» ఏర్పాట్లు పూర్తి చేసిన పర్యాటక శాఖ

నాగార్జునసాగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఒడిలో, ప్రకృతి పచ్చదనంతో కప్పేసిన ఎత్తయిన కొండల మధ్య సాగే సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణానికి సర్వం సిద్ధమైంది. నల్లమల అటవీ ప్రాంతంలో 110 కిలోమీటర్ల దూరం ఆరు గంటల పాటు సాగే ప్రయాణాన్ని ఈ నెల 22 నుంచి ప్రారంభించేందుకు పర్యాటక శాఖ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంతటి ఆహ్లాదకరమైన ప్రయాణాన్ని నాగార్జున సాగర్ జలాశయంలో సరైన నీటిమట్టం ఉన్నప్పుడే ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది విస్తారమైన వర్షాలు కురవడంతో ఆగస్టు నెలలోనే సాగర్ నీటి మట్టం 550 అడుగులు దాటడంతో లాంచీ ప్రయాణానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. మరిన్ని వివరాలకు హైదరాబాద్‌లోని పర్యాటక శాఖ ఫోన్ నంబర్ 9848540371, సాగర్ లాంచీ స్టేషన్ నంబరు 7997951023 నంబరును సంప్రదించాలని తెలిపారు. పర్యాటక శాఖ వెబ్‌సైట్ (https://www.tgtdc.n)లో టికెట్లను బుక్ చేసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తారుమారైన న్యాయం

ఆ సంతోషం ఎక్కువకాలం నిలవలేదు. వనశక్తి తీర్పుతో ప్రభుత్వం కుట్రలను సుప్రీంకోర్టు వమ్ముచేసిందని ఆర్నెల్లక్రితం ఆనందించిన వారికి ప్రస్తుత నిర్ణయం ఆశ్చర్యం కలిగించింది. పర్యావరణచట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపట్టిన ప్రాజెక్టులకు వెనుకటి తేదీతో అనుమతులు ఇచ్చుకొనే విధానం చట్టపరంగా, నైతికంగా సరికాదన్న వనశక్తి తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం ఉపసంహరించుకుంది. అప్పట్లో వెలిబుచ్చిన అభిప్రాయాలు, చేసిన నిర్ధారణలకు పూర్తిభిన్నంగా నేడు సర్వోన్నత న్యాయస్థానం వ్యవహరించడం ఆశ్చర్యం.

మే 16నాటి వనశక్తి తీర్పు వెలువరించిన ధర్మాసనంలో ఒకరైన ఉజ్జల్ భుయాన్‌ను ప్రస్తుత త్రిసభ్యధర్మాసనంలో కొనసాగిస్తూ, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్, మరో న్యాయమూర్తి వినోద్ చంద్రన్‌లు ఈ ఉపసంహరణకు సిద్ధపడ్డారు. అప్పటి తీర్పును సమీక్షించాలనీ, కొట్టిపారేయాలని నలభైకి పైగా దరఖాస్తులు రావడంలో ఆశ్చర్యమేమీ లేదు. ప్రజల పేరిట కట్టే భారీ ప్రాజెక్టుల వెనుక ఏయే శక్తులుంటాయో, కనిపించని చేతులు ఎన్నివుంటాయో తెలియనిదేమీ కాదు. నిర్మాణంలో ఉన్న, పూర్తయిన ప్రాజెక్ట్‌లకు గతంనుంచి పర్యావరణ అనుమతిని వర్తింపచేయడమేమిటో అర్థంకాదు. అటువంటి భావన చట్టవిరుద్ధమన్న అప్పటిమాటకే భుయాన్ ఇప్పుడూ కట్టుబడి, ఉపసంహరణ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకించినా, మిగతా ఇద్దరు జడ్జీల సానుకూల ఓటుతో అప్పటి తీర్పు వమ్ము అయిపోయింది. ప్రాజెక్టు కట్టేసి, ఆ తరువాత 'గ్రీన్' సిగ్నల్ పొందడంలో కనిపించని కుట్రలు ఎన్నో ఉన్నాయనీ, ఉంటాయనీ కోర్టుకు తెలుసు కనుకనే గతంలో ఆ ప్రక్రియను కాదన్నది. ముందు మీరు చేయదల్చుకున్న చేయండి, ఆ తరువాత అనుమతులు పొందండి అని పరోక్షంగా, నర్మగర్భంగా చెబుతున్న 2017నాటి వివాదాస్పద నోటిఫికేషన్‌ను, 2021నాటి ఆఫీస్ మెమోరాండంను కొట్టివేసింది. ఇవి ఒక అడ్డదారిని అధికారికంగా అనుమతించి, ప్రోత్సహిస్తున్నాయి కనుకనే కోర్టు కొట్టివేసింది. పర్యావరణహానిని నివారించేందుకు, మానవాళిని రక్షించేందుకు ఉద్దేశించిన చట్టాలతో ఇలా ఆడుకోవడం విషాదం.

ఈ పోస్ట్‌ఫ్యాక్టో అనుమతి విధానాన్ని నమ్ముకొని లబ్ధిపొందుతున్న శక్తులన్నీ ఆ తీర్పుకు వ్యతిరేకంగా మళ్ళీ కోర్టు మెట్లు ఎక్కడం సహజం. ఆ తీర్పుదెబ్బతో ఎన్నో ప్రాజెక్టులు కూలుతాయని, కష్టపడికట్టినవాటిని చేజేతులా నాశనం చేయడం సరికాదనీ, వేలాదికోట్ల ఆర్థిక నష్టాన్నే కాదు, ఏ పర్యావరణం కోసమైతే బాధపడుతున్నామో అదే పర్యావరణానికి మళ్ళీ కీడు జరుగుతుందని కూడా వీరంతా వాదించడం సహజమే. అయితే, ప్రస్తుత ధర్మాసనం ఈ వింతవాదనలన్నీ పరిగణనలోకి తీసుకుంది. పోస్ట్‌ఫ్యాక్టో అనుమతులను ప్రశ్నించని గత తీర్పులను ఉటంకిస్తూ ఇద్దరు సభ్యుల ధర్మాసనం వీటిని దృష్టిలోపెట్టుకోనందుకు తప్పుబడుతోంది. ఆర్నెల్లనాటి తీర్పు ఉనికిలో ఉన్న పక్షంలో 20వేల కోట్ల ప్రాజెక్టులను కూల్చవలసివస్తుందని తానూ బాధపడుతోంది. ఐదేళ్ళక్రితం సుప్రీంకోర్టు బెంచ్ ఒకటి ఒక కేసులో ఈ పోస్ట్‌ఫ్యాక్టో పర్యావరణ అనుమతుల విధానం సరికాదని అంటూనే, అప్పటికే ఇచ్చిన అనుమతిని రద్దుచేయకుండా జరిమానాతో సరిపెట్టిందని కూడా ప్రస్తుత ధర్మాసనం గుర్తుచేస్తోంది. అసాధారణ సందర్భాల్లో ఈ తరహా అనుమతులు ఇవ్వొచ్చన్న తీర్పులనూ ప్రస్తావించింది. ఆర్నెల్లనాటి వనశక్తి కేసులో సైతం ద్విసభ్యధర్మాసనం భవిష్యత్తు ప్రాజెక్టులకు ఈ విధానాన్ని అమలుచేయవద్దని అన్నది తప్ప, ఇప్పటికే ఈ తరహా అనుమతులు పొందిన వాటిని నేలమట్టం చేయాలని ఆదేశించలేదు. కానీ, ఆ ఉత్తర్వులతో, సాంకేతిక కారణాలతో అనుమతులు పొందలేకపోయినవాటిని కాపాడేపేరిట ప్రస్తుత బెంచ్ మొత్తం తీర్పునే ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. ఇకపై తప్పుడుతోవలో పోవద్దు అని విస్పష్టంగా చెప్పిన గత తీర్పును ప్రస్తుత ధర్మాసనం నిలబెడుతూనే, ఏయే ప్రాజెక్టులకు అసాధారణ సందర్భాలూ, అత్యవసర పరిస్థితులు వర్తిస్తాయో నిగ్గుతేల్చి వాటికే మినహాయింపులు ఇస్తే సరిపోయేది. చట్టవిరుద్ధమనీ, అక్రమమనీ అనుకున్నదానిని జరిమానాలతోనూ, మినహాయింపులతోనూ సక్రమం చేయడం సరికాకపోగా, మరింత అక్రమమే అవుతుంది.

పీకే: జీరో నుంచి హీరో కాగలడా?





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

అధునాతన సామాజిక మాధ్యమాల యుగం మనది. మేధాపరమైన చర్చ కంటే– ఒక చిన్న, పదునైన సౌండ్‌బైట్ అత్యంత ప్రభావశీలంగా ఉంటుంది. కనుకనే బిహార్‌లో ఓట్ల లెక్కింపు రోజున, సంచలనాత్మక ఫలితాలపై నా వార్తా వ్యాఖ్య ప్రారంభమవనున్నదని సూచిస్తూ నేను చేసిన ఒక వ్యాఖ్యకు సంబంధించిన వీడియో క్లిప్ ఒకటి వెన్వెంటనే వైరల్ అయింది. బిహార్ ప్రజాస్వామ్య పోరులో హీరోగా ప్రభవించవలసిన జన్‌సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ జీరోగా ఉండిపోయాడనేదే నేను చేసిన వ్యాఖ్య. అవును, ఆ వ్యూహ శూరుడు విజయ శూన్యుడుగా మిగిలిపోయాడు మరి. 2014 సార్వత్రక ఎన్నికలలో నరేంద్ర మోదీ ప్రచార వ్యూహాలను రచించి, పీకేగా భారతీయ జనతా పార్టీ శ్రేణులలో ఆదరాభిమానాలు పొందిన ప్రతిభాశాలి ప్రశాంత్ కిశోర్. మోదీ కొలువును వీడి, సొంత మార్గంలో ముందుకు సాగిన అదే పీకే, బిహార్‌లో తనకొక రాజకీయ భవిష్యత్తును నిర్మించుకునేందుకు తొలిసారి ప్రయత్నించి, ఘోరంగా విఫలమవడం బీజేపీ శ్రేణులను అమితంగా ఆనందభరితులను చేసింది. అదలావుంచితే పీకే పరాజయంపై నా వ్యాఖ్య ఆయన మద్దతుదారులకు ఏ మాత్రమూ నచ్చలేదు. నాపై కొండెత్తున మండిపడ్డారు. నేనా వ్యాఖ్యను ఎటువంటి దురుద్దేశంతోనూ చేయలేదు. ఇది స్పష్టం. పీకే అభిమానులు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు. వివిధ పార్టీలకు ఎన్నికల వ్యూహాలను రూపొందించి, వాటి విజయాలకు కారకుడైన ఈ ప్రతిభాశాలి, రాజకీయ నాయకుడుగా పరిణమించిన తరువాత ఆయన భవిష్యత్తుపై మీడియాలో అనేక ఊహాగానాలు సాగాయి. అంతిమంగా బిహార్ ఓటర్లు తమ తీర్పు చెప్పారు: జన్‌సురాజ్ పార్టీ ఒక్క సీటూ గెలుచుకోలేదు. కేవలం 3.4 శాతం ఓట్లు మాత్రమే కైవసం చేసుకోగలిగింది. ఈ నేపథ్యంలో అడగవలసిన సమంజసమైన ప్రశ్న: ఎన్నికల రాజకీయాలలో ఆయనకు తొట్టతొలుతనే విజయం ఎందుకు లభించలేదు? రాజకీయ నాయకుడుగా భవిష్యత్తు లేని వ్యక్తి అని పీకే గురించి ఒక నిశ్చిత అభిప్రాయానికి రావడం సరైన విషయమేనా?

మన దేశంలో శీఘ్రంగా అధికారానికి రాగల ఒక కొత్త రాజకీయ పార్టీని నెలకొల్పడమనేది చాలా కష్టం. ఇటీవలి కాలంలో అటువంటి సాఫల్యాన్ని సాధించిన అసాధ్యుడు అరవింద్ కేజ్రీవాల్. ఆమ్ ఆద్మీ పార్టీని ప్రారంభించిన కొద్ది నెలల్లోనే ఆయన ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించగలిగారు. ఆ తరువాత పంజాబ్‌లో సైతం తన పార్టీకి అధికారాన్ని సాధించగలిగారు. 'అవినీతిపై భారత్ పోరు' ఉద్యమంలో కీలక పాత్ర వహించడం ద్వారా ఆమ్‌ఆద్మీ పార్టీ ఢిల్లీలో అధికారాన్ని సాధించుకున్నది. పంజాబ్‌లో అకాలీదళ్–బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనపై తీవ్ర అసంతృప్తికి లోనైన సిక్కు ఓటర్లు ఆమ్‌ఆద్మీ పార్టీకి పట్టంగట్టారు. పంజాబ్‌లో అధికారానికి వచ్చే నాటికే ఆమ్‌ఆద్మీ పార్టీ యశో కాంతులు మసకబారాయి. మరిన్ని రాష్ట్రాలలో ఆ పార్టీ విస్తరణ, అధికార సాధన అసాధ్యమైపోయింది. గత శతాబ్ది తుది దశకాలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి రామారావు అనితర సాధ్యమైన రాజకీయ చరిత్ర సృష్టించారు. అదే కాలంలో అసోంలో వలసకారుల వ్యతిరేక ఉద్యమం నిర్వహించిన విద్యార్థులు 'అసోం గణ పరిషత్' అనే రాజకీయ పార్టీని స్థాపించి అధికారానికి వచ్చారు. అయితే వారి అధికార వెలుగులు ఎంతో కాలం ప్రకాశించలేదు.

ఆ తరహా విజయాలు సాధించడం ప్రశాంత్ కిశోర్‌కు అసాధ్యం. ఎందుకని? సామాజిక జీవితంలోను, రాజకీయ వ్యవహారాలలోను కుల అనుబంధాలే ప్రథమ గణ్యత పొందే బిహార్ ఆయన రాజకీయ కర్మక్షేత్రం కావడమే. 2024లో గాంధీ జయంతి రోజున జన్‌సురాజ్ పార్టీని నెలకొల్పిన క్షణం నుంచి 2025 అసెంబ్లీ ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసేదాకా ప్రశాంత్ కిశోర్ ప్రజల మధ్యే ఉంటూ వచ్చారు. బిహార్ నలుమూలలా పల్లె పల్లెనూ ఆయన సందర్శించారు. ప్రజలతో సంభాషిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే వాటినెలా పరిష్కరిస్తుందో ఓటర్లకు ఓర్పుతో, నేర్పుగా వివరించారు. సకల సామాజిక వర్గాలకు ఆమోదయోగ్యమయ్యే రీతిలో జన్‌సురాజ్‌ను నిర్మించేందుకు ప్రాధాన్యమిచ్చారు.

నిజానికి ఆయన రాజకీయ పార్టీలకు ఎన్నికల వ్యూహాలను రూపొందించే వృత్తిలోనే కొనసాగి ఉంటే మరింతగా కోటీశ్వరుడు అయివుండేవారు. అయినా రాజకీయాలలోకి ప్రవేశించారు. వ్యక్తిగత ఆకాంక్ష, విజయగర్వాతిశయం, చిక్కులను ఎదుర్కొనే తెగువ.. కారణం ఏదైతేనేమి పీకే రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అదీ ఒక అసాధారణ మార్గంలో. ఎనలేని ఆత్మవిశ్వాసంతో 'జన్‌సురాజ్'ను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సాహసించారు. ఎంతో శ్రమించారు. ప్రజల ఆదరాభిమానాలను విశేషంగా సముపార్జించుకున్నారు. ప్చ్.. వాటిని ఓట్లుగా మార్చుకోవడంలో విఫలమయ్యారు. ఓట్లు డిజిటల్ విశ్వం నుంచి ఊడిపడవు. వీధులలో విశ్వసనీయత పొందితేనే అవి లభ్యమవుతాయి. అందుకు ప్రజల నమ్మకం పొందాలి. బహుజన్ సమాజ్ పార్టీని నెలకొల్పిన కాన్షీరామ్ శక్తిమంతుడు అయినప్పటికీ దేశ రాజకీయాలపై తనదైన ముద్ర వేసేందుకు ఆయనకు చాలా కాలం పట్టింది. ఆయన ఒకసారి సుప్రసిద్ధంగా ఇలా చెప్పారు: 'మొదటి ఎన్నికను ఓడిపోవడానికి పోరాడాను, ఇతరులను ఓడించడానికి రెండోదాన్ని పోరాడాను, మూడోది విజయం సాధించేందుకు పోరాడాను'. మంచి రోజుల్లోను, చెడ్డ రోజుల్లోను ఒక రాజకీయ పార్టీని నడిపే కష్టతరమైన కర్తవ్యాన్ని ఎలా నిర్వహించాలన్నదే కాన్షీరామ్ మాటల సారాంశం. బీఎస్పీ వ్యవస్థాపకుడు అభివృద్ధి పరిచిన కులాధారిత ప్రజాసమీకరణ వ్యూహాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రశాంత్ కిశోర్ ప్రయత్నించారు. అందుకు సామాజిక మాధ్యమాల్లో భారీ స్థాయిలో ప్రచారం చేయడం ద్వారా ఓటర్ల మద్దతును, ముఖ్యంగా బిహార్ సమాజంలో అత్యధిక సంఖ్యలో ఉన్న యువ ఓటర్లను ఆకట్టుకునేందుకు పీకే ప్రయత్నించారు. ప్రశాంత్ కిశోర్ రాజకీయాల పట్ల అశేష జనులు ఆకర్షితులయ్యారు, సందేహం లేదు. అయితే ఆయనకు కులపరమైన గుర్తింపు లేదు. సంస్థాగత బలమూ లేదు. ప్రజల ఆదరాభిమానాలను మరింతగా సంఘటితం చేసుకునేందుకు అవసరమయ్యే పటిష్ఠమైన పార్టీ యంత్రాంగం ఆయనకు లేకపోయింది.

అరవింద్ కేజ్రీవాల్ తన పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు యువ స్వచ్ఛంద కార్యకర్తలపై ఆధారపడినట్టుగానే పీకే సైతం యువ కార్యకర్తల ఆలంబనతో జన్‌సురాజ్‌ను ఒక సువ్యవస్థిత రాజకీయ సంస్థగా నిర్మించేందుకు ప్రయత్నించారు. ఒక వ్యవస్థాగత వ్యతిరేకిగా ప్రజల మనసుల్లో నిలిచేందుకు ఆరాటపడ్డారు. బిహార్‌లో దశాబ్దాలుగా అధికారం చెలాయిస్తున్న నితీశ్‌కుమార్, లాలూప్రసాద్ యాదవ్ కుటుంబంపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తిని తనకు అనుకూలంగా మలుచుకునేందుకు పీకే కృషి చేశారు.

పీకే తన విమర్శనాస్త్రాలను నితీశ్, లాలూ పార్టీలపై పెద్ద ఎత్తున ఎక్కుపెట్టారు. అయితే ఓట్ల సాధనలో వాటి శక్తి పరిమితమైనదే. బిహార్‌లో రెండు ప్రధాన కూటముల (ఎన్డీఏ, ఎమ్‌జీబీ)కు కలిపి మొత్తం ఓట్ల వాటా ఇంచుమించు 80శాతం మేరకు ఉన్నది. కులపరమైన అనుబంధాల ఆలంబనతోనే వాటికీ బలం చేకూరింది. మరి కొత్తగా ప్రవేశించిన రాజకీయ నాయకుడు ఎవరైనా నిలదొక్కుకోవాలంటే ఈ కులపరమైన అనుబంధాలను ఛేదించవలసి ఉన్నది. 'బిహార్ ఫస్ట్' అనే ఆకర్షణీయమైన నినాదం ఎంత మాత్రమూ పనిచేయదు.. ఎందుకని? బిహారీ ఉప జాతీయవాదం కంటే కుల గుర్తింపులు బలంగా ఉండడమే (బిహార్‌లో ఏకీకృత సాంస్కృతిక, భాషా గుర్తింపు లేదు. ఉమ్మడి గుర్తింపు భావాన్ని సృష్టించడానికి ఛత్ పూజ పండుగ లేదా మధుబని పెయింటింగ్‌ల వంటి సాంస్కృతిక చిహ్నాలను ప్రోత్సహించినా ఆశించిన ఫలితాలు సమకూరలేదు). ఓటు వేయవచ్చేసరికి ప్రతి బిహారీ కూడా కుల గుర్తింపునకు ప్రాధాన్యమివ్వడం పరిపాటి. ఎన్నికల ఫలితాలతో ప్రశాంత్ కిశోర్‌కు ఈ కఠోర వాస్తవం అవగతమయి ఉంటుంది.

'యువ' ఓటర్లే తాను ఆశిస్తున్న మౌలిక మార్పుకు దోహదం చేస్తారని ప్రశాంత్ కిశోర్ భావించారు. బిహార్ ఓటర్లలో 22శాతం మంది 18 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసులో ఉన్నవారే. అయితే ఇంతకంటే చాలా పెద్ద సంఖ్యలో ఉన్న ఓటర్లు మహిళలు. మన ఎన్నికలలో జయాపజయాలకు వీరే నిజమైన నిర్ణయాత్మక శక్తులు అనడంలో అతిశయోక్తి లేదు. యువ ఓటర్లు ఆదాయ స్థాయి ప్రాతిపదికన చీలిపోయి వున్నారు. అయితే మహిళా ఓటర్లు నితీశ్ కుమార్‌కు అత్యంత విశ్వసనీయమైన మద్దతుదారులుగా ఉన్నారు. రెండు దశాబ్దాల క్రితం తొలుత అధికారంలోకి వచ్చిననాటి నుంచి మహిళలకు ప్రాధాన్యమిస్తూ సంక్షేమ పథకాలే అందుకు ప్రధాన కారణమని మరి చెప్పనవసరం లేదు. మద్య నిషేధం ఎత్తివేత ప్రశాంత్ కిశోర్ ఇచ్చిన హామీలలో ఒకటి. దీనిపై పెద్ద చర్చే జరిగింది. గ్రామీణ మహిళా ఓటర్ల దృష్టిలో అది వివేకవంతమైన నిర్ణయం కాదు. మద్య నిషేధాన్ని మహిళా ఓటర్లు అందరూ సమర్థించారు. ఆర్థిక ప్రయోజనాల కంటే ప్రజారోగ్యం, శాంతిభద్రతలు మొదలైన అంశాలు ఎక్కువ ప్రభావం చూపాయి. బిహార్ గ్రామీణ ప్రాంతాలలో పర్యటించినప్పుడు యువజనులు పీకే గురించి విశేషంగా మాట్లాడుకోవడం గమనించాను. అయితే మహిళలు ఎవరూ ఆయన గురించి పట్టించుకున్నట్లు ఏ మాత్రం కన్పించలేదు. అంతిమంగా మహిళల ఓట్లే బిహార్ ఎన్నికలలో జయాపజయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేశాయి.

జన్‌సురాజ్ పరాజయంతో ప్రశాంత్ కిశోర్ రాజకీయ ప్రస్థానం ముగిసినట్టేనా? అవును, కాదు. అవును– పీకే బ్రాండ్ మీడియా ఆధారిత రాజకీయ మార్కెటింగ్‌కు పరిమితులు ఉన్నాయని స్పష్టమయింది. అయితే, రాబోయే దశకంలో బిహార్ రాజకీయాలు నితీశ్–లాలూ అనంతర యుగంలోకి నిలకడగా ప్రవేశించనున్నాయి. ప్రత్యామ్నాయ నాయకత్వాలను అవి ఆశిస్తాయి, అన్వేషిస్తాయి. ప్రశాంత్ కిశోర్ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించి, బలమైన అట్టడుగు స్థాయి సంస్థాగత నిర్మాణం, విస్తృత సామాజిక సంఘీభావాన్ని కూడగట్టుకుని తనను తాను సర్వజనామోద నాయకుడుగా పునరావిష్కరించుకోగలిగితే బిహార్ చరిత్రకు ఆయనే వేయగలిగే మార్గం ఒకటి తప్పకుండా ఉంటుంది.

> **2030లలో బిహార్ రాజకీయాలు నితీశ్–లాలూ అనంతర యుగంలోకి ప్రవేశిస్తాయి. ప్రత్యామ్నాయ నాయకత్వాలను అవి ఆశిస్తాయి. ప్రశాంత్ కిశోర్ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించి తనను తాను పునరావిష్కరించుకోగలిగితే బిహార్ చరిత్రకు ఆయనే వేయగలిగే మార్గం ఒకటి తప్పకుండా ఉంటుంది.**

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

నిబద్ధతకు మారుపేరు బుద్ధవరపు

నమ్మిన సిద్ధాంతాల కోసం తుదిశ్వాస వరకు నిలబడిన పత్రికా రచయిత బుద్ధవరపు వేంకటరత్నం (నవంబర్ 17, 1925 – నవంబర్ 9, 2025). స్వతంత్ర భారతదేశ తొలితరం తెలుగు పత్రికా సంపాదకులలో ఆయన ఒకరు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం సమీపంలోని నాయకంపల్లిలో పుట్టారు. సామర్లకోట, రాజమండ్రిలలో విద్యాభ్యాసం చేశారు. రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చదివినప్పుడు రచయితలు నండూరి రామ్మోహనరావు, కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యం వారి సహాధ్యాయులు. 1940లో వేంకటరత్నం తరుణప్రాయంలోనే ఆరెస్సెస్ పట్ల ఆకర్షితులయ్యారు. ఆ కాలంలో నాగపూర్ నుంచి తెలుగు ప్రాంతానికి ప్రచారకులుగా వచ్చిన వీఎల్ దేశ్‌ముఖ్ ఉపన్యాసం విన్న వేంకటరత్నం స్వయంసేవక్‌గా, ఆటు తరువాత ప్రచారక్‌గా (1944) మారారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పనిచేసిన ఆయన 1948లో ఆర్ఎస్ఎస్ ఆశయాల వ్యాప్తి కోసం ఏర్పడిన 'జాగృతి' తెలుగు వారపత్రికకు వ్యవస్థాపక సంపాదకులు అయ్యారు. 1948 చివరలో ప్రారంభమైన జాగృతి తొలి సంచికతోనే నిషేధానికి గురైంది. గాంధీజీ హత్య నేపథ్యంలో ఆరెస్సెస్‌ను నిషేధించిన క్రమంలోనే ఆ సంస్థ ఆశయాల కోసం ఏర్పడిన జాగృతిని అప్పటి ప్రభుత్వం నిషేధించింది. అయితే నాటి కృష్ణా జిల్లా కలెక్టర్ క్రోంబితో వాదించి పత్రికను పునః ప్రారంభించడానికి అనుమతి తెచ్చుకున్నవారు వేంకటరత్నం. విజయవాడ కేంద్రంగా వెలువడిన జాగృతి కోసం ఆయనతో పాటు బండారు సదాశివరావు, విశ్వనాథయ్య తదితరులు పనిచేశారు.

గాంధీజీ హత్య తరువాత ఆరెస్సెస్ మీద తీవ్ర దుమారం మొదలయింది. అయితే అవన్నీ దుష్ప్రచారంలో భాగమని, గాంధీ హత్యకు ఆరెస్సెస్‌కు సంబంధం లేదని ప్రత్యేక న్యాయస్థానం తరువాత వెల్లడించింది. కానీ ఇంతలోనే ఎంతో నష్టం జరిగింది. ఎందరో స్వయం సేవకులను జైళ్లకు పంపించారు. కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. ఈ దుష్ప్రచారాన్ని ఎదుర్కొనడానికి ప్రాంతీయ భాషలలో పత్రికలు ప్రారంభించాలని ఆరెస్సెస్ రెండో సర్ సంఘ చాలక్ గురూజీ (గోల్వాల్కర్) ఆశయం మేరకు కొన్ని పత్రికలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రధర్మ పత్రికకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ,



పాంచజన్య పత్రికకు అటల్ బిహారీ వాజపేయి అలా సంపాదకులుగా నియమితులయ్యారు. తెలుగు పత్రికకు బుద్ధవరపు నియమితులయ్యారు. వీరు ముగ్గురు సన్నిహితులు కూడా. 1948 నుంచి 1957 వరకు వేంకటరత్నమే జాగృతి సంపాదకులు.

వేంకటరత్నం కవి, కథకుడు, నవలా రచయిత, వ్యాసకర్త. గురూజీ ఆదేశం మేరకు ఆయన పత్రికా రచన కొత్తగా చేపట్టారు. గాంధీజీ హత్యానంతర పరిణామాలు, భారత్–పాక్ తొలి యుద్ధం, కాందిశీకుల సమస్యలతో నాటి సంక్షుభిత భారతం ఎలా ఉన్నదో జాగృతి నాటి సంచికలు ప్రతిబింబిస్తాయి. ఆ పరిణామాల మీద ఆయన ఇచ్చిన వివరాలు, విశ్లేషణలు ఎంతో లోతుగా కనిపిస్తాయి. ఆంధ్రరాష్ట్ర విభజన, ఆంధ్రప్రదేశ్ అవతరణ, భాషా ప్రయుక్త రాష్ట్రాలు, నిజాం పతనానంతరం తెలంగాణలో పరిస్థితులు వంటి వాటి గురించి ఆయన గొప్ప చారిత్రక దృష్టితో కథనాలు వెలువరించారు. సాహిత్యం వేంకటరత్నం అభిమానాంశం. చారిత్రక అంశాలే ఇతివృత్తంగా స్వయంగా కథలు రాయడమే కాకుండా, ఇతర రచయితల కథలను ఆయన విరివిగా ప్రచురించారు. జైసోమనాథ్ వంటి చారిత్రక నవలల అనువాదాలు కూడా ప్రచురించారు. జాతీయ అంతర్జాతీయ అంశాలపై చాలా మంది ప్రముఖుల వ్యాసాల అనువాదాలు కూడా ఆనాటి జాగృతిలో తరచుగా దర్శనమిచ్చేవి.

1960 దశకం నుంచి కరణీకం (యెర్రమిల్లి, తూర్పుగోదావరి జిల్లా) ఆరంభించి, 80 దశకంలో ఆ వ్యవస్థ రద్దయిన తరువాత హైదరాబాద్‌లో మళ్లీ పత్రికా రచయితగా జీవితం ఆరంభించారు. ఎందరో ప్రముఖులను ఇంటర్వ్యూలు చేశారు. 2001లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఒక కాలు తొలగించారు, నాలుక కూడా తెగింది. దాదాపు రెండు దశాబ్దాలు మంచం మీదే ఉన్నా, ఏనాడూ నిరాశకు లోనవ్వలేదు. ఎవరు వచ్చినా జ్ఞాపకాలు పంచుతూ నిండు నూరేళ్లు జీవించారు.

• పి. వేణుగోపాలరెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్, జాగృతి పూర్వ సంపాదకుడు

(హైదరాబాద్ కాచిగూడలోని జాగృతి కార్యాలయంలో నేడు బుద్ధవరపు వేంకటరత్నం సంస్మరణ సభ)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఏఐతో భాషాభివృద్ధి సాధ్యమేనా?

ఏఐ అనేక సంచలనాలను సృష్టిస్తోంది. గణిత సమీకరణాలను పరిష్కరిస్తోంది. వ్యాసాలు రచిస్తోంది. సంగీత బాణీలు కడుతోంది. ట్యూటరుగా, అనువాదకునిగా... ఇలా ఎన్నో చేస్తున్నది. అనువాద ప్రక్రియను టెక్నాలజీ చాలా సులువు చేసింది. ఒక భాషలోని ఉత్తరాన్నో, వ్యాసాన్నో తప్పులు లేకుండా కేవలం క్షణాల్లోనే మరో భాషలోకి ఏఐ అనువదిస్తుంది. విషయం కచ్చితంగానే అనిపించించా, పేలవంగా ఉంటుంది. అనువాదం అంటే ఒక భాష నుంచి మరో భాషలోకి తర్జుమా మాత్రమే కాదు, విషయంలోకి పరకాయ ప్రవేశం చేసి అందించడం.

అందుకే భాష భిన్నమైనదని భాషావేత్తలు చెబుతారు. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలు ఉంటాయి. కొన్నిసార్లు ఎదుటివారికి మన ఆలోచనలు చెప్పడంలో తడబడతాం. ఆ తప్పులను జాగ్రత్తగా దిద్దుకుంటాం. ఇవన్నీ భాష నేర్చుకోవడంలో మెళకువలే. ఇవి మనలో విశ్వాసాన్ని పెంపొందిస్తాయి. ఒకరితో ఒకరిని కలుపుతాయి. ఏ యాప్‌లు, చాట్‌బాట్‌లు మనకు ఈ సజీవ శిక్షణ అందించగలవు? సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటాయి. యాస, మర్యాదపూర్వక సంభాషణా స్వరాలు మెల్లగా అనుభవంతో మారుతాయి. యంత్రం వీటిని నమోదు చేయగలదు. కానీ అదేమీ మనిషి కాదు కదా! వినడం, అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం, నిరంతర తర్ఫీజు... ఇదే భాషా ప్రావీణ్యతకు నిజమైన సాధనా మార్గం.

– వి. వరదరాజు, శ్రీకాకుళం

నోటు ఓటు వాపసీ!

ఎన్నికలలో ఓటు కొనడానికి రాజకీయ పార్టీలు డబ్బు పంచటం మామూలే. తాము డబ్బు ఇచ్చినా ఆ ఓటరు పోలింగ్ బూత్‌కు వచ్చి అసలు ఓటే వేయలేదని నిర్ధారించుకున్న తర్వాత రాజకీయ పార్టీలు ఇప్పుడు ఓటరును డబ్బు వాపస్ చేయాలని కూడా అడుగుతున్నాయట. ఇదొక వింత పరిణామం. సరే బావుంది. అలాంటపుడు అవే రాజకీయ పార్టీలు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అవుతున్నాయి కదా, మరి ఓటర్ ఎందుకు తన ఓటును వాపస్ చేయాలని అడగకూడదు? పార్టీలు డబ్బును రీకాల్ చేస్తున్నపుడు ప్రజలు ఓటును కూడా రీకాల్ చేయాలి. ఘర్ వాపసీ, అవార్డు వాపసీ లాగా ఓట్ వాపసీ ఎందుకు ఉండదు?


ఈ ప్రజాస్వామ్య వాణిజ్యం ఇప్పటివరకూ చాలా విచిత్రాలను చూసింది. ఒక్కరికే ఓటు వేయగలనన్న సంగతి తెలిసి కూడా ఓటరు అభ్యర్థులందరి దగ్గర నుంచి డబ్బు తీసుకోవడం తెలిసిందే. మాకు ఫలానా అభ్యర్థి తాలూకు డబ్బురాలేదని టెంట్లు వేసి ధర్నాలు చేసిన మహా గొప్ప సందర్భాలూ తెలుసు. ఏకంగా అభ్యర్థుల ఇంటి మీద దాడులు చేసి డబ్బు డిమాండ్ చేసిన ఉదాహరణలూ ఉన్నాయి. ఈ వాణిజ్య పొలిటికల్ సెన్సెక్స్‌లో గత పాతికేళ్లలో షేర్ విలువ ద్రవ్యోల్బణం కంటే అతివేగంగా రెండు వందల రూపాయల నుంచి మూడు వేలకు పెరిగింది.

> **...ఇదంతా అనేకానేక అనైతికతల మధ్య ఘర్షణ.**
> **ఓటు అమ్ముకోవడం ఒక అనైతికత. ఓటు కొనడం మరో అనైతికత.**
> **ఓటు అమ్ముకుని అసలు బూత్‌కి వెళ్లకపోవడం మరింకో అనైతికత.**
> **ఓటు వేయనేలేదు కనుక డబ్బు తిరిగివ్వమనడం ఇంకింకో అనైతికత.**
> **ఇన్ని అనైతికతల నడుమ పరస్పర ఘర్షణలో ఓటమి మాత్రం ప్రజాస్వామ్యానిది. కాదు కాదు ప్రజలదే.**

ఈ నేపథ్యంలో మనం రెండు వర్తకాల గురించి మాట్లాడుకుందాం. ఒకటి చట్ట విరుద్ధం, మరొకటి నైతిక విరుద్ధం. ప్రజాస్వామ్యం గురించి వాణిజ్య భాషలో మాట్లాడుకోవల్సి రావడం విషాదమే. ఇప్పుడు ఓటరుకూ రాజకీయానికీ మధ్య ఈ–కామర్స్ పాలసీ నడుస్తోంది. డబ్బు తీసుకున్న ఓటర్లు పోలింగ్ బూత్‌కి వెళ్లలేదు, ఓటు వేయలేదు. అంటే, "ప్లేస్ చేసిన ఆర్డర్ డెలివరీ కాలేదు" అన్నట్టే. దాంతో పార్టీలు, "సార్, మా పార్టీ వాల్యూకి డబ్బు ఇచ్చాం, మీరు సర్వీస్ తీసుకోలేదు, కాబట్టి మా అమౌంట్ పే బ్యాక్ ఇవ్వండి" అంటున్నాయి. నవ్వొచ్చే ధర్మం కదూ! ఇదంతా వింటుంటే ప్రజాస్వామ్యం కాదు, ఒక చీకటి వర్తకం జరుగుతున్నట్లు అనిపిస్తోంది కదూ! ఓటుకు ధర, వాగ్దానానికి విలువ ప్రజాస్వామ్యంలో 'నో రిటర్న్' పాలసీ అయ్యాయా?

ప్రజాస్వామ్యం అంటే అమ్మకం– కొనుగోలు కాదు, పరస్పర నమ్మక అలిఖిత ఒప్పందం. ఓటుకు డబ్బు పంచడం చట్టవిరుద్ధం. హామీలు నెరవేర్చకపోవడం చట్టపరంగా తప్పు కాకపోయినా నైతిక నేరం. రాజకీయ పార్టీలు డబ్బు ఇచ్చి ఓటును కొనాలనుకోవడం ఎంత తప్పో, ప్రజలను మభ్యపెట్టి మాయ చేసి ఓటు పొందడం కూడా అంతే తప్పు. ఓటు ఆశ చూపి నగదు చేసుకోవడం అంతకంటే ఎక్కువ తప్పు. ఇక్కడే డ్యూయల్ ట్రేడింగ్ నడుస్తోంది. ఓటరు తన ఓటుకు ముడుపు తీసుకుని అదే ఓటును ముడుపుగా చెల్లించి తనకు కావల్సిన ప్రజాస్వామిక సౌకర్యాలను లబ్ధిగా పొందాలనుకుంటున్నాడు. డబ్బు రిఫండ్ సరే, వాగ్దానాల రిఫండ్ ఎక్కడ?

ఓటును కొనేవాళ్లా? ఓటును అమ్ముకునే వాళ్లా? ఎవరు ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోంది అనే ఒక కీలక ప్రశ్న ఇక్కడే ఎదురవుతోంది. ఇప్పటికే పాతాళం ఎక్కడ అంటే పైకి చూపించేంత దిగువన ఉన్నాం. ఇంకా ఏ లోతులకీ దిగజారుడు? రాజకీయ మార్కెట్లో పార్టీలు ఎప్పుడూ ఆఫర్లు ఇస్తూనే ఉంటాయి. పార్టీ మేనిఫెస్టోలు ఓటర్ల హక్కుల పత్రాలు కాదు, సీజనల్ బ్రోచర్లు. అందులో హామీలన్నీ "కొనండి సార్, తర్వాత చూస్తాం" అంటున్నాయి.



నిజానికి డబ్బు తీసుకున్న ఓటరే పాక్షిక నీతిమంతుడు. ఆ ఓటరుకు ఒక నైతిక స్పష్టత ఉంది. "నువ్వు డబ్బు ఇచ్చావా? బాగుంది. నేను తీసుకున్నాను. మరి ఓటు? అది నా ఇష్టం. ఎవరికైనా వేస్తాను, అసలు వేయను" అనగలిగితే అది పాక్షిక నైతిక ప్రజాస్వామ్య స్వేచ్ఛ. ఎన్నికల తర్వాత హామీలు నిలబెట్టని పార్టీలు ఓటర్లను 'పరిగణనలోకి తీసుకోని' స్థితిలో ఉంటే, ఎందుకు ఓటర్లు తమ ఓటును తిరిగి కోరుకోకూడదు? ఇదే ప్రశ్న దేశవ్యాప్తంగా ఒక పెద్ద రాజకీయ, నైతిక చర్చగా మారాలి. మార్చగలరా?

డబ్బులను తిరిగి అడిగే క్రమంలో పార్టీలు నానా హంగామా చేస్తున్నపుడు హామీలు నిలబెట్టని పార్టీల విషయంలో ప్రజలు ఎందుకు నిశ్శబ్దంగా ఉండాలి? ఎన్నికల సమయంలో "మనం చేస్తాం, ఇస్తాం" అని చిట్టా విప్పిన తర్వాత, అధికారంలోకి వచ్చాక రాజకీయ పార్టీలు ఆ హామీలకు చెవిటి చెవిని అప్పగించడం మనకు కొత్తేమీ కాదు. అత్యంత విచిత్రం ఏమిటంటే తాము ఇచ్చిన డబ్బులను తిరిగి అడిగే పార్టీలు, తామే ఇచ్చిన హామీలను మాత్రం అలవోకగా మరిచిపోతాయి. సరే రీకాల్ అనే వ్యవస్థ గురించి ఇప్పుడు మాట్లాడుకోవడం అనవసరమేమో కానీ అది అసెంబ్లీకి పార్లమెంటుకు వర్తించదు. అలా వర్తించాలి అని డిమాండ్ చేయడం అవసరమే కానీ ఈ లోగానే ప్రజాస్వామ్యం భ్రష్టుపట్టే సూచనలు కొట్టొచ్చినట్టు కనపడుతున్నాయి. అధికారాన్ని ఎవరికిచ్చామో మర్చిపోయే ప్రజాస్వామ్యం బలహీన ప్రజాస్వామ్యమవుతుంది. అధికారాన్ని అవసరమైతే వెనక్కి తీసుకునే ప్రజాస్వామ్యం మాత్రమే తన బలాన్ని ప్రదర్శించగలుగుతుంది. మా ఓటును కూడా వెనక్కి తీసుకునే హక్కు మాకు ఉండాలి కదా? ఈ ప్రశ్న సామూహిక అవగాహనగా మారితే, అదే దేశ రాజకీయ పటాన్ని మార్చే శక్తి.

ప్రజాస్వామ్యం అంటే అయిదేళ్లకోసారి ఓటు వేసో వేయకుండానో బాధ్యత నుంచి పారిపోయి చేతులు దులుపుకోవడం కాదు. అది అప్రమత్తత, ప్రశ్నించే ధైర్యం, హక్కులను మళ్లీ మళ్లీ స్వాధీనం చేసుకునే శక్తి. ఓటు అనేది ఒక్క రోజు వేసి మరిచిపోయే వన్ డే స్టాండ్ కాదు. అది ప్రతినిధికి అయిదేళ్లపాటు మన జీవితాల్లో, మన గ్రామాల్లో, మన రాజకీయ భావజాలంలో జోక్యం చేసుకోవడానికి ఇచ్చే అధికార పత్రం. మన నిత్య జీవిత గమనాన్ని సులభతరం చేయడానికి ఇచ్చే అయిదేళ్ల పర్మిట్. ఈ అధికార పత్రాన్ని దుర్వినియోగం చేస్తే? హామీలను నిలబెట్టకపోతే? ప్రజలతో సంబంధం కోల్పోతే? రీకాల్ చేయాలి. అధికారాన్ని ఇచ్చింది ప్రజలే అయితే, దానిని వెనక్కి తీసుకునే హక్కు కూడా ప్రజలదే కదా. ఇదే 'రీకాల్' అనే ప్రజాస్వామ్య హక్కు మూల భావన.

ఎన్నికైన ప్రజాప్రతినిధి తన బాధ్యతలను నిర్వర్తించకపోతే, అతణ్ణి పదవిలో నుంచి మధ్యంతరంగానే ప్రజలు తొలగించే హక్కు. ఇది కొన్ని దేశాల్లో, కొన్ని రాష్ట్రాల్లో అమల్లో ఉంది. మన దేశంలోని కొన్ని స్థానిక సంస్థల్లో కూడా రీకాల్‌కు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. అప్పుడే వాగ్దానాలు కేవలం ప్రసంగాల కోసం కాకుండా ఒప్పందాలుగా మారతాయి. ఓటర్లు అయిదేళ్లకు ఓసారి కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షకులుగా మారతారు, రాజకీయం సేవారంగంగా తిరిగి మారడానికి అవకాశం ఉంటుంది. ఇదంతా ఒక కల. ఒక ఆశ. ఒక ఆకాంక్ష.

ఇదంతా అనేకానేక అనైతికతల మధ్య ఘర్షణ. ఓటు అమ్ముకోవడం ఒక అనైతికత. ఓటు కొనడం మరో అనైతికత. ఓటు అమ్ముకుని అసలు బూత్‌కి వెళ్లకపోవడం మరింకో అనైతికత. ఓటు వేయనేలేదు కనుక డబ్బు తిరిగివ్వమనడం ఇంకింకో అనైతికత. ఇన్ని అనైతికతల నడుమ పరస్పర ఘర్షణలో ఓటమి మాత్రం ప్రజాస్వామ్యానిది. కాదు కాదు ప్రజలదే. ఈ పోరాటంలో ప్రజలు గెలవాలంటే 'నాకే మీ ఓటు' అని అడిగేవాళ్లతో 'నా ఓటు నాకిచ్చెయ్' అని అడగాలి. అడగగలగాలి.

పార్టీలు ఓటు కొనుక్కోవడానికి ఆర్డర్ పెట్టి, సరుకు డెలివరీ కానపుడు ఆ డబ్బు రిటర్న్ తీసుకోవడానికి పరితపించడం సబబే అనుకున్నా, ప్రజలు ఓటు ఇచ్చి వంచనకు గురయినపుడు తీసుకోవల్సిన రీఫండ్ మాత్రం ఒక్కటే– మరో ఎన్నికలో ఓటు హక్కు. అమ్ముడుపోని ఓటు హక్కు.

■ ప్రసేన్ (కవి, రచయిత)

సీఎం కక్ష సాధింపు చర్యలు : ఎర్రబెల్లి

హనుమకొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. గురువారం విడుదల చేసిన వీడియోలో ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో దొంగ ఓట్లతో గెలిచి అదే దౌర్జన్యం ఇంకా ప్రదర్శిస్తున్నారని అన్నారు. గవర్నర్‌పై ఒత్తిడి తెచ్చి కేసులు పెడుతున్నారని, ఎలాంటి కేసులైనా ఎదుర్కొంటామని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా ఎన్నికల హామీలు అమలు చేయాలని, లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని దయాకర్‌రావు హెచ్చరించారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

● పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డ్రగ్ రహిత సమాజమే మనందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యల్లో భాగంగా, మత్తు పదార్థాల వినియోగించే వారితో పాటు, వీటిని విక్రయాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు, అలాగే యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని తెలిపే విధంగా డ్రగ్ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో 'సే నో టూ డ్రగ్' నినాదంతో రూపొందించిన ప్రచార గోడ పత్రికలను వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం అధికారులతో కలిసి కమిషనరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. యువత భవితవ్యాన్ని కాపాడుకోవడం మనందరి ప్రధాన కర్తవ్యమన్నారు. మత్తు పదార్థాల నియంత్రణలో ప్రజలు సైతం పరోక్షంగా తమ వంతు సహకారాన్ని అందించాల్సి వుంటుందన్నారు. ఇందుకోసం ఎవరైనా మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగాలకు పాల్పడితే తక్షణమే 8712584473, 8712685299 నెంబర్లకు సమాచారం అందించి డ్రగ్ రహిత సమాజానికి భాగస్వాములు కావాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీపీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనా విభాగం అదనపు డీసీపీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, ఆర్ఐ శివకేశవులు, ఇన్‌స్పెక్టర్ సతీష్, ఆర్ఎస్ఐలు పూర్ణచందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి, నాగరాజు, ర్యాపిడో సంస్థ ప్రతినిధులు దుర్గారావు, సందీప్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం తగదు

● ఆన్‌లైన్ చెల్లింపులు వెంటనే చేయాలి
● పీపీసీఎస్ అధికారులపై కలెక్టర్ స్నేహ శబరీష్ ఫైర్
● జయగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

7

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో వేలానికి పెట్టిన బాలసముద్రంలోని 2.27 ఎకరాల ప్రభుత్వ భూమి ఇదే..



కుడా బలుక్కున్నారు!?

నగరంలో ప్రభుత్వ భూముల వేలంపై వివాదం

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

అభివృద్ధి పనులకు నిధులను సమకూర్చుకునేందుకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ప్రభుత్వ భూముల వేలానికి దిగింది. నగరం నడిబొడ్డున బాలసముద్రంలో ఉన్న 2.27 ఎకరాల భూమిని గంపగుత్తగా అమ్మకానికి పెట్టింది. అయితే ఈ విషయంలో అనేక అనుమానాలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్లాట్లుగా విక్రయించకుండా.. ఏకమొత్తంలో భూమిని వేలం పెట్టడం వెనుక అధికారపార్టీ నేతల హస్తం ఉందనే ప్రచారం జరిగింది. వ్యాపారపరంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకే భూమిని వేలం పెట్టామని అధికారులు పేర్కొంటుండగా, క్రీడామైదానానికి కేటాయించిన భూమిని కుడా ఎలా అమ్ముకుంటారని ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ వివాదాల నేపథ్యంలో తాత్కాలికంగా వేలం వాయిదా వేసినప్పటికీ హాట్‌కేక్ లాంటి భూమిని అమ్మడం కంటే కుడానే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేసి, అద్దెలకు ఇస్తే ఆదాయం వస్తుంది కదా అనే చర్చ జరుగుతోంది.

ఆదాయం కోసం వేలం

ఆదాయం కోసం కుడా ప్రభుత్వ భూములను వెంచర్లుగా చేసి, ప్లాట్లు విక్రయిస్తోంది. నగరంలో ఓ సిటీ, మా సిటీ, యునీ సిటీ పేర్లతో భారీగా ప్లాట్ల వ్యాపారం చేసింది. ఇటీవలకాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవటంతో కుడా ప్లాట్లకు డిమాండ్ లేకుండా పోయింది. 117ఎకరాల్లో ఓ సిటీలో చేసిన ప్లాట్లు అనేకం ఇంకా అమ్ముడు పోవాల్సి ఉంది. పశ్చిమ, దక్షిణ ముఖం గల ప్లాట్లు కొనుగోలుకు ప్రజలు ఆసక్తిచూపక పోవటం ఈ ప్లాట్లు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయి. ఉనికిచర్ల సమీపంలో కుడా చేసిన వెంచర్‌ను స్పోర్ట్స్ స్కూల్ కోసం స్థల సేకరణ చేస్తున్నారు. ఈ క్రమంలో కుడా ఆదాయం పడిపోవటంతో అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడుతోంది. దీంతో హనుమకొండ నడిబొడ్డున బాలసముద్రంలోని సర్వే నెం.1066/5లో గల 2.27ఎకరాల (12,957గజాల) భూమిని వేలం ద్వారా విక్రయించేందుకు కుడా ఏర్పాట్లు చేసింది. హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌కు అతి సమీపంలో ఉండటంతో దీని ద్వారా సుమారు రూ.100 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనాతో గత అక్టోబరు 22వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. వాణిజ్య (మిగతా 7లో..)

● రూ.100కోట్ల విలువైన 2.27 ఎకరాల భూమి వేలానికి 'కుడా' ప్రకటన
● అభ్యంతరాలు, ఆరోపణలతో తాత్కాలికంగా వాయిదా
● గంపగుత్తగా వేలానికి సిద్ధం కావడంపై అనుమానాలు
● అధికార పార్టీ ప్రజాప్రతినిధుల బినామీలకు కట్టబెట్టేందుకేనని ప్రచారం
● ప్లాట్లు చేస్తే ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తుంది కదా.. అని పలువురి వాదన
● కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు కోసమే అంటున్న 'కుడా'
● ఐటీ టవర్, కమర్షియల్ కాంప్లెక్స్‌పై దృష్టి పెట్టాలంటున్న నగరవాసులు

సీఎం కుట్రలు.. నాయిని అమలు..

● హామీలను నెరవేర్చక బీఆర్ఎస్‌పై ఆరోపణలు
● బెదిరింపులు, హత్యలు చేయడమే ప్రజాపాలనా?
● రెండేళ్లలో రూ.4లక్షల కోట్ల అప్పు ఏంచేశారో చెప్పాలి?
● బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హనుమకొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై చేస్తున్న కుట్రలను ఇక్కడి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి ప్రవీణ్‌కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించారన్నారు. దీనిని కప్పి పుచ్చుకునేందుకే స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కోదాడలో సీఎంఆర్ఎఫ్ విషయంలో ప్రశ్నించిన రాజేష్ అనే దళిత యువకుడిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తే మరణించాడని ఆరోపించారు. దీనికి బాధ్యతగా హోంశాఖను చూస్తున్న రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వంలో బెదిరింపులు, హత్యలు చేయడమే ప్రజాపాలనా.. అని ఆయన ప్రశ్నించారు. మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మితపటేల్ సీఎం సన్నిహితుడు (మిగతా 6లో..)

పెంచిన అంచనాలపై విజిలెన్స్ విచారణ జరపాలి

మాజీ ఉపముఖ్య మంత్రి తాటికొండ రాజయ్య

మాజీ మంత్రి హరీష్‌రావు నాయకత్వంలో కేసీఆర్ సూచనలతో ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు వరంగల్ నగరంలో 24 అంతస్థుల భవనం, 80శాతం పనులు పూర్తి అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు సమీక్ష చేయలేదని మాజీ ఉపముఖ్య మంత్రి తాటికొండ రాజయ్య విమర్శించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఉప్పుగల్ రిజర్వాయర్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.476 కోట్లతో కృషి చేస్తే.. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రతిపాదనలు రూ.1001 కోట్లకు పెంచారన్నారు. దాదాపు రూ.524 కోట్ల అంచనాలు తన అనుచరులకు కాంట్రాక్టు పనులు ఇప్పించారని ఆరోపించారు. ఈ పనులపై విజిలెన్స్ విచారణ జరిపించాలని రాజయ్య డిమాండ్ చేశారు.

గన్‌మెన్లు లేకుండా బస్టాండ్‌కు రా!

హనుమకొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'అడ్డిమారి గుడ్డి దెబ్బలో ఎమ్మెల్యేగా గెలిచావు... హనుమకొండ బస్టాండ్ వద్ద చిరు వ్యాపారుల పొట్టకొట్టావు.. దమ్ముంటే గన్‌మెన్లు లేకుండా బస్టాండ్‌కు ఒక్కడివే రా...' అని బీఆర్ఎస్ నేత, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్... ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి సవాల్ విసిరారు. హనుమకొండ బస్టాండ్ వద్ద రెండు రోజుల క్రితం ఆర్టీసీ అధికారులు డబ్బాలను తొలగించిన విషయం విదితమే. ఈ ఘటన నేపథ్యంలో బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం వినయభాస్కర్ మీడియాతో మాట్లాడారు. రాజకీయ పరిజ్ఞానం లేని రాజేందర్‌రెడ్డి.. ఎమ్మెల్యేగా గెలిచి రెండేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, ఆటో కార్మికులకు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో రాళ్లతో ఏవిధంగా బుద్ధి చెప్పారో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి గుర్తు తెచ్చుకోవాలని హితవుపలికారు. రెండేళ్లు గడిచినా గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రైతులకు ముఖం చూపించలేక నాలుగు గోడల మధ్య ప్రెస్‌మీట్లు పెట్టి విమర్శలు చేస్తున్నాడని విమర్శించారు.



మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

● ఎమ్మెల్యే నాయినికి వినయభాస్కర్ సవాల్
● చిరు వ్యాపారుల పొట్టకొట్టాడని ఆరోపణ

ఇదిగో వచ్చా.. చూడు!

● అర్థం లేని ఆరోపణలు మానుకో..
● వినయభాస్కర్‌కు ఎమ్మెల్యే నాయిని కౌంటర్



హనుమకొండ బస్‌స్టేషన్ వద్ద ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ విసిరిన సవాల్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్వీకరించారు. దమ్ముంటే గన్‌మెన్లు లేకుండా హనుమకొండ బస్‌స్టేషన్‌కు రావాలని వినయ్ సవాల్ విసరగా, అరగంటలోనే ఎమ్మెల్యే నాయిని గన్‌మెన్లు లేకుండా బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిరు వ్యాపారుల పొట్టగొట్టినట్లు తనపై వినయ్ భాస్కర్ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజా క్షేత్రంలో ఉండే తాను గన్‌మెన్లు లేకుండా తిరగాలని సవాల్ విసరడం హాస్యాస్పదమని అన్నారు. రాజకీయాలను భ్రష్టుపట్టించిన బీఆర్ఎస్ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య దిగజారుడు రాజకీయాలు చేశారని విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గతంలో విద్యావంతుడిగా ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శంగా ఉండేవారని, ఇప్పుడు కేసీఆర్ మెప్పు కోసం అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద చిరు వ్యాపారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సీఎం కృషితో ప్రత్యేక నిధులు

● రూ.18 కోట్ల నిధులతో 6 వంతెనలకు శంకుస్థాపన
● ఎంపీ కడియం కావ్య

6

చలికాలం.. వ్యాధుల గాలం..

● ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు
● అలసత్వం వహిస్తే సమస్యలు తప్పవని హెచ్చరిక

7

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్


● విధుల్లో నిర్లక్ష్యం వహించడమే కారణం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మహబూబ్‌నగర్ ఎంపీపీఎస్‌లో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఉపాధ్యాయులపై డీఈవో బి.రంగయ్యనాయుడు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బి.జగన్మోహన్, జి.వెంకటేశ్వర్లు అనే ఇద్దరు ఎస్జీటీలు సమయపాలన పాటించకపోవడంతో పాటు ఎస్ఏ-1 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడంలోనూ అలసత్వం వహించినట్లు రంగయ్య పేర్కొన్నారు. మార్కుల రిజిస్టర్‌ను నిర్వహించకపోవడంతో పాటు పాఠశాలకు అనధికారిక గైర్హాజరు, పాఠశాలలో సెల్‌ఫోన్ వినియోగించడం, పాఠ్యాంశాలు బోధించకపోవడం చేశారన్నారు. దీంతో పాఠశాల మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడటంతో వారిద్దరిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్ వేటు వేసినట్లు డీఈవో పేర్కొన్నారు.

డెంటల్ వైద్యుడిపై కేసు

ఎండీఎస్ పట్టా లేకున్నా ఉన్నట్టు చెబుతూ వైద్యం

వరంగల్ క్రైం, నవంబరు (ఆంధ్రజ్యోతి): ఎండీఎస్ పట్టా లేకున్నా ఉన్నట్లుగా ప్రజలను నమ్మిస్తూ డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్న డాక్టర్ శేషుకుమార్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. బీడీఎస్ పూర్తి చేసిన శేషుకుమార్ గత కొంత కాలంగా ఎండీఎస్ పూర్తి చేసినట్లుగా పత్రిక ప్రకటనలు ఇస్తూ జీఎల్ఎస్ డెంటల్, ఇంప్లాంట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. దీనిపై ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వైద్యులు రాష్ట్ర దంత వైద్య మండలి, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. విచారణలో ఎండీఎస్ పట్టా లేకుండా ప్రజలను మోసం చేస్తున్నాడని నిర్ధారణ కావడంతో జిల్లా వైద్యాధికారి ఫిర్యాదు మేరకు శేషుకుమార్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.





ప్రీ ప్రైమరీ స్కూళ్లకు మహర్దశ

● పాఠశాలలకు బోధన సామగ్రి
● స్కూళ్లను అందంగా తీర్చిదిద్దేందుకు నిధులు
● ఒక్కో పాఠశాలకు రూ.1.70 లక్షల విడుదల
● పిల్లలకూ పాలు పంపిణీ యోచన

హనుమకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలలకు మహర్దశ పట్టనున్నది. అయిదేళ్ల లోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్న ఈ పాఠశాలలకు బోధనాభ్యసన సామగ్రిని సమగ్ర శిక్ష అధికారులు సమకూరుస్తున్నారు. ఆటపాటలతో చిన్నారులకు బోధన చేసేందుకు ఈ సామగ్రి ఉపయోగపడనున్నది. వీటితో పాటు తరగతి గదులకు రంగులు, బాలలకు ఏకరూప దుస్తులు అందించనున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అధునాతన వసతులతో చిన్నారులనే కాకుండా వారి తల్లిదండ్రులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ ఏడాది అక్టోబరులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 241 ప్రీప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేశారు. వీటికి ఒక ఇన్‌స్ట్రక్టర్, చిన్నారులను చూసుకోవడానికి ఆయాను విద్యాశాఖ నియమించింది. ప్రస్తుతం 1300 మంది బాలలు చేరగా యూకేజీ తరగతులు బోధిస్తున్నారు. అయితే సాధారణ రీతిలో బోధన చేస్తుండటంతో చిన్నారులు ఆకర్షితులు కావడం లేదని తెలుస్తోంది. కిడ్స్ కేర్ పాఠశాలలను తలపించేలా ఈ పాఠశాలల్లో అధునాతన వసతులు, ఆటపాటలతో కూడిన బోధన పద్ధతులతో తీర్చిదిద్దే విషయమై సమగ్ర శిక్ష అధికారులు దృష్టి నిలిపారు.

బోధన సామగ్రికి నిధులు

జిల్లాలోని ఒక్కో ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలలకు రూ. 1.70 లక్షల నిధులు కేటాయించి వీటిని తీర్చిదిద్దుతున్నారు. సామగ్రి, బోధనాభ్యసన సామగ్రి అందించనున్నారు. ఇప్పటికే ఇవి జిల్లాకు చేరడంతో ఎంఈవోల ద్వారా పాఠశాలలకు పంపిణీ చేశారు. పాఠశాల తరగతి గదులను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు రూ. 50వేలతో రంగులు వేయిస్తున్నారు. రూ. 20వేలతో బాలలకు దుస్తులు, స్టేషనరీ సమకూరుస్తున్నారు. ఆట పాటలతో అభ్యసనాన్ని సాగించేందుకు పలు రకాల వస్తువులు, ఆట బొమ్మలు, రంగు రంగుల ఆకారాలు వంటివి అందించనుండటంతో చిన్నారులు చదువుపై ఆసక్తి చూపిస్తారని, ఈ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

ప్రీప్రైమరీ స్కూళ్లకు కూడా...

ప్రీ ప్రైమరీ స్కూళ్లలోని చిన్నారులకు కూడా ప్రతీ రోజు పాలు పంపిణీ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల్లోని 3-6 ఏళ్ల మధ్య వయస్సు గల చిన్నారులకు ఏడాదిలో 200 రోజుల పాటు రోజు 100 మి.లీ. విజయా డెయిరీ పాలు పంపిణీ చేయడానికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రుతి ఓజా ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు లీటర్ విజయా డెయిరీ డబుల్ టోన్డ్ యాహెచ్‌టీ టెట్రా ప్యాకెట్లను పంపిణీ చేస్తారు. ఆ పాలను వేసి పంచదార లేదా బెల్లం కలిపి గోరువెచ్చగా పిల్లలకు తాగిస్తారు. ములుగు జిల్లా కేంద్రంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న ఈ పథకంపై క్షేత్ర స్థాయి ఉద్యోగులు, పిల్లల తల్లిదండ్రుల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరిస్తారు. పథకం విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్

23న మోషన్ టాలెంట్ టెస్టు ఎగ్జామ్

కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్

హనుమకొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నయీం నగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ జూనియర్ కాలేజీలో 23న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ తెలిపారు. గురువారం కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ.. 23న దేశవ్యాప్తంగా మోషన్ కాలేజీ విద్యాసంస్థల్లో టాలెంట్ టెస్టు ఎగ్జామ్‌నిర్వహిస్తున్నట్లు పదో తరగతి విద్యార్థులు ఎగ్జామ్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. టాలెంట్ టెస్టు రిజిస్ట్రేషన్ కోసం సెల్ నంబర్లు : 9703000850/851/852లకు సంప్రదించాలని కోరారు. సమావేశంలో కాలేజీ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్‌గౌడ్, బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్, ఏజీఎం శనిగరపు సుమన్, ఏవో తాళ్లపెల్లి రమేష్, పాక నాగరాజు, రచ్చ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు సురేందర్, వెంకట్, రవీందర్, మనోహర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు

నర్సింగ్ కోర్సులో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం)లో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(నర్సింగ్) కోర్సు శిక్షణ కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ పి. జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2 ఏళ్ల శిక్షణకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్ మెమోలు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈనెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో డే, రెసిడెన్సియల్ సదుపాయాలు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్. 76600 22525/76600 22526 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సీఎం కుట్రలు.. నాయిని అమలు..

(5వ పేజీ తరువాయి)

రోహిత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఎర్ర రాజశేఖర్ అనే దళిత యువకుడి తమ్ముడు కులాంతర వివాహం చేసుకుంటే రాజశేఖర్‌ను కొట్టి కాలబెడితే ఇప్పటివరకు చర్యలు లేవన్నారు. రాష్ట్రంలో పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ముఖ్యమంత్రి, మంత్రులు జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం గల్లీల్లో తిరిగారని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు పోరాటం వల్లనే ప్రభుత్వంలో చలనం వచ్చి సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో రూ.4లక్షల కోట్లు అప్పులు చేశారని, వాటితో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో 11వందల మంది గురుకుల విద్యార్థులు, రైతులు, ఆటోడ్రైవర్లు చనిపోయారని, వారి మరణాలకు నైతిక బాధ్యత వహిస్తూ రేవంత్‌రెడ్డి రాజీనామా చేయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగరావు, సోదా కిరణ్, వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయిమోద్దీన్, పోలెపల్లి రామ్మూర్తి, వినీల్‌రావు, చాగంటి రమేష్, వస్తం అనిల్, సదాంత్, శ్రీధర్, సారిక తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

వీసీలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సత్యశారద, డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌వో విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, డీపీవో కల్పన తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

2002 సంవత్సరంలో నమోదైన ఓటర్ల జాబితాను ప్రస్తుతం(2025) ఉన్న ఓటర్లను స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో సరిపోల్చడం జరుగుతుందని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, ఈఆర్‌వోలు, అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్లను నమోదు చేయడం, చనిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించడం, ఇతర సవరణలు చేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, ఎలక్షన్ డీటీ రంజిత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నుంచి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, టీడీపీ కె.శ్యామ్, బీజేపీ హరిశంకర్, వైఎస్‌ఆర్ సీపీ రజనీకాంత్, డీఎస్పీ నుంచి జె.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, ఇతర అధికారులు

క్రీడలకు పెద్దపీట వేస్తున్న సీఎం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రకాశ్‌రెడ్డిపేటలోని ఐడియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 9వ రాష్ట్రస్థాయి బాలబాలికల టెన్నికాయిట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిభగల క్రీడాకాలను ప్రోత్సహించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ ఆదుకుంటున్నారని గుర్తు చేశారు. ప్రతిభ గల క్రీడాకారులను తీర్చిదిద్దడమే ధ్యేయంగా ఇటీవల హనుమకొండ జేఎన్‌ఎస్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 4వ క్రీడా పాఠశాలను ప్రారంభించామన్నారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభతో రాణించి జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

హనుమకొండ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర కోశాధికారి అలువాల రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 250 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 26 నుంచి 28 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టెన్నికాయిట్ రాష్ట్ర అధ్యక్షుడు అగర్వాల్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి స్వర్ణ, ఆర్టీఐ మెంబర్ సతీష్, కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, వరంగల్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోకారపు శ్యామ్‌కుమార్, సర్ఫరాజోద్దీన్, ఫిరోజుద్దిన్, పీఈటీ పాష, ఉమ్మడి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కోశాధికారి జహుర్, వివిధ జిల్లాల టెన్నికాయిట్ అసోసియేషన్ బాధ్యులు, పీఈటీలు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

23నాటి మారథాన్‌ను జయప్రదం చేయాలి

హనుమకొండ సిటీ, (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న నగరంలో చేపట్టనున్న హాఫ్ మారథాన్ రన్‌ను జయప్రదం చేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నగరవాసులను కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్ నగర చరిత్రలోనే హాఫ్ మారథాన్ రన్ తొలిసారిగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ థీమ్‌తో నిర్వహించే రన్‌లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాజేందర్‌రెడ్డి కోరారు.



కలెక్టర్ సత్యశారదను అభినందిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

కలెక్టర్‌ను అభినందించిన ఎమ్మెల్యే రేవూరి

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో జల సంరక్షణ కేటగిరి-2లో వరంగల్ జిల్లాకు మొదటి స్థానం దక్కిన నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుతోపాటు రూ.1 కోటి దక్కించుకున్న విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ సత్యశారద అవార్డు స్వీకరించిన తరుణంలో గురువారం కలెక్టర్ చాంబర్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో జల సంరక్షణ చర్యలను విజయవంతంగా చేపట్టి రాష్ట్రానికి ప్రతిష్ఠ తెచ్చారని ప్రశంసించారు.

రీప్లేస్‌మెంట్ నియామకాల్లో మాయాజాలం

కొందరు ఎస్‌ఐలు, జవాన్లు ముందస్తు వసూళ్లు

130 మందికి 54 మంది దరఖాస్తుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో గురువారం జరిగిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రిప్లేస్‌మెంట్ ఉద్యోగ నియామకాలు మరోమారు వివాదాస్పందంగా మారాయి. ప్రస్తుతం 130మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 60 ఏళ్ల పైబడి, అనారోగ్య సమస్యలు, మృతి చెందిన వారి స్థానంలో కుటుంబ సభ్యులను నియమించుకునేందుకు ఆర్జీ పెట్టుకున్నారు. ఈ క్రమంలో యేడాదిన్నర కిందట దరఖాస్తు చేసుకున్న వారికి ఉద్యోగాలు కల్పిస్తూ హైదరాబాద్ పురపాలక శాఖ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో గురువారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో గతంలో, ప్రస్తుతం ఆర్జీ పెట్టుకున్నవారి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, వృద్ధుల పరిస్థితి, 60 ఏళ్ల నిండినట్టు ఆధార్‌కార్డులను అధికారులు పరిశీలించారు. ఈ ఉద్యోగ నియామక కమిటీ మెంబర్లుగా అదనపు కమిషనర్, ఇద్దరు ఆరోగ్య అధికారులు, ఇద్దరు హార్టికల్చర్ అధికారులు, ఒక ఎస్‌ఈ ఇద్దరు ఈఈలు, ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

ముందస్తుగానే వసూళ్ల దందా..

శానిటేషన్, ఇంజనీరింగ్, హార్టికల్చర్ విభాగాలతో పాటు పరిపాలనా విభాగంలో పని చేసే వారి స్థానాల్లో చేరేందుకు కుటుంబసభ్యులు ఏడాదిన్నర కిందట దరఖాస్తు చేసుకున్నారు. ఈ తతంగానికి ముందు వారు పనిచేసే డివిజన్ జవాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్ దరఖాస్తుపై ఆమోదం తెలపాలి. ఇదే అదునుగా భావించిన కొందరు జవాన్‌లు, వైట్‌కాలర్ జవాన్లతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అందిన కాడికి దండుకున్నట్టు సమాచారం. ఒక్కొక్కరి వద్ద రూ20వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసినట్టు తెలిసింది. ఉన్నతాధికారులతో పాటు పాలకవర్గం పెద్దలకు ఇవ్వాలని నమ్మించి వసూలు చేశారు. మొత్తంగా ఈ రిప్లేస్‌మెంట్ నియామకాల్లో రూ.కోటి వరకు లావాదేవీలు జరిగినట్టు సమాచారం.

130 మందికి 54 మంది హాజరు

జీడబ్ల్యూఎంసీలో ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వర్తించేందుకు వారి కుటుంబసభ్యుల స్థానంలో పని చేసేందుకు 130 మంది అర్హులు దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి గురువారం కౌన్సిల్ హాల్‌లో జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనకు 54 మంది మాత్రమే హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. శానిటేషన్ విభాగంలో మరణించిన వారిలో 5గురికి, 60 ఏళ్ల నిండిన వారి స్థానంలో 29 మందిని నియమించినట్టు తెలిపారు. అదే విధంగా 20మంది ఇంజనీరింగ్ విభాగంలో నియామకాలు జరిగినట్టు అధికారులు వెల్లడించారు. ఇంకా మిగిలిన 76 మందికి తిరిగి నోటీసులు జారీ చేసి రెండోసారి కౌన్సెలింగ్ ద్వారా రిప్లేస్ చేస్తామని అధికారులు వెల్లడించారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న బల్దియా అధికారులు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

పైల్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

డాక్టర్ కూరపాటి రమేశ్

వరంగల్ మెడికల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పైల్స్ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ కూరపాటి రమేశ్ సూచించారు. ప్రపంచ పైల్స్ దినోత్సవాన్ని గురువారం ఐఎంఏ సహకారంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూరపాటి రమేశ్ మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు అధునాతన లేజర్ చికిత్సలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రత్యేక రాయితీతో నెలపాటు సేవలు అందిస్తామని పేర్కొన్నారు. అలాగే ఆధునిక వైద్యంలో లేజర్, లాపరోస్కోపి విధానాల ద్వారా నొప్పిలేని, సురక్షితమైన చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. ఈ ర్యాలీ కాకతీయ మెడికల్ కాలేజీ నుంచి ఎంజీఎం వరకు కొనసాగగా.. డాక్టర్ కూరపాటి రాధిక, డాక్టర్ సుధాకర్ కల్పగిరి, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, కేఎంసీ వైద్య విద్యార్థులు ఎంజీఎం, రెమా నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటన

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆటోల యజమానులు వారికి కేటాయించిన ఇళ్ల నుంచి చెత్తను విధిగా సేకరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. గురువారం వరంగల్ నగరంలోని 60వ డివిజన్ ఎస్‌బీహెచ్‌కాలనీ, టీచర్స్‌కాలనీ ఫేజ్ 1,2తో పాటు విజయపాల్‌కాలనీలో అక్కడి సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆటోలు నిర్దేశిత చెత్త సేకరణ చేయాలని అన్నారు. ప్రస్తుతం 5 ఆటోలు మాత్రమే 95 శాతం పనులు చేస్తుండగా.. మిగతా ఆటోలు 65 శాతం మాత్రమే పని చేస్తున్నట్టు ఐసీసీసీ నుంచి గుర్తించామన్నారు. ఇంకా కాలనీలలో డ్రైనేజీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆటోలకు రూట్ ఆప్టిమైజేషన్ బాగుందని, కానీ చెత్త సేకరణ ఊహించిన విధంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటేషన్ అధికారులు బయోకంపోస్ట్ యూనిట్లపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈ రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



విజయపాల్ కాలనీలో మునిసిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

విద్యార్థులను తీర్చిదిద్దడమే రెజోనెన్స్ లక్ష్యం

కళాశాల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి



కార్యక్రమలో మాట్లాడుతున్న ట్రైసిటిస్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

హనుమకొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక విద్యారంగంలోనేకాక అన్ని కళల్లోనూ ప్రావీణ్యం పొందేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే రెజోనెన్స్ లక్ష్యమని రెజోనెన్స్ చైర్మన్ లెక్కల రాజిరెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ ములుగు రోడ్డులోని ఓ ప్రైవేట్ హాల్‌లో రెజోతరంగ్ 2025 వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా లెక్కల రాజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడిని జయించడానికే కాక వారిలోని సృజనాత్మకతను వెలికితీయడానికి క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు తోడ్పాడుతాయన్నారు. ఈ కార్యక్రమానికి ట్రైసిటిస్ ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ హాజరై వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులకు రెజోనెన్స్ విద్యాసంస్థ మంచి విద్యను అందిస్తున్నదని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులతోపాటు ఉద్యోగాలు సాధించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యాక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలుగు సినిమా హీరో ఆది సాయికుమార్, హీరోయిన్ యామిని, చిత్ర యూనిట్ సభ్యులు భాస్కర్, శాంభవి విద్యార్థులతో కలిసి స్టెప్పులేసి అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సీఈవో లెక్కల రమ్య, రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఐటీ రామయ్య జన్మదిన వేడుకలు

హనుమకొండ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, పూర్వ శాసనమండలి సభ్యుడు చుక్కా రామయ్య 99వ జన్మదిన వేడుకలు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విద్యానగర్ లోని ఆయన స్వగృహంలో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా వరం గల్ నుంచి పలువురు ఆయన జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన స్వగ్రామం అయిన పాలకుర్తి మండలం గూడూరు గ్రామానికి చెందిన శ్రీ పోతన చైతన్య వేదిక అధ్యక్షులు ఆర్తి పరాంకుశం, కార్యదర్శి అనుముల ఎల్లయ్యతోపాటు పాలకుర్తికి చెందిన ప్రముఖ రచయిత డాక్టర్ శంకర మంచి శ్యాంప్రసాద్ తదితరులు ఉన్నారు. రామయ్యను వారు దుశ్శాలు వాతో సత్కరించి వారి నుంచి ఆశీస్సులు అందుకున్నారు. తన స్వగ్రామ మైన గూడూరులోని పోతన చైతన్య వేదిక కార్యకలాపాలను రామయ్య ఈ సందర్భంగా ప్రత్యేకించి అడిగి తెలుసుకున్నట్లు పరాంకుశం తెలిపా రు. అదే విధంగా వరంగల్‌కు చెందిన విశ్రాంత కళాశాలల అధ్యాపకుల సంఘం పక్షాన అధ్యక్షులు డాక్టర్ పులి సారంగపాణి, కార్యదర్శి డాక్టర్ మల్లారెడ్డి, జాయింట్ సెక్రెటరీ బి.కృష్ణమూర్తి తదితరుల ఆధ్వర్యంలో పలువురు అధ్యాపకులు హైదరాబాద్‌కు తరలివెళ్లి రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెల్లని వస్త్రాలతో కుంభావ సరస్వతిగా జిల్లా నుంచి తరలివచ్చిన అనేక మందిని ఆయన సాదారంగా ఆహ్వానించి పేరుపేరున పలకరించినట్లు సారంగపాణి చెప్పారు.



ఐఐటీ రామయ్యను సత్కరిస్తున్న డాక్టర్ శంకరమంచి, పరాంకుశం, ఓరుగల్లు అధ్యాపకులు

రేపు కిట్స్‌లో 42వ స్నాతకోత్సవం

హసన్‌పర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్ ఆవరణలో ఈ నెల 22న శనివారం 42వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు కిట్స్ వరంగల్ గవర్నింగ్ బాడీ చైర్మన్ కెప్టెన్ వి.లక్ష్మీకాంతరావు తెలిపారు. ప్లే ఫీల్డ్ కిట్స్ వరంగల్ క్యాంపస్‌లో నిర్వహించనున్న గ్రాడ్యుయేషన్ డేలో కరిక్యూలమ్ యాక్టివిటీలో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన 28 మంది మెరిట్ విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు అకాడమిక్ మెరిట్ అవార్డులు, డిగ్రీలు, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ గ్రాండ్ అంట్స్‌కు అందజేస్తామని తెలిపారు. ముఖ్య అతిథులుగా నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుద్ధి, గౌరవ అతిథులుగా వరంగల్ కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, కోశాధికారి పి.నారాయణరెడ్డిలు హాజరవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు.

సీఎం కృషితో ప్రత్యేక నిధులు

» రూ.18 కోట్ల నిధులతో 6 వంతెనలకు శంకుస్థాపన
» వరంగల్ ఎంపీ కడియం కావ్య



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కావ్య తదితరులు

తొర్రూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషితో కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. పీఎంజీఎస్‌వై పథకం ద్వారా మంజూరైన నిధులతో గురువారం తొర్రూరు మండలం చెర్లపాలెం, కంఠాయపాలెం గ్రామాల్లోని వంతెనల నిర్మాణాల కోసం స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో కలిసి ఎంపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొర్రూరు మండలంలోని 2 ప్యాకేజీల కింద రూ.18 కోట్ల 39 లక్షలతో చెర్లపాలెం, కంఠాయపాలెం, హరిపిరాల, మడిపల్లి గ్రామాల్లో 5 వంతెనలు, పెద్దవంగర మండలంలో ఒక వంతెన నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికలతో కారు షెడ్‌కు వెళ్లిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, యూత్ మండల ప్రెసిడెంట్ పయ్యావుల ప్రవీణ్ యాదవ్, రాజేశ్ యాదవ్, నాయకులు దేవేందర్ రెడ్డి, యాకూబ్ రెడ్డి, ఎన్నమాల శ్రీనివాస్, వాసురెడ్డి, ముద్దం విక్రమ్‌రెడ్డి, సధాకర్, పీఆర్ ఈఈ విద్యాసాగర్, డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీటీ నర్సయ్య, ఏఈ నరేష్ రెడ్డి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేయాలి

» ఎన్‌కౌంటర్లపై కేసు నమోదు చేయాలి
» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

జనగామ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తోందని, వీటిని న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మావోయిస్టు అగ్రనేత హిడ్మా లొంగి పోతారని ప్రచారం జరిగినా, హిడ్మా, అతడి భార్య, మరో ఆరుగురు మావోయిస్టులను నిర్బంధించి చంపారని ఆరోపించారు. నిజంగా ఎన్‌కౌంటర్ జరిగితే ఒక్క పోలీసుకూ గాయాలు ఎందుకు కాలేదని ప్రశ్నించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మావోయిస్టులను వచ్చే మార్చి లోపు ఏరి వేస్తామని ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఒక వ్యక్తిని చంపే అధికారం ప్రభుత్వానికి కానీ, పోలీసులకు లేదన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చాక జడ్జి తీర్పు ఇచ్చిన తర్వాతే నేరస్థుడిని శిక్షించాలన్నారు. పోలీసులు నిర్బంధించిన మరికొంత మంది మావోయిస్టుల అగ్ర నాయకులను కోర్టు ముందు హాజరు పర్చాలని డిమాండ్ చేశారు. హిట్లర్‌లాంటి వాళ్లనే మట్టి కరిపించిన చరిత్ర ఎర్రజెండాకు ఉందన్నారు. పార్లమెంట్‌లో బలం ఉందని మేము ఏది చేసినా నడుస్తుందని విర్రవీగిన వారందరూ చరిత్రలో మట్టిలో కలిసిపోయారని పీఎం నరేంద్రమోదీకీ అదే గతి పడుతుందని హెచ్చరించారు.

అవి ప్రభుత్వ హత్యలే..

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. పత్తి కొనుగోలుకు ఆంక్షలు పెట్టి రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కిసాన్ కపాస్ యాప్‌తో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వెంటనే ఆ యాప్‌ను ఎత్తి వేయాలన్నారు. 12 శాతం పైగా తేమ ఉన్నా పత్తిని కొనుగోలు చేయాలని, రంగుమారిన పత్తిని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఆత్మహత్య చేసుకోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

నారు దశ.. జాగ్రత్తలే రక్ష



» శీతాకాలంలో నారు మడులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
» రాత్రిపూట నీరు తీసి, ఉదయం నింపాలి
» యాజమాన్య పద్ధతులు పాటించాలి

వర్ధన్నపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతులు వరి నారు మడ్లు తయారు చేస్తున్నారు. వరి పంట సాగులో భాగంగా నారుమడి తయారు చేయు రైతులు శీతకాలం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా రాత్రి, ఉదయం సమయాల్లో ఉష్ణోగ్రత తీవ్రత పూర్తిగా పడిపోతుంది. అందువల్ల నారు మడిలో నీరును మారుస్తూ నీటి యాజమాన్యం పాటించాలి. దీంతో చలి నుంచి నారుమడిని కాపాడుకోవచ్చు. నారు ఆరోగ్యంగా పెరిగితేనే పంట దిగుబడి అధికంగా వస్తుంది. అందువల్ల నారుమడ్ల యాజమాన్య పద్ధతులు పాటించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎకరానికి 30 నుంచి 35 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బాండిజమ్‌తో విత్తన శుద్ధిచేయాలి. దీంతో విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్లను అరికట్టవచ్చు. నిద్రావ్యవస్థలో ఉన్న విత్తనాలను మేలుకొల్పడానికి 1 కిలో విత్తనానికి 10మిల్లీ లీటర్ల నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టాలి. పశువుల పేడ గాని, సేంద్రియ ఎరువును ఎకర నారుమడికి 100 నుంచి 200 కిలోల నత్రజనిని, కిలో పోటాషియంను చల్లాలి. విత్త నాలు విత్తిన 15 రోజులకు 2 కిలోల భాస్వరం వేసుకోవాలి.

మండలంలో నారుమడ్ల తయారీలో ఉన్న రైతులకు ఈ శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

నారు మడి తయారీ

రెండు గుంటల నారుమడికి 2 క్వింటాళ్ల కోళ్ల ఎరువు లేదా గొర్రెల ఎరువు లేదా వర్మీ కంపోస్టును వేసి కలియదున్నాలి. ఈ సేంద్రియ ఎరువులను నారుమడుల్లో వాడటం వల్ల చలి తీవ్రతలో కూడా నారుకు పోషకాలు అంది ఎదగుదలకు తోడ్పడుతుంది. లేదంటే రెండు గుంటల నారుమడికి 2కిలోల నత్రజని, 2 కిలోల భాస్వరం, 1కిలో పొటాష్‌ను వేయాలి.

యాసంగిలో వరి పంట వేయాలనుకునే రైతులు స్వల్ప కాలిక రకాలను ఎంచుకోవడం ఉత్తమం. ఎందుకంటే నీటి లభ్యత పంట కాలం ఎక్కువైతే సమస్యలు ఎదురవుతాయి. అదే విధంగా వడగండ్లు, తదితర విపత్తులు సంభవించే ఆవకాశం ఉంటుంది.

చలితో జింక్ లోపం

చలి అధికమైనప్పుడు జింక్ లోపం వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల నారుమడిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌కు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొలక కట్టిన విత్తనాన్ని నారుమడిలో మొదటి వారం రోజుల పాటుగా తక్కువగా ఉంచాలి. రాత్రి ఉష్ణోగ్రత్తలు 12 డిగ్రీలకు కంటే తక్కువగా ఉన్నప్పుడు నారు ఎదుగదు. కొన్ని సార్లు వరి చనిపోతుంది. దీని కోసం రసాయన ఎరువులను వినియోగించాలి. చలి సమస్యను అధిగమించడానికి వరిమడ్లపై టార్పాలిన్‌లు రాత్రి పూట ఉంచి, ఉదయం పూట తీసి వేయాలి. రాత్రి పూట వరి మడి నుంచి పూర్తిగా నీరు తీసివేసి, ఉదయం పూట తాజా నీటిని నింపాలి. దీంతో వరి ఎదుగుదలలో లోపం లేకుండా ఉంటుంది. కాండం తొలిచే పురుగు (మొగ్గ పురుగు) నుంచి పంటను కాపాడుకోవడానికి నారు తలలు తుంచి నాటు వేసుకోవాలి. దీంతో కాండం తొలిచే పురుగు నారు కోనలపై గుడ్లు పోదుగుతుంది. దిని వల్ల గుడ్లతో పాటుగా మొగ్గపురుగును నివారించవచ్చును. నారు తీసే వారం రోజుల ముందు ఎకరా నారుమడికి 1 కిలో కార్బోఫ్యూరో త్రీజీ లేదా కార్టప్ హైడ్రో క్లోరైడ్ పోర్‌జీ గుళికలను వేసేకున్నట్లయితే నాటు వేసిన నెల రోజుల వరకు ఎలాంటి కీటకాలు ఆశించకుండా పంటను రక్షించుకోవచ్చు.

అధికారుల సలహాలు పాటించాలి

విజయ్‌కుమార్, ఏవో

ప్రస్తుతం ఉన్న వాతావరణం పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నారుమడుల్లో సాయంత్రం వేసిన నీటిని ఉదయం తొలగించాలి. చలి తీవ్రత నుంచి నారుమడిని కాపాడుకోవడానికి వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుంటే మంచిది. నారుమడికి కావాల్సిన వెచ్చదనం అందించే ఎరువులను వాడుకుంటే ఫలితం.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

బీసీ రిజర్వేషన్లపై

బీజేపీ, బీఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి లేదు

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆరోపించారు. గురువారం వరంగల్‌లోని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ నివాసంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు నియోజకవర్గం నుంచి పూర్తి మద్దతు తెలుపుతూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. యువ నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న సందర్భంగా బడుగు బలహీన వర్గాలను కలిసినప్పుడు రాజకీయంగా, ఆర్థికంగా అట్టడుగున ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. వారికి న్యాయం జరగాలంటే బీసీలకు జనాభా పరంగా రావాల్సిన వాటా వచ్చినప్పుడే వారు అభివృద్ధి చెందుతారనే అభిప్రాయానికి వచ్చారని అన్నారు. దీంతో బీసీకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కేటాయించి అమలు చేయాలని సంకల్పించారని తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి రెడ్డి కులానికి చెందిన వారైనప్పటికీ కులగణన చేపట్టి జనాభా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని నిశ్చయించారని సారయ్య అన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో శాసనసభలో, శాసన మండలిలో చర్చ చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపించారన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ మాత్రం బీసీ రిజర్వేషన్లకు సహకరించడం లేదని చెప్పారు. ఇప్పటికీ బీసీలలో కొన్ని కులాల వారు కనీసం వార్డు సభ్యుడిగా కూడా ఎన్నిక కాని పరిస్థితి నెలకొందన్నారు.

కార్పొరేటర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్లపై నోటితో రిజర్వేషన్లు కావాలే.. నొసటితో రిజర్వేషన్లు అక్కరలేదన్నట్లు బీజేపీ వ్యవహరిస్తుందన్నారు. ఇది ద్వంద్వ వైఖరి అన్నారు. సమావేశంలో నాయకులు బస్వరాజు శ్రీమాన్, గోరంటాల రాజు, కరాటే ప్రభాకర్, బిల్ల శ్రీకాంత్, దూపం సంపత్, కూరతోట సదానందం, బొలుగొడ్డు శ్రీను, రాముల బాబు, బైరబోయిన చంద్రమౌళి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం తగదు



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

పీఏసీఎస్ అధికారులపై
కలెక్టర్ స్నేహ శబరీష్ ఫైర్

హసన్‌పర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పీఏసీఎస్ అధికారులపై హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని జయగిరి గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో నిర్వాహకులు, అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎంత మంది రైతుల వద్ద ఎంత ధాన్యం కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధిత నిర్వాహకులు ఇప్పటి వరకు 29 మంది రైతుల వద్ద 1032.20 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీరిలో ఎంతమందికి పేమెంట్ అయ్యిందని కలెక్టర్ అధికారులను ప్రశ్నించడంతో పాటు, ఇప్పటి వరకు 29 మంది రైతులకు సంబంధించిన పేమెంట్ ఎందుకు జనరేట్ చేయలేదని, ట్రక్ షీట్‌లో మాయిశ్చర్ నమోదు చేయకుండా ఎందుకు మిల్లులకు తరలిస్తున్నారని మండిపడ్డారు.

ఆన్‌లైన్ సమస్య ఉందని చెప్పడంతో కలెక్టర్ మరింత సీరియస్ అయ్యారు. ట్రక్ షీట్‌తో పాటు మాయిశ్చర్ నమోదు చేయకుండా ఆన్‌లైన్ పేమెంట్ చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరి కాదని పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డితో పాటు వ్యవసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడే ఇన్న మహిళా రైతు అరుణ పేమెంట్‌ను కలెక్టర్ స్వయంగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలులో నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తే టోల్ ఫ్రీ నెంబర్‌కు గానీ లేదా స్వయంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ వెంట ఏడీఏ ఆదిరెడ్డి, తహసీల్దారు పూజారి కిరణ్‌కుమార్, ఎండీవో సుమనవాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్, ఏఈవోలు సుమన్, భాస్కర్, పీఏసీఎస్ హసన్‌పర్తి సీఈవో శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లయీస్ అధికారులు, మార్కెట్ డైరెక్టర్ పల్లె దయాకర్ రైతులు పాల్గొన్నారు.

'కుడా'బలుక్కున్నారు!?

(5వ పేజీ తరువాయి)

షాపింగ్ మాల్స్, హోటల్స్, హస్పిటల్స్, విద్యాసంస్థలకు, ఐటీ కంపెనీ కార్యాలయాలకు అనుగుణంగా ఉంటుందని, ఏక మొత్తంలో 2.27ఎకరాల భూమిని వేలం పెట్టింది. తొలుత నవంబరు 3వ తేదీన ఆక్షన్ తేదీని ప్రకటించింది. అయితే నగరంలో వరదలు రావటంతో 14వ తేదీకి వాయిదా వేశారు. హాట్‌కేక్‌లాంటి భూమిని గంపగుత్తగా అమ్మకానికి పెట్టడంపై విమర్శలు రావటంతో పాటు క్రీడా స్థలాన్ని ఎలా విక్రయిస్తారని టీడీపీతో పాటు కమ్యూనిస్టు పార్టీలు అభ్యంతరం చెప్పటంతో వేలం తాత్కాలికంగా వాయిదా వేశారు.

హస్తం నేతల నజర్ ?

నగరంలో వివిధ అభివృద్ధి పనులకు, నిర్మాణాలకు స్థలం కొరత ఉంది. అనువైన స్థలం లేకపోవటంతో నగరానికి దూరంగా నిర్మాణాలు చేయాల్సి వస్తోంది. అయితే ఉమ్మడి జిల్లా ప్రజలు వినియోగించుకునే హనుమకొండ బస్టాండ్‌తో పాటు స్టేడియానికి అతి సమీపంలో ఉన్న ఈ భూమి వేలంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2.27ఎకరాల భూమిని ఏక మొత్తంలో వేలం వేయటం దేనికనే ప్రశ్నలు వస్తున్నాయి. వెంచర్ చేస్తే 50 వరకు ప్లాట్లు వస్తాయని, దీనితో ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పట్టణ నడిబొడ్డున మరో కాలనీ ఏర్పడుతుందనే వాదన ఉంది. అలా కాకుండా ఏకమొత్తంలో 2.27ఎకరాల భూమిని వ్యాపారవర్గాల కోసం వేలం వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ వేలం వెనుక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధుల బినామీల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ప్రజాప్రతినిధి తన బినామీ కంపెనీకి కట్టబెట్టేందుకు వేలం వేయిస్తున్నారనే చర్చ జరుగుతోంది.

మరోవైపు ఈ భూమిని క్రీడామైదానం, క్రీడల అభివృద్ధి కోసం గతంలో ప్రణయ్‌భాస్కర్ మంత్రిగా ఉన్నప్పుడు 3వేల గజాల స్థలాన్ని కేటాయించారని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. బాలసముద్రం భూముల వేలాన్ని నిలిపివేయాలని కుడా కార్యాలయం ఎదుట టీడీపీ నేతలు ధర్నా నిర్వహించి, ఛైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్‌కి వినతి పత్రాన్ని అందించారు. బీఆర్‌ఎస్‌తో పాటు కమ్యూనిస్టులు కూడా బాలసముద్రం భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీంతో భూముల అమ్మకం తాత్కాలికంగా వాయిదా వేశారు.

అయితే ఈ విమర్శలను అధికార పార్టీ నేతలు, కుడా అధికారులు మాత్రం తిప్పికొడుతున్నారు. నగరం వ్యాపారంగా అభివృద్ధి చేసేందుకే వేలం వేస్తున్నట్లుగా చెపుతున్నారు. 2.27ఎకరాల భూమి ఒకే కంపెనీకి దక్కితే.. ఏదైనా షాపింగ్ మాల్, ఐటీ కంపెనీ లేదా విద్యాసంస్థలు వచ్చే అవకాశం ఉంటుందని, ఆ ఉద్దేశంతోనే ఏకమొత్తంలో భూమిని వేలం వేస్తున్నామని చెపుతున్నారు. ప్లాట్లుగా విభజిస్తే చాలా వరకు భూమిని కోల్పోవాల్సి వస్తుందంటున్నారు. పక్కనే నాలా ఉండటం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇతరత్రా అవాంతరాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. కమర్షియల్ స్థలం కావటంతోనే ఏకమొత్తంగా భూమిని వేలం వేస్తున్నామని అంటున్నారు.

కమర్షియల్ కాంప్లెక్స్.. ఐటీ టవర్..

హైదరాబాద్ తరువాత రెండో రాజధానిగా ప్రభుత్వం వరంగల్‌ను అభివృద్ధి చేస్తోంది. నగరం నడిబొడ్డున ఉన్న స్థలాన్ని అమ్మకానికి పెట్టే బదులు కుడా నిధులతో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తే.. అద్దె ద్వారా ఆదాయం వస్తుందనే వాదన వినిపిస్తోంది. అడ్వాన్స్‌లు, అద్దెలతో భూమిని విక్రయించిన దానికంటే అధికంగా ఆదాయం వస్తుందనే చర్చ జరుగుతోంది. ఇది సాధ్యం కాకుంటే ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న నగరంలో ఐటీ అభివృద్ధి కావటం లేదు. దీంతో ఈ స్థలంలో ఐటీ టవర్ నిర్మాణం చేస్తే కొన్ని కంపెనీలు వచ్చే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. నగర శివారులో ఉన్న మడికొండలో ఐటీ అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతున్నాయనే ప్రచారం ఉంది. ఇప్పటికే రైల్వేలైన్ ఉండటంతో పాటుగా ఎయిర్‌పోర్టు కూడా వస్తుండటంతో వరంగల్‌లో ఐటీ అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో హాట్‌కేక్ లాంటి బాలసముద్రం భూములను నగర అభివృద్ధికి, వ్యాపారాభివృద్ధికి వినియోగిస్తే బాగుంటుందని అంటున్నారు.

బెంబేలెత్తిస్తున్న చలి



● శీతల గాలులతో జనం ఉక్కిరిబిక్కిరి
● అలసత్వం వహిస్తే పొంచి ఉన్న ప్రమాదం

వరంగల్ మెడికల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చలి రోజు రోజుకూ పెరుగుతోంది. రాత్రి పూట విపరీతంగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. నాలుగు రోజుల నుంచి పగటిపూట కూడా అత్యల్పంగా 20 నుంచి 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వచ్చే రోజుల్లో గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున వాతావరణ మార్పుల నేపథ్యంలో వైరల్ వ్యాధులు మరింత పెరిగే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. జలుబు, జ్వరం, దగ్గు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అస్తమా, సీవోపీడీ వంటి సమస్యలతో బాధపడేవారు మరిన్ని జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి తీవ్రత పెరుగుతున్న క్రమంలో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు పేర్కొంటున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు జబ్బుల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని వైద్యులు తెలుపుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

మూడు పూటల వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని చెబుతున్నారు. చలికాలంలో ఆహారం, నీటితో అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదముందని, అందుకే కాచి చల్లార్చిన గోరువెచ్చని నీటిని తాగాలని సూచిస్తున్నారు. పొగమంచు కారణంగా శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ఎండ వచ్చాకే వాకింగ్ చేయడం మంచిదంటున్నారు. చలి తీవ్రత ఎక్కువైనందున పిల్లలు, పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ చలితో చర్మం, ఊపిరితిత్తుల సమస్యలతోపాటు గుండె సంబంధ వ్యాధుల వారికి డిప్రెషన్ పెరిగే అవకాశముందని తెలుపుతున్నారు. శీతకాలంలో ఊపిరితిత్తుల సమస్యలు వస్తే న్యూమోనియా, ఇన్‌ఫ్యూంజాగా పరిగణిస్తారు.

వేడి ఆహారం తీసుకోవాలి



చలి తీవ్రత బాగా ఉన్నందున పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి. వేడి ఆహారాన్నే తీసుకోవాలి. అస్తమా పేషెంట్లు జాగ్రత్తగా ఉండాలి. ఉదయం 10 గంటల వరకు బయటకు రాకూడదు. కూల్‌డ్రింగ్స్ ఐస్‌క్రీంలు, ఆల్కాహాల్‌కు దూరంగా ఉండాలి. మాంసాహారం ఎక్కువ తీసుకోవచ్చు. రూమ్ హీటర్స్ వాడాలి. బయటకు వెళ్లేప్పుడు ఉన్ని దుస్తులు ధరించాలి.

దుర్గం వెంకటేశ్, ఫిజిషియన్, ఎంజీఎం ఆస్పత్రి

చర్మ వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి



చర్మ వ్యాధిగ్రస్తులు చలికాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. సన్‌స్ర్కీన్ లోషన్లు వాడాలి. చలికాలంలో చర్మం పొడిబారుతుంది. ఈ లోషన్‌తో సమస్యల పరిష్కారమవుతుంది. స్నానానికి ఒక బకెట్ గోరువెచ్చని నీటిని వాడాలి. దీనివల్ల చర్మం కాంతివంతంగా ఉంటుంది. పెదవులకు లిప్‌బామ్‌లు వాడాలి. ఎక్కువగా విటమిన్ సీ, ఈ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి. రోజువారిగా డీ హైడ్రేషన్‌కు గురికాకుండా కనీసం మూడు లీటర్ల నీటిని తీసుకోవాలి. స్వెటర్, ఉన్ని దుస్తులు ధరించాలి.

సాతు శ్రీకాంత్, చర్మ వైద్య నిపుణుడు, కాకాజీ కాలనీ

పురుగుల అన్నం పెడుతున్నారు..

» కల్వల ఆదర్శ పాఠశాల విద్యార్థినుల ఆరోపణ » వసతిగృహం వద్ద బైఠాయింపు



ఆదర్శ వసతిగృహం ఎదుట బైఠాయించిన విద్యార్థినులు

కేసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహంలో గురువారం పురుగులు ఉన్న కిచిడీ పెట్టడంతో విద్యార్థినులు వసతిగృహం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ హాస్టల్‌లో కేర్‌టేకర్, వంట మనుషుల మధ్య సమన్వయం లేక సరైన సమయానికి అల్పాహారం, భోజనం వడ్డించడం లేదని తెలిపారు. ఉదయం 9 గంటలకే పాఠశాలకు వెళ్లాల్సి ఉండగా 9.30కు అల్పాహారం తయారు చేస్తున్నారని దీంతో తాము టిఫిన్ చేయకుండానే స్కూల్‌కు వెళ్తున్నామని తెలిపారు. భోజనంలో పురుగులు, వంట సామగ్రిలో తుట్టెలు కట్టాయని తెలిపారు. వంట చేసే వారు సాయంత్రం 4 గంటలకే రాత్రి భోజనం వండి ఇంటికి వెళ్లిపోతున్నారని, ఆ తర్వాత రాత్రి 8 గంటలకు నైట్ వాచ్‌మన్ వస్తున్నారని తెలిపారు. అప్పటి వరకు తాము బిక్కుబిక్కుమంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హాస్టల్‌లో వంద మంది విద్యార్థినులు ఉండాల్సి ఉండగా నిర్వాహకుల పనితీరు సరిగా లేకపోవడంతో ప్రస్తుతం 40 మందే ఉన్నారు. బుధవారం తహసీల్దార్ వివేక్ హాస్టల్‌ను సందర్శించి నిర్వాహకులను తొలగిస్తున్నట్లు తెలిపారు. అయితే గురువారం మళ్లీ వారే వచ్చి నాణ్యతలేని అల్పాహారం వండినట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. కలెక్టర్ తమ హాస్టల్‌కు వచ్చి సమస్యలను పరిష్కరించాలని లిఖితపూర్వకంగా విద్యార్థినులు కోరడం గమనార్హం. ఇప్పటికైనా హాస్టల్‌లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్

వడ్డెపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని శుక్రవారం (21న) ఘనంగా నిర్వహించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్(మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ పిలుపు నిచ్చారు. గురువారం హనుమకొండ 56వ డివిజన్ జవహర్‌కాలనీలోని మెపా వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ జెండాలను గ్రామ గ్రామాన, పల్లెపల్లెన ఆవిష్కరించాలని కోరారు. హనుమకొండ 56వ డివిజన్ జవహర్‌కాలనీలోని మెపా కార్యాలయంలో నిర్వహించే ప్రపంచ మత్స్య కారుల దినోత్స వేడుకల్లో ముదిరాజ్‌లు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ముదిరాజ్‌లను బీసీ డీ గ్రూప్ నుంచి బీసీ ఏ గ్రూప్‌లోకి మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మెపా జిల్లా నాయకులు బోనాల రమేష్, మండల సమ్మయ్య, గోనెల విజేందర్, కె. కోటేశ్వర్, పులి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్ - పాఠశాలల తనిఖీ


విద్యార్థులను పుస్తకం చదివిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హసన్‌పర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించే విధంగా తీర్చిదిద్దాలని, ప్రతీ విద్యార్థికి పాఠ్యాంశం అర్థమయ్యేలా బోధన సాగాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం కోమటిపల్లి, చింతగట్టులోని ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యతో పాటు ఉపాధ్యాయుల బోధన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఆంగ్లంలో విద్యార్థులకు బోధిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రతీ రోజు ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారు మిగతా విద్యార్థులు రాలేకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలని, ప్రతి ఒక్కరికి యూనిఫాం అందేలా చూడాలన్నారు. అనంతరం డైనింగ్ హాలును, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు.

రవాణా శాఖ కార్యాలయ పరిశీలన

చింతగట్టు క్యాంపులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. రవాణా శాఖ కార్యాలయం కోసం భూమిని కేటాయించాలని ఆ శాఖ అధికారులు కలెక్టర్‌ను కోరగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వెంట తహసీల్దారు పూజారి కిరణ్‌కుమార్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధికారులున్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ స్నేహ శబరీష్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని చింతగట్టులో తుది దశ నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆమె పరిశీలించి లబ్ధిదారులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా చింతగట్టుకు చెందిన జనగాని సంధ్యారాణి, రాజ్యలక్ష్మి అనే లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు తుది దశకు చేరుకోగా అధికారులతో కలిసి కలెక్టర్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి మాట్లాడారు. లబ్ధిదారులు నిర్మాణ పనులు ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హరికృష్ణ, తహసీల్దారు పూజారి కిరణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

వరంగల్ మెడికల్ : ఆస్పత్రులలో సాధారణ ప్రసవాలను పెంచి, సిజేరియన్లను తగ్గించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ.. 12 వారాలలోపు ప్రతీ గర్భిణీ వివరాలను ఏఎన్‌ఎంలు నమోదు చేయాలన్నారు. గర్భిణులకు తప్పనిసరిగా నాలుగుసార్లు చెకప్‌కు వచ్చే లా ఏఎన్‌ఎంలు, ఆశాలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా వైద్యాధికారులు, సిబ్బంది కృషిచేయాలని సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో టీబీ వచ్చే అవకాశం ఉ న్న 8 రకాలను ప్రజలకు స్క్రీనింగ్ చేయడంతో పాటు 432 పోషణ కి ట్లు పంపిణీ చేశామన్నారు. సమావేశంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్యదర్శి శశిజాదేవి

టెక్నాలజీలా గ్రంథాలయాలూ ముఖ్యం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు టెక్నాలజీ ఎంత ముఖ్యమో గ్రంథాలయాలు అంతే ముఖ్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 7వ రోజు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై సరస్వతి విగ్రహానికి పూలమాల వేశారు. గ్రంథాలయంలో పాఠకులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు గురువులు, పెద్దల పట్ల అంకితభావంతో మెదలాలని అన్నారు. గతంలో తాను గ్రంథాలయ చైర్మన్‌గా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్ ఖాన్, సంస్థ కార్యదర్శి కె.శశిజాదేవి, కార్పొరేటర్లు తోట వెంకన్న, నెక్కొండ కవితకిషన్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బొమ్మతి విక్రమ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బిన్ని లక్ష్మణ్, కందుల స్రుజన్, ఆర్టీవో మెంబర్ పల్లకొండ సతీష్, లైబ్రేరియన్ మల్సూరు, పురుషోత్తం రాజు, రికార్డు అసిస్టెంట్ మమత, ఇంటర్నెట్ నిర్వాహకుడు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సహస శిబిరానికి సాయికుందన్



కేయూ క్యాంపస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి 28 వరకు గుజరాత్‌లోని సర్దార్ పటేల్ వర్సిటీలో జరిగే జాతీయ సహస శిబిరానికి కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ పదమటింటి సాయికుందన్ ఎంపికయ్యారు. సాయి కుందన్ బీటెక్ ఐటీ రెండో ఏడాది చదువుతున్నారు. కాగా, ఎంపికైన సాయికుందన్‌ను కళాశాల పిన్సిపాల్ ఎన్.రమణ ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు శైలజ, సౌజన్య తదితరులు అభినందించారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ


మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హసన్‌పర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్‌తో కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెంబర్తిలోని బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చాతల్ల వేణుగోపాల్, స్వేరోస్ ఇంటర్నేషనల్ కోకన్వీనర్ చాతల్ల సదానందం తల్లి ఉపేంద్ర ఇటీవల మృతి చెందారు. విషయం తెలిసిన వారు గురువారం పెంబర్తిలోని వారి స్వగృహానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారి వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, సుదర్శన్, శ్యాం, పుల్ల కిషన్, శిరీష, సదానందం, శ్రీనివాస్, మనోజ్, సురేష్ తదితరులున్నారు.

సబ్జెక్ట్స్ ఫోరమ్ సమన్వయ కమిటీ

కన్వీనర్‌గా మధుసూదన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా హైస్కూల్స్ సబ్జెక్ట్స్ ఫోరమ్ సమన్వయ కమిటీ కన్వీనర్‌గా అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం హనుమకొండ డీఈవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమన్వయ కమిటీ కన్వీనర్లు, కోకన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోకన్వీనర్లుగా కె.సంపత్‌కుమార్, ఎ.సంపతి, కోశాధికారిగా భద్రయ్యను ఎన్నుకున్నారు.

కోటను సందర్శించిన రష్యా దేశస్థులు


కోటలో శిల్పాలను తిలకిస్తున్న విదేశీయులు

ఖిలావరంగల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రసిద్ధిగాంచిన ఖిలావరంగల్ కోటను రష్యా దేశస్థులు గురువారం సందర్శించారు. వరంగల్ నగరం ఖిలావరంగల్ ప్రాంతంలోని కాకతీయుల కీర్తి తోరణాలు, శిల్పాల ఆవరణ, ఏకశిల గుట్ట, ఖుష్ మహల్, సింగారుపు బావి, స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయాలు, కట్టడాలు, శిల్పసంపద, రాతి, మట్టి కోట లను వారు ఆసక్తిగా తిలకించారు. ఆయా కట్టడాలను, శిల్పాలను తమ కెమె రాల్లో బంధించుకున్నారు. వారికి కాకతీయుల కాలం నాటి చరిత్ర, శిల్పసంపద గురించి తెలంగాణ టూరిజంశాఖ ఖిలావరంగల్ ఇన్‌చార్జి డి.రవియాదవ్ వివ రించారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తు, పర్యాటకశాఖ సిబ్బందిపాల్గొన్నారు.

మహా గౌరీగా రుద్రేశ్వరి


గౌరినక్తం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

ముగిసిన కార్తీకమాస వేడుకలు

హనుమకొండ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వైభవంగా నిర్వహిస్తున్న కార్తీక మాస వేడుకలు గురువారం నిర్వహించిన గౌరీ వ్రతంతో ఘనంగా ముగిశాయి. రుద్రేశ్వరీ దేవిని 51 కిలోల పసుపుతో ముత్తైదువులు, అర్చకుల వేద మంత్రాల మధ్య మహాగౌరిగా అలంకరింపజేసి గౌరినక్త వ్రతాన్ని ఆచరించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మణికంఠశర్మ, ప్రణవ్‌లు శాస్త్రయుక్తంగా పూజాదికాలు నిర్వహించారు. సినీ నటుడు తనయుడు ఆది సాయికుమార్, హీరోయిన్ అర్చన అయ్యన్, నటుడు శివకార్తీక్, సంతోష్ తదితరులు కూడా రుద్రేశ్వరుడిని దర్శించుకొని గౌరినక్త వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో అనిల్ కుమార్‌తోపాటు విజయవాడకు చెందిన ఆధ్యాత్మిక ప్రవచకురాలు, మధుకర్, రామకృష్ణ, రజిత తదితరులు భక్తులు సేవలందించారు. ప్రదోశకాల సమయంలో మహిళలు దీపాలు వెలిగించుకొని పూజలు నిర్వహించారు.

మెట్టు రామలింగేశ్వరస్వామికి

అన్నాభిషేకం

మడికొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాలలో భాగంగా మడికొండ మెట్టుగుట్టపై గల మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అభిలాష్‌శర్మ స్వయంభువు శివలింగానికి తైలాభిషేకం, 108 కిలోల పెరుగన్నంతో అన్నాభిషేకం చేసి అందంగా అలంకరించి హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. సాయంత్రం హరిహరులకు ఆకాశదీపోత్సవం, ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్రహారతి, రాజోపచార పూజలు, పవళింపు సేవ నిర్వహించారు. ఈవోలు ఆర్.సునీత, ఎస్. సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి


లబ్ధిదారుడికి చెక్కు ఇస్తున్న ఎంపీ కడియం కావ్య

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

హనుమకొండ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంపీ కడియం కావ్య సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. గురువారం హనుమకొండలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. 11 మంది లబ్ధిదారులకు మొత్తంగా రూ.6.25లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. నిరుపేద, మధ్యతరగతి వర్గాలకు సీఎం సహాయ నిధి భరోసాగా నిలిచిందన్నారు.

నేడు శాంతి కల్యాణోత్సవం

మట్టెవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ మట్టెవాడలోని శ్రీ భోగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. భోగేశ్వరస్వామి, అన్నపూర్ణేశ్వరిల శాంతి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొనాలని ఆలయ ఈవో, అర్చకులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఫార్మసీ రంగంలో యువతకు ఉజ్వల భవిష్యత్



జ్ఞాపికను అందుకుంటున్న డీన్ సమ్మయ్య

కేయూ క్యాంపస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ రంగంలో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఉద్బోధించారు. గురువారం వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో 64వ నేషనల్ ఫార్మసీ వీక్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వప్నరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాదె సమ్మయ్య హాజరై 'ఫార్మసిస్టు థీమ్ ఫార్మసిస్టు అడ్వకేట్ ఆఫ్ వ్యాక్సినేషన్' అనే అంశంపై సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. ఫార్మసీ విద్యలో సెఫ్టీ మెడికేషన్ జ్ఞానం అవసరమన్నారు. మనిషి జీవితంలో వ్యాక్సిన్స్‌కు ప్రాధాన్యం ఉంటుందన్నారు. సరైన సమయంలో టీకాలు వేసుకోకపోతే దుష్ఫలితాలు ఎదురవుతాయని చెప్పారు. డయాబెటీస్, కొవిడ్, క్యాన్సర్, న్యూరో వంటి ప్రాణాంతక వ్యాధులకు ఔషధాలు కనుకునేందుకు పోటీ పడుతున్నారని చెప్పారు. రీసెర్చ్‌లో ఆధారాలు ప్రాధాన్యమన్నారు. ఉన్నతమైన ఫార్మసిస్టులతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించొచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రణీత్, ప్రత్యూష, రత్నాకర్‌రెడ్డి, విజిత, మానస తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం నేతృత్వంలో నిర్వహించిన వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని పేర్కొన్నారు. వ్యాస రచన, రంగోలీ, తదితర పోటీల్లో విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రొఫెసర్ రామేశ్వరం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఎన్‌సీసీ వేడుకలు

కేయూ క్యాంపస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ముందస్తుగా ఎన్‌సీసీ 77వ అవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. వరంగల్ గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ రవీంద్రకుమార్ హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతోందని చెప్పారు. ప్రిన్సిపాల్ భిక్షాలు మాట్లాడుతూ.. కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను పునఃప్రారంభించినట్లు తెలిపారు. ఎన్‌సీసీ అధికారులు, కళాశాల సూపరింటెండెంట్ వీరు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్‌యూలో ఘనంగా 'ప్రాజెక్ట్ ఎక్స్‌పో'


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏవీవీ సుధాకర్

హసన్‌పర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో గురువారం ఘనంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో యంత్రా-2025 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సార్‌యూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దీపక్‌గార్గ్, మైక్రోసాఫ్ట్ డాక్టర్ ఏవీవీ సుధాకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దీపక్‌గార్గ్ మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో ఉత్సాహవంతంగా విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఎక్స్‌పో కేవలం ప్రాజెక్టుల ప్రదర్శన మాత్రమే కాదని, ఇది ఆవిష్కరణ, సృజనాత్మకత, సమస్య పరిష్కార వేడుక అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొవైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.మహేష్, రిజిస్ట్రార్ డాక్టర్ పి.వి.రమణారావు, డీన్ బొబ్బల హరిప్రసాద్, విద్యార్థి సంక్షేమం డాక్టర్ సీహెచ్.హుస్సేన్ భాషా, కన్వీనర్ సిరిచందన, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆశీర్వాద పండుగలు

పోస్టర్ ఆవిష్కరించిన బిషప్ జాన్ మార్కండేయ


పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జాన్‌మార్కండేయ తదితరులు

కాజీపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాజీపేట చౌరస్తాలోని స్టేడియంలో ఈ నెల 21, 22, 23 తేదీలలో మూడురోజుల పాటు ఆశీర్వాద పండుగలు నిర్వహించనున్నట్లు బిషప్ జి.జాన్ మార్కండేయ తెలిపారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం బిషప్ జి.జాన్‌మర్కండేయ, రెవరెండ్ నిఖిల్ జాన్‌లు మాట్లాడారు. బిషప్‌గా జాన్‌మార్కండేయ దేవుడి సేవలో 40 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు ఈ ఆశీర్వాద పండుగలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఆశీర్వాద పండుగలకు క్రైస్తవ సందేశకులు బ్రదర్ సంజీవరావు, బ్రదర్ అనిల్, బ్రదర్‌మాథ్యూస్‌లు హాజరుకానున్నారని తెలిపారు. ఆశీర్వాద కూటములకు ప్రజలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. మీడియా సమావేశంలో పాస్టర్‌లు చంద్రమౌళి, పోతుల సాంబయ్య, బస్కె రాజేందర్, బొక్క రమేశ్, కొడవటి రవి, శివ, రాజు, ఐలేష్, దార్ల రాజు, కర్ణాకర్ తదితరులుల పాల్గొన్నారు.


న్యాయశాస్త్రంలో

రాజుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగం పరిశోధకుడు లాడే రాజు డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ రాజుకు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'ఇండస్ట్రీయల్ డిస్‌ప్యూట్స్ సెటిల్‌మెంట్ మెకనిజమ్ ఇన్ ఇండియా : ఏ కేస్ స్టడీ ఆఫ్ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ సాధించారు. కేయూ న్యాయశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్ పర్యవేక్షణలో రాజు పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన రాజును పలువురు అభినందించారు.

విశేషం



23న శ్రీసత్యసాయిబాబా జయంతి

సత్యలోకం అనగానే బ్రహ్మ, వైకుంఠం అనగానే శ్రీహరి, కైలాసం అనగానే శంకరుడు, శ్రీమన్నగరం అనగానే లలితాదేవి గుర్తుకు వచ్చినట్టు... సత్యసాయి అనగానే పుట్టపర్తి గుర్తుకు వస్తుంది. ఈర్ష్య, ద్వేషం, అసూయ, అసహనం లాంటివి మచ్చుకైనా కనిపించని నిరంతర దైవ ధ్యానమయమైన ఆలయం... ఆయన హృదయం. మానవతా సరోవరాలు ఆయన నేత్రాలు. ఆయన చెవులు ఎవరి ఆర్తి ఎంతటితో ఆలకిస్తూ, 'దాన్ని ఎలా తీర్చాలా?' అని పరితపించే మాతృసమానమైన రక్షణ మందిరాలు.

ప్రేమైకమూర్తి

శ్రీ సత్యసాయిబాబా కారణ జన్ముడు. అలా కానట్టయితే... కేవలం ఎనిమిదో తరగతి చదివి, సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల వాఙ్మయ పరిచయం ఏమాత్రం లేకుండా... ఆశువుగా దైవ కీర్తనలు పాడడం, సంస్కృత శ్లోకాలను వల్లించడం, పండితులకు కూడా అంతుపట్టని సమన్వయ విధానాలు లాంటివి స్వామి ప్రదర్శించే అవకాశం లేదు. తొమ్మిదేళ్ళ వయసు వచ్చినప్పటి నుంచి నిరంతరం ధ్యానంలోనే ఆయన ఉండేవారు. ఈ ధోరణి ఆయన తల్లిదండ్రులకు, ఎరిగినవారికి ఏవేవో భయాలు కలిగించాయి. ధ్యానంలో ఉండే రుచిని వారికీ తెలియజేస్తే ఆ అపోహలు తొలగిపోతాయని స్వామి భావించారు. వారందరినీ దగ్గరకు చేర్చి సామూహిక భజనలు చేయించసాగారు. స్వామి పాడుతున్న కీర్తనలకు, శ్లోకాలకు అర్థాలు తెలియకపోయినా... ఆ సామూహిక రమణీయ దైవ ధ్యాన నాదం అందరిలోనూ ఏదో తెలియని స్ఫూర్తి కలిగించింది. సాధారణ జీవులుగా ఈ లోకం నుంచి నిష్క్రమించడం కాకుండా... తమ జీవితాలను ధన్యం చేసుకోవాలనే తపన పెరిగింది. క్రమంగా ధ్యానాన్ని తీవ్రతరం చేసిన స్వామి... తపస్సు ప్రారంభించారు. ఈ వార్త గ్రామ గ్రామాలకూ వ్యాపించింది. 1941లో... అంటే తన పదిహేనవ ఏట... ఈ ప్రపంచంలో ఏం జరగబోతోందో స్వామి వివరించి చెప్పారు. అది అక్షర సత్యం అయింది.

ధ్యానం, సేవ, ప్రేమ

నిష్కల్మషమైన మనసు ఏ భావాన్ని బుద్ధిపూర్వకంగా పలికిస్తుందో... అది నిజమై తీరుతుందనడానికి ఆయన మాటలే సాక్ష్యం. "ఆ దైవమే మన శరీరాన్ని ఒక పనిముట్టుగా ఉపయోగించుకోవాలని అనుకుంటే... మనం ఎవరెవరో గొప్పవారిని ఆశ్రయించం, ప్రాధేయపడం. వారే మన దగ్గరకు వస్తారు. "ఇంటికి కాపలాగా ఉన్న నల్లకుక్కకు అన్నం పెట్టాలంటే... తినేసిన విస్తరాకులను దాని ముందు పడెయ్యం. చక్కగా విస్తరి నిండా అన్నం పెట్టి ప్రేమగా పిలుస్తాం. ఆ విస్తరిని చూపిస్తాం. అది తింటూ ఉంటే ఆనందపడతాం. అలాంటి నల్ల కుక్కను నేను" అని షిరిడీ సాయిబాబా అన్నారు. "దైవం మనకు శరీరమనే రమణీయ సౌధాన్ని "చక్కగా వాడుకో!" అని ఇచ్చాడు. మనం ఉన్నంతకాలం దాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. ఆ సౌధంలో వెలుగును ఇచ్చే దీపాన్ని వెలిగించాలంటే దైవధ్యానమే సరైన ఉపాయం. అందుకే నిరంతరం ధ్యానం చేస్తూ ఉందాం. వాల్మీకి, వ్యాసాది మహర్షులు, దేవతలు కూడా తపస్సు ద్వారానే శక్తిమంతులయ్యారు. ఇదంతా వారు దీన రక్షణ కోసమే కదా చేసింది" అని శ్రీరామకృష్ణ పరమహంస చెప్పారు. మనం ఆ మార్గంలో నడుద్దాం" అని పిలుపునిస్తూ... దైవ ధ్యానాన్ని విస్తృతం చేయడానికి సత్యసాయిబాబా ప్రయత్నించారు. దానికి సేవ, ప్రేమ అనే రెండు అంశాలను జోడించారు.

సంకల్పం సాకారమై...

శ్రీసత్యసాయి సంకల్పమే మానవాళి శ్రేయస్సుకు తరుణోపాయమని దైవం భావించాడు కాబట్టే... సాకమ్మ అనే పుణ్యాత్మురాలు నేటి ప్రశాంతి నిలయాన్ని స్వయంగా నిర్మించి ఇచ్చారు. అక్కడ నిరంతరం రుద్ర పారాయణ జరుగుతూ ఉంటుంది. 1958లో వైద్యావసరాలను ఉచితంగా తీర్చాలనుకుంటున్నానని ఆయన ప్రకటించగానే... జనరల్ ఆసుపత్రి ఏర్పాటయింది. అక్కడ సేవలకు ఎవరూ ఏమీ ఇవ్వనక్కరలేదనే ప్రకటనలు కనిపిస్తాయి. పిల్లలకు నీతి కథలను, పురాణ గాథలను వినిపించాలని ఆయన చెప్పగానే... 1966లో బాలవికాస్ ఆవిర్భవించింది. అక్కడ ఎందరో తల్లులు ఉచితంగా ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 1971లో బెంగళూరులో కళాశాల, 1981లో అత్యున్నతమైన విశ్వవిద్యాలయం, దైవధ్యానంలో మనశ్శాంతిని పొందాలని వస్తున్న 185 దేశాల భక్తుల కోసం విమానాశ్రయం, 1992లో అంతర్జాతీయ ప్రమాణాలతో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 1995లో... 600కు పైగా గ్రామాలకు, ఏడు పట్టణాలకు శాశ్వతంగా జలవసతి కల్పించే రాయలసీమ తాగు నీటి పథకం... నిర్విఘ్నంగా ఏర్పాటయ్యాయి. ఆరువేలమందికి పైగా విదేశీ ప్రతినిధులతో యువ జన సమ్మేళనం, సామూహిక ఉపనయన కార్యక్రమం, నిరంతర వేద ఘోష, నిత్య నగర సంకీర్తన, మహనీయుల ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, పండుగ రోజుల్లో దేవాలయాలకన్నా మిన్నగా యజ్ఞయాగాది కార్యక్రమాలు... ఇలా ఎన్నో కార్యాలు అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉన్నాయి.

అంతా ఆయన ఆశీర్వాదం...

ఇలా ఒక్కొక్కటీ వివరించాలంటే ఒక్కొక్క గ్రంథమే అవుతుంది. ప్రశాంతి నిలయంలో ఎనభై వేలమందికి పైగా కూర్చున్నా... చిన్న ధ్వని కూడా వినిపించదు. అందరూ స్వచ్ఛమైన తెల్లటి వస్త్రాలతో ఒకేలా ఉంటారు. ఎలాంటి ప్రకటనలు ఉండవు. ఎవరి తరువాత ఎవరు మాట్లాడాలో, ఏ భాషా గీతాన్ని ఆలపించాలో... అంతా క్రమబద్ధంగా సాగిపోతుంది. కోటీశ్వరుల నుంచి సామాన్యుల వరకూ, రాజకీయ నేతలు, కలెక్టర్ల లాంటి ఉన్నతాధికారుల నుంచి మామూలు వ్యక్తుల వరకూ అందరూ అక్కడ సమానమే. అందరూ సేవకులుగా, ప్రేమస్వరూపుల్లా కనిపిస్తారు. ఇదంతా శ్రీసత్యసాయి సంకల్పబలం, ఆశీర్వాద ఫలం.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
9866700425

పర్వదినం

(26న సుబ్రహ్మణ్య షష్ఠి)

మన దేశంలో సుబ్రహ్మణ్య ఆరాధన అనాది కాలం నుంచి వస్తోంది. సనాతన ధర్మంలో ఆరు మతాలు ఉన్నాయి. వాటిలో కుమారోపాసన (సుబ్రహ్మణ్యోపాసన) ఒకటి. మిగిలినవి గాణపత్య, శైవ, వైష్ణవ, సౌర, శాక్తేయాలు. పరమాత్మను సుబ్రహ్మణ్య రూపంలో ఆరాధించడం స్కాంద మతం. అందులో ఆయనను అగ్నిగర్భుడిగా భావిస్తూ... 'సుబ్రహ్మణ్యోం సుబ్రహ్మణ్యోం' అంటూ ఉపాసకులు పూజిస్తారు. సుబ్రహ్మణ్యారాధన అగ్ని ఉపాసనతోనే జరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. కాగా... శ్రీశంకర భగవత్పాదులు ఏర్పరచిన పంచాయతన పూజా విధానంలో సుబ్రహ్మణ్యుడి ప్రస్తావన లేదు. అయితే... పూజకు ముందు చేసే దీపారాధన... శివశక్త్యాత్మకుడైన సుబ్రహ్మణ్యుణ్ణి ఆరాధించడమేననేది తత్త్వజ్ఞుల అభిప్రాయం.

సుబ్రహ్మణ్యుడు శివపార్వతుల కుమారుడు... ఆయనను 'కుమారస్వామి 'అని పిలుస్తారు. శివుడు అవ్యక్త బ్రహ్మం అయితే... పార్వతి వ్యక్త స్వరూపం. ఆ ఉభయులు కలిసిన విశ్వవ్యాపకశక్తి, నాలుగు దిక్కులలో పైనా, కిందా వ్యాపించిన విశ్వచైతన్యం సుబ్రహ్మణ్యుడు. కార్తికేయుడిగానూ ఆయన ప్రసిద్ధుడు. ఆరు ముఖాలతో ఆయన విరాజిల్లుతున్నాడు. ఆయనకు నాలుగు చేతులు. ఒక చేతిలో మహాశక్తి, మరో చేతిలో వజ్రాయుధం ఉంటాయి. ఒక చెయ్యి కటిపై ఉంటుంది. మరొకటి అభయహస్తం. తమిళనాడులో సుబ్రహ్మణ్యారాధన ఎక్కువగా ఉంటుంది. ప్రతి శివాలయంలో సుబ్రహ్మణ్యుడికి ప్రత్యేకంగా ఉపాలయం ఉంటుంది. రాష్ట్రంలో ప్రసిద్ధమైన ఆరు సుబ్రహ్మణ్య క్షేత్రాలు ఉన్నాయి. అవి:

అగ్నిస్వరూపుడి ఆరు క్షేత్రాలు

తిరుప్పరన్‌కుండ్రమ్: ఈ క్షేత్రం మదురైకి దగ్గరలో, ఎత్తైన కొండపై ఉంటుంది. ఆ కొండ శివలింగాకారంలో ఉండడం వల్ల దాన్ని 'శివమలై' అని వ్యవహరిస్తారు. ఈ కొండ మీద తన బల్లెంతో స్వామి తీర్థాలను సృష్టించాడని, శూరపద్ముడు అనే రాక్షసుణ్ణి ఆయన వధించి, ఇంద్రుడికి క్షేమాన్ని కలిగించాడనీ, అందుకు కృతజ్ఞతగా తన కుమార్తె దేవసేనతో కుమారస్వామి వివాహాన్ని ఇంద్రుడు ఇక్కడ జరిపించాడని స్థలపురాణం చెబుతోంది.

తిరుచెందూర్: తిరునల్వేలి జిల్లాలో సముద్ర తీరాన ఉన్న విశాలమైన ఆలయం. శివుణ్ణి అభిషేకించడం కోసం సుబ్రహ్మణ్యుడు తన వేలాయుధంతో ఇక్కడ పుష్కరణిని సృష్టించాడు. పక్కనే సముద్రం ఉన్నప్పటికీ... పుష్కరణిలో నీరు తియ్యగా ఉంటుంది. శ్రీ ఆదిశంకరాచార్యులు ఈ క్షేత్రాన్ని దర్శించి, 'సుబ్రహ్మణ్య భుజంగ ప్రయాత స్తోత్రం' రచించారు.

పళని: తిరుచ్చి-మదురై మధ్యలో ఉన్న కొండపై ఉన్న క్షేత్రం ఇది. ఇక్కడ కుమారస్వామిని 'దండాయుధపాణి' అని పిలుస్తారు. కొండమీద 'శరవణపొయిగై' అనే తీర్థం ఉంది.

స్వామిమలై: తండ్రి అయిన పరమశివుడికి ప్రణవ రహస్యాన్ని సుబ్రహ్మణ్యుడు బోధించిన క్షేత్రం ఇది. అందుకే ఇక్కడ స్వామిని 'శివగురునాథుడు' అని కీర్తిస్తారు. తన సర్వశక్తులు కోల్పోయిన ఇంద్రుడు... సుబ్రహ్మణ్యుడి అనుగ్రహంతో వాటిని తిరిగి పొందాడని, అందుకు కృతజ్ఞతగా తన వాహనమైన ఐరావతాన్ని ఆయనకు బహూకరించాడనీ క్షేత్రపురాణం చెబుతోంది.

తిరుత్తణి: ఈ క్షేత్రం తిరుపతికి సమీపంలో ఉంది. ఆహ్లాదకరమైన కొండపై కొలువైన స్వామి... గిరిజనురాలైన వల్లీదేవిని ఇక్కడ వివాహం ఆడాడని ప్రతీతి. నాలుగు ప్రాకారాలు, 365 మెట్లు కలిగిన ఈ క్షేత్ర దర్శనం మరువరాని అనుభూతిని కలిగిస్తుంది.



పళమ్ ముదిర్ చోళై: ఇది మదురైకి సమీపంలో ఉంటుంది. శివ దంపతుల, విష్ణు దంపతుల సమైక్య, సమన్వయ స్వరూపమైన పరబ్రహ్మమే ఇక్కడి సుబ్రహ్మణ్యుడని స్కాంద పురాణం చెబుతోంది. ఈ స్వామిని అర్చిస్తే, శివ పార్వతులను, లక్ష్మీ నారాయణులను పూజించిన ఫలం దక్కుతుందని శాస్త్రవచనం.

• ఎ.సీతారామారావు

తెలుసుకుందాం

విగ్రహాలు లేదా ప్రతిమలు మూడు రకాలు... చిత్రం, చిత్రార్ధం, చిత్రాభాసం. ఈ మూడు రూపాలు పూజకు అర్హత కలిగినవేనని శిల్ప ఆగమ శాస్త్రాలు చెబుతున్నాయి.

చిత్రం, అర్ధ చిత్రం, చిత్రాభాసం

చిత్రం: 'చిత్రం' అంటే పరిపూర్ణ విగ్రహ స్వరూపం. అన్ని అవయవాలతో, శాస్త్రం సూచించిన కొలతలతో, నియమాలను అనుసరిస్తూ చేసిన సంపూర్ణ విగ్రహాన్నే 'చిత్రం' అంటారు. కేవలం విగ్రహం ముందు భాగాన్నే కాకుండా... వెనుక భాగాన్ని కూడా ప్రామాణికంగా మలచుతారు. సాధారణంగా మనం చూసే విగ్రహాలన్నీ ఈ కోవలోనికే వస్తాయి. ఈ ప్రతిమా రూపాలను ఆరాధిస్తే... వాటి ద్వారా కలిగే ఫలితాలు కూడా సంపూర్ణంగా లభిస్తాయి. అందుకే వీటిని 'పూర్ణ చిత్రాలు' అని కూడా అంటారు.

అర్ధ చిత్రం: ఏదైనా బండరాతిమీద, గోడ మీద... ప్రతిమ తాలూకు ముందు భాగాన్ని మాత్రమే శిల్పంగా చెక్కిన విగ్రహాలను 'చిత్రార్ధం' లేదా 'అర్ధ చిత్రం' అంటారు. అంతే కాదు, విడిగా తయారు చేసిన విగ్రహాలలో కూడా... వెనుక భాగం కనిపించకుండా, చదరంగా ఉండేలా లేదా ఆకారం లేకుండా తయారు చేసే వాటిని 'చిత్రార్ధం' అంటారు. ఈ రకం ప్రతిమలను ఆరాధిస్తే... అర్ధ ఫలితమే లభిస్తుంది.

చిత్రాభాసం: వస్త్రాల మీద, గోడల మీద, బండరాళ్ళ మీద, శిలా ఫలకాల మీద, కొయ్యల మీద, కాగితాల మీద రేఖామాత్రంగా రూపొందించేవాటిని 'ఆభాస చిత్రాలు' లేదా 'చిత్రాభాసాలు' అంటారు. మందమైన కాగితాన్ని గానీ, వస్త్రాన్ని కానీ గోటితో నొక్కుతూ రూపకల్పన చేసిన బొమ్మలు, వివిధ రకాల రంగులతో, వివిధ మాధ్యమాల మీద గీసిన బొమ్మలు ఈ కోవలోకి వస్తాయి. సాధారణంగా వీటిని 'చిత్ర పటాలు' అంటారు. శాస్త్ర ప్రకారం ఈ ప్రతిమలు కూడా ఆరాధనీయాలే. అయితే ఫలితాలు సాధారణంగా ఉంటాయి.

సాకార స్వరూపంలోని భగవంతుణ్ణి ఆరాధించడానికి పవిత్రమైన దేహ సంస్కారం, ప్రశాంతమైన చిత్తం, ప్రగాఢమైన సంకల్పశుద్ధి ప్రధానమైనవి. ఇవి కలిగిన భక్తులకు శీఘ్రంగా సంకల్ప సిద్ధి కలగడానికి ప్రతిమా ఆరాధన దోహదం చేస్తుంది.



• దగ్గుపాటి నాగవరప్రసాద్, స్థపతి, 9440525788

సహజయోగ

శ్రీ ఆది శంకరులను ఆయన గురువు గోవింద భగవత్పాదులు "నీవు ఎవరు?" అని అడిగిన ప్రశ్నకు సమాధానం... ఆత్మాష్టకం. అందులో ఆత్మ గురించి, ఆత్మ స్వరూపం గురించి శ్రీ శంకరులు చాలా లోతుగా వివరించారు. "మీ ఆత్మ గురించి తప్పకుండా తెలుసుకోవాలి" అని ఎందరో అవతారపురుషులు చెప్పారు. ఎందుకంటే... మనిషి తన ఆత్మ గురించి తెలుసుకోకుండా పరమాత్మ గురించి తెలుసుకోలేడు. ఆత్మ అనేది మన హృదయంలో ఉన్న పరమాత్మకు ప్రతిబింబం. అది నీటిలో కనిపించే సూర్యుడి ప్రతిబింబంలా ఉంటుంది. నీటిలో మనం సూర్యుణ్ణి ప్రతిబింబ రూపంలో చూస్తున్నప్పటికీ... ఆయన ఆ నీటిలో ఉండడు. ఎక్కడో ఆకాశంలో ఉంటాడు. అదే విధంగా ఆత్మ కూడా చిన్నదే అయినా... దాని మూలం అన్నిటికీ అతీతమైనది, అపరిమితమైనది. దాన్ని భగవంతుడు మన సూక్ష్మ శరీర వ్యవస్థలో, హృదయ స్థానంలో అంతర్గతంగా ఏర్పాటు చేశాడు.

పరమాత్మకు ప్రతిబింబమే ఆత్మ

ఆ వెలుగులలో...

భగవంతుడు తన సంకల్పంతో కుండలినీ శక్తిని కూడా మనలో ఏర్పాటు చేశాడు. అది మన వెన్నెముక చివరి భాగాన... త్రికోణాకారంలో ఉండే ఎముక లోపల నిక్షిప్తమై ఉంటుంది. మనం మనలో ఉన్న ఆత్మ తాలూకు ప్రతిబింబాన్ని తెలుసుకొనేలా చేసేది ఆ కుండలినీ శక్తే. సహజయోగంలో కుండలినీ ఉత్థానం చాలా సులువైనది, అది తక్షణమే జరుగుతుంది. మన గత జన్మ పాపకర్మల ప్రభావాన్ని తుడిచేసుకోవడానికి, పూర్వం నుంచి మనలో పోగు చేసుకున్న మురికిని వదుల్చుకొని స్వచ్ఛంగా ఉండడానికి అది సహాయపడుతుంది. కలియుగపు చీకటి ఛాయలు సమస్త ప్రపంచాన్నీ చుట్టుముడుతున్న ఈ సమయంలో... మన ఆత్మజ్యోతి ఉన్నతంగా ప్రజ్వలిస్తుంది. ఆ వెలుగులో మనం పవిత్రతను, ఆనందాన్ని, సౌభాగ్యాన్ని పొందగలుగుతాం. ఆ వెలుగుతోనే ప్రపంచంలోని చీకటిని పారద్రోలగలుగుతాం. ఇది చాలా మహత్తరమైన కార్యం. దీనికోసం మనలోని ఆత్మజ్యోతిని పరిశుభ్రంగా ఉంచుకోవడం అవసరం. దానివల్ల మన పాపాలు, గత జన్మ కర్మలు, అహంకారం... ఇలా అన్నీ తుడిచిపెట్టుకుపోతాయి.



మరణం ఒక మజిలీ...

ఈ లోకంలో మానవుడి తీరును అర్థం చేసుకోవడం కష్టం. దానికన్నా భగవంతుణ్ణి అర్థం చేసుకోవడం చాలా సులువు. ఎందుకంటే ఆయన ఎప్పుడూ ఒకేలా ఉంటాడు. ఆయనకు ద్వంద్వ వైఖరులు లేవు. మానవులలో ద్వంద్వ వైఖరే కాదు... అనేక విచిత్రమైన లక్షణాలు ఉన్నాయి. అవి మనని అరిషడ్వర్గాలకు బానిసలుగా చేస్తాయి. ఆ స్థితిని అధిగమించి, ఆత్మావలోకనం చేసుకున్నప్పుడు... మన ఆత్మకు మూలమైన పరమాత్మను కనుక్కోగలుగుతాం. "మానవుడి ఉనికి ఆత్మ. జననం నుంచి మరణం వరకూ శరీరం ఒక్కొక్క దశ నుంచి ఎలా ప్రయాణిస్తుందో... ఆత్మ కూడా అదే విధంగా ఒక దేహం నుంచి మరో దేహానికి వెళుతుంది. వివేకవంతులు జననం, మరణం అనే మాయలో పడకుండా సత్యాన్ని గ్రహించాలి. బాహ్య శరీరంమీద మనకు ఉన్న మమకారం వల్ల బాధ పుడుతోంది. అనంతమైన ఆత్మకు మరణం అనేది ఒక మజిలీయే కానీ అంతం కాదు" అని అర్జునుడికి శ్రీకృష్ణుడు హితవు చెప్పాడు. ఆత్మ నిత్యమనీ, నాశనం లేనిదనీ, అన్నిటికీ అతీతమనీ, కాబట్టి ఆత్మ తత్త్వాన్ని తెలుసుకొని బంధవిముక్తి పొందాలనీ సూచించాడు. గీతోపదేశం ద్వారా అర్జునుడి దృష్టిని ఆత్మ వైపు మరల్చి, ఆత్మసాక్షాత్కారం కలిగేలా చేశాడు శ్రీకృష్ణుడు.

నిర్మల చిత్తంతోనే సాధ్యం

'య నేతి నేతి వచనే నిగమ అగోచ...' అని చెబుతున్నాయి ఉపనిషత్తులు. "ఇది బుద్ధి కాదు, వివేకం కాదు, పంచభూతాలు కాదు, చిత్తం కాదు, ఇంద్రియాలు కాదు, దుఃఖం కాదు, సుఖం కాదు... వివిధ ఆలోచనలు, బంధాలతో సతమతం అవుతున్న మన మనసుకు 'ఇది కాదు, ఇది కాదు' అని ప్రతిదానికి చెప్పుకొంటూ పోతే... ఆలోచనలతో నిండిన పాత్ర ఖాళీ అయిపోతుంది. అప్పుడు ఆత్మ స్వరూపాన్ని గ్రహించగలుగుతాం" అని దాని అర్థం. యోగం అంటే... మనలో ఉన్న కుండలినీ శక్తి మన ఆత్మను ప్రకాశవంతం చేస్తూ... సహస్రార చక్రంలో పరమాత్మను కలవడమే. అటువంటి యోగం పొందాలన్న సద్బుద్ధి జన్మజన్మల పుణ్యఫలం వల్ల వస్తుంది. ఈ జన్మలో కలిగే నిర్మలమైన చిత్తం ద్వారానే అది సాధ్యం. అలాంటి సద్బుద్ధి ఉన్నవారే నిజమైన సత్యసాధకులు. శాంతి అనేది ఉపన్యాసాల వల్ల, ఉపవాసాల వల్ల రాదు. సహజంగా యోగాన్ని పొందడం ద్వారానే, అంటే పరమాత్మతో మనం ఐక్యం అయితేనే... ఆ శక్తి మనలో ప్రసరించి, మనకు ఆనందాన్ని శక్తిని కలుగజేస్తుంది. కుండలిని ఉత్థానం చెంది, ఆ శక్తి ఊర్ధ్వముఖంగా ప్రయాణించి, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించుకొని, సహస్రార చక్రాన్ని చేరుకున్నప్పుడు... సాధకునిలో ఆత్మ ప్రకాశిస్తుంది. అదే ఆత్మసాక్షాత్కారం. దాన్ని పొందిన వ్యక్తి... తాను శరీరం, బుద్ధి, రూపం... ఇలా ఏదీ కాదనీ, కేవలం ఆత్మను మాత్రమేననే వాస్తవాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. నిరంతర ధ్యానం ద్వారా కులమతాలకు, రాగద్వేషాలకు అతీతుడిగా ఉంటూ... ఆత్మస్వరూపునిగా వ్యక్తం కావడానికి కృషి చేస్తూ ఉంటాడు.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

ఆహ్వాన సన్నాహం

ఒక ఊరుకు ఎవరైనా ప్రముఖుడు రాబోతున్నారంటే... అక్కడ ఉండే అధికారులు, గ్రామ పెద్దలు ముందుగానే ఏర్పాట్లలో నిమగ్నమవుతారు. ఊరు ఊరంతా ఆయనను స్వాగతించడానికి సంసిద్ధం అవుతుంది. అదే విధంగా... ఏసు ప్రభువు ఉద్భవించబోతున్నట్టు దీర్ఘదర్శులు ముందుగానే చూచాయగా చెప్పారు. ప్రవక్తలు ఆయనకోసం పడిగాపులు కాశారు, తపోదీక్షల్లో, ప్రార్థనల్లో మునిగిపోయారు. ఆయన ద్వారా తాము ఆశించినవన్నీ నెరవేర్చుకోవడానికి సిద్ధమయ్యారు. క్రీస్తు రాబోతున్నాడని గొప్పగా ప్రకటించి, ఆయన మార్గాన్ని సిద్ధం చేసినవారిలో ఇద్దరు ప్రధానంగా కనిపిస్తారు. వారిలో ఒకరు యెషయా ప్రవక్త. ఏసు రాక గురించి 700 ఏళ్ళ క్రితమే తెలియజేశాడు. రెండో వ్యక్తి... ఏసుకు సమకాలీకుడైన యోహాను ప్రవక్త.

"దావీదు వంశం పతనమై ఎండిన వృక్షంలా కనిపిస్తుంది. ఆ మోడు నుంచి ఒక పచ్చని చిగురు పుట్టుకువస్తుంది. ఆ చిగురు ఆవిర్భావం అంటే ఏసు జననం" అని ప్రవచించిన యెషయా... ప్రభువు రాకకోసం ఎదురుచూసి, ఎదురుచూసి, నిరాశతో ప్రాణాలు విడిచాడు. ఆయన పేరిట బైబిల్‌లో ఒక పెద్ద అధ్యాయమే ఉంది. అందులో యూదులకు, ఇశ్రాయిలీలకు శాంతి హెచ్చరికలను కూడా ఆయన చేశాడు.

యోహాను క్రీస్తుకన్నా ఆరు నెలలు పెద్దవాడు. అతను ప్రజల కోసం ఒక ప్రకటన చేస్తూ... "నేను మీకు నీళ్ళతో మాత్రమే బాప్తిస్మం (బాప్టిజం) ఇస్తున్నాను. కానీ రాబోయే మహనీయుడు అగ్నితో బాప్తిస్మం ఇస్తాడు. అదిగో... ఆయన అడుగుల చప్పుడు వినిపిస్తోంది. ఆయన పాద రక్షలు మోయడానికి కూడా నాకు అర్హత లేదు" అని చెప్పాడు.

దైవమార్గం



అతను ప్రభువుకు బాప్తిస్మం ఇచ్చాడు. అందుకే అతనికి 'బాప్తిస్మ యోహాన్' అనే పేరు స్థిరపడిపోయింది. ఇర్మియా లాంటి ప్రవక్తలు ఎందరు ఉన్నప్పటికీ... ఎన్నో ఏళ్ళ ముందు యెషయా, దగ్గరగా ఉండి స్వాగతించిన యోహాను ఆయన రాకను ఊహించినవారుగా ప్రసిద్ధులయ్యారు. ఆయన వచ్చే మార్గంలో ఇరువైపులా నిలబడి ఆహ్వానానికి సన్నాహాలు చేస్తున్నవారుగా ఆ ఇద్దరూ కనిపిస్తారు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

గీతాసారం

రెండు దారులు

ఎవరైనా తమ శక్తి యుక్తులను శత్రుత్వాల కోసం, ద్వేషం కోసం వినియోగిస్తూ ఉన్నంతకాలం తాము నష్టపోతారు, తమ శత్రువులకు రెట్టింపు నష్టం కలిగిస్తూ ఉంటారు. అందుకే వదలాల్సింది ద్వేషాన్ని కాని కర్మను కాదని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. మనకు కాలం, శక్తి పరిమితంగా ఉంటాయి కాబట్టి వాటిని తెలివిగా ఉపయోగించుకోవాలి

మానవులు అనుసరించే రెండు భిన్నమైన మార్గాల గురించి శ్రీకృష్ణుడు వివరిస్తూ... "వాటిలో ఒకటి తిరిగి వెనక్కి రానక్కరలేని ప్రకాశవంతమైన మార్గం. రెండోది మళ్ళీ తిరిగి వచ్చే చీకటి దారి. ప్రకాశవంతమైన మార్గం మన శక్తిని బ్రహ్మన్ని చేర్చే అంతర్గత ప్రయాణం వైపు నడిపిస్తుంది. చీకటి దారి మన శక్తిని బహిర్గతమైన వాటివైపు, అంటే భౌతికతవైపు తీసుకు వెళుతుంది. దీనిప్రకారం ఫలాపేక్షతో కర్మలను చేసే కర్మయోగులు మరణించిన తరువాత మళ్ళీ జన్మిస్తున్నారు. ప్రతిఫలం ఆశించకుండా కర్మలు చేసేవారు జన్మరాహిత్యాన్ని పొందుతున్నారు" అని స్పష్టం చేశాడు. ఈ మార్గాల గురించి వివరించేటప్పుడు వేర్వేరు పేర్లను, గుణాలను ప్రస్తావించాడు. చీకటి మార్గాన్ని చావు, పుట్టుకలు అనే ధ్రువాల మధ్య ఊగిసలాడే లోలకం (పెండ్యులం) లాంటిదైతే, ప్రకాశవంతమైన మార్గం ... ఆ లోలకం తాలూకు ఇరుసును చేరుకోవడం లాంటిది. అది ధ్రువాలను అధిగమిస్తుంది. అది చేరుకొనేది ఒక్క బ్రహ్మన్ని... అంటే పరమాత్మను మాత్రమే. ఈ మార్గాలను అర్థం చేసుకున్నవారు మోహానికి గురికాబోరని, యజ్ఞాలద్వారా, తపస్సు ద్వారా, దానాల ద్వారా ఎలాంటి పుణ్యఫలాలు లభిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయో... వాటన్నిటినీ అధిగమించి అత్యున్నతమైన బ్రహ్మన్ని అంటే మోక్షాన్ని అటువంటి యోగులు పొందుతారని గీతాచార్యుడు తెలిపాడు.





కె. శివప్రసాద్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఇఫీ వేడుకలో బాలకృష్ణకు సన్మానం



గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో హీరో నందమూరి బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. గురువారం నిర్వహించిన ప్రారంభ వేడుకలో బాలకృష్ణను సత్కరించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, గవర్నర్ అశోక్ గజపతి రాజు, కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్, బాలకృష్ణకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. సినీ పరిశ్రమలో కథానాయకుడిగా 50 ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆయన అద్భుత నట ప్రస్థానానికి గుర్తింపుగా ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ "నా సుదీర్ఘ నట జీవితంలో భాగమైనవారందరికీ ధన్యవాదాలు. ఈ ప్రయాణంలో నా భార్య వసుంధర సహకారం మరువలేనిది. 'సినిమాల్లోకి వచ్చి 50 ఏళ్లు అవుతుందంటే, అసలు నీ వయసెంత?' అని మాత్రం నన్ను అడగొద్దు" అంటూ చమత్కరించారు. కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ మాట్లాడుతూ 'బాలకృష్ణ 50 ఏళ్ల సినీ ప్రస్థానం భారతీయ సినిమా చరిత్రలో ఒక మైలురాయి, ఆయన తన అద్భుతమైన నటన, ప్రజాదరణతో దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరించారని కొనియాడారు.

అలాంటి సినిమాకు దర్శకత్వం వహిస్తా


- అల్లరి నరేశ్



'ఎప్పట్నుంచో నాకు దర్శకత్వం వహించాలనే కోరిక ఉంది. సమయం కోసం వేచి ఉన్నా. తప్పకుండా ఒక సినిమాకు డైరెక్షన్ చేస్తా. అది డీడీఎల్‌జే(దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే)లా గుర్తుండిపోయే సినిమా కావాలనేది నా కోరిక' అని తన మనసులో మాట బయటపెట్టారు హీరో అల్లరి నరేశ్. ఆయన కథానాయకుడిగా నాని కాసరగడ్డ తెరకెక్కించిన చిత్రం '12ఎ రైల్వే కాలనీ'. శ్రీనివాసా సిల్వర్ స్ర్కీన్ బేనర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నరేశ్ విలేకరులతో ముచ్చటించారు. 'నేను కొత్త జానర్‌లో చేసిన సినిమా ఇది. హైదరాబాద్‌లో జరిగిన యదార్థ ఘటన ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. ఇందులో మూడు, నాలుగు కథలు సమాంతరంగా సాగుతుంటాయి. వీటి మధ్యన చాలా మైండ్ గేమ్ ఉంటుంది. ఇలాంటి స్ర్కీన్‌ప్లేతో తెలుగులో చాలా తక్కువ సినిమాలు వచ్చాయి. అందరికీ కనెక్టింగ్‌గా ఉంటుందనే ఈ చిత్రానికి రైల్వే కాలనీ అని పేరు పెట్టారు. కామాక్షి తెలుగమ్మాయి. మంచి ఆర్టిస్టు. యాక్టింగ్‌తోపాటు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో కూడా పనిచేశారు. మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ ఈ ప్రాజెక్టును ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నారు. చాలా ప్యాషన్‌తో పనిచేశారు. నాకు ఒక హారర్, ఒక మూకీ సినిమా చేయాలనుంది. డైలాగ్ లేకుండా నవ్వించాలనేది నా కోరిక' అని అన్నారు.

వినోదం, భావోద్వేగాల సమ్మేళనం

- ప్రియదర్శి



"ప్రేమంటే' సినిమాలో వినోదంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలూ ఉంటాయి' అని చెప్పారు హీరో ప్రియదర్శి. ఆయన కథానాయకుడిగా దర్శకుడు నవనీత్ శ్రీరామ్ తెరకెక్కించిన చిత్రమిది. రానా దగ్గుబాటి సమర్పణలో పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. నేడు విడుదలవుతున్న సందర్భంగా ప్రియదర్శి సినిమా విశేషాలు పంచుకున్నారు. 'ప్రేమ ఎంత అద్భుతంగా ఉంటుందనే విషయాన్ని మన కవులు తమ రచనల ద్వారా, గొప్ప దర్శకులు తమ సినిమాల ద్వారా ప్రపంచాని తెలియజేశారు. అదంతా సిద్ధాంతపరమైనది. నిజమైన ప్రేమంటే ఏమిటో పెళ్లి ద్వారానే అర్థమవుతుంది. ప్రేమంటే ఇంత బాగుంటుంది అని అనుకోవడం దగ్గరనుంచి ఇలా కూడా ఉంటుందని ఈ సినిమాలో చూపించాం. అందుకే ఈ చిత్రం అందరినీ అలరిస్తుంది. నవనీత్ చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. కథని అద్భుతంగా రాశాడు. జేమ్స్ సినిమాకు కావాల్సిన విధంగా మ్యూజిక్ ఇచ్చారు. నేను విలక్షణమైన కథలు చేస్తాననే గుర్తింపును ప్రేక్షకులు ఇచ్చారు. ఆ బాధ్యతతోనే సినిమాలు చేస్తున్నాను' అని అన్నారు.

క్లైమాక్స్ చూసి షాక్ అవుతారు

-కిరణ్ అబ్బవరం



'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం క్లైమాక్స్ గురించి విన్నప్పుడు షాక్‌కు గురయ్యాను. థియేటర్లలో మీరూ అలాగే ఫీల్ అవుతారు' అని కిరణ్ అబ్బవరం అన్నారు. అఖిల్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి తెరకెక్కించిన చిత్రమిది. వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. బన్నీ వాసు, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకు కిరణ్ అబ్బవరం ముఖ్య అతిథిగా హాజరై సనిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. 'ఇది నా మనసుకు బాగా దగ్గరైన సినిమా' అని వంశీ నందిపాటి అన్నారు. 'ఇది అందరి కథ. ఈ సినిమా చూశాక ప్రతి అమ్మాయి తండ్రీ ఆలోచనలో పడతారు' అని వేణు ఉడుగుల అన్నారు. 'కొన్ని సినిమాలు వినోదాన్ని అందిస్తే మరికొన్ని భావోద్వేగాలను అందిస్తాయి. ఈ సినిమా ఆ రెండింటినీ సమంగా ఇస్తుంది' అని రాహుల్ మోపిదేవి తెలిపారు.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,690 ▼	1,14,300 ▼	1,73,000 ▼
విజయవాడ	1,26,500 ▼	1,17,500 ▼	1,60,000 ▼
విశాఖపట్నం	1,26,800 ▼	1,14,450 ▼	1,73,000 ▼
రాజమండ్రి	1,24,250 ▼	1,13,900 ▼	1,58,000 ▼
ప్రొద్దుటూరు	1,24,800 ▼	1,14,820 ▼	1,60,000 ▼
ముంబై	1,22,560 ▼	1,12,270 ▼	1,54,110 ▼

రూపాయి మారకానికి లక్ష్యమేమీ పెట్టుకోలేదు

డాలర్ డిమాండ్ వల్లే క్షీణత

- ఆర్థిక స్థిరత్వానికే ప్రథమ ప్రాధాన్యం
- క్రిప్టోలు, స్టేబుల్ కాయిన్స్‌తో ముప్పెక్కువ
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



న్యూఢిల్లీ: రూపాయి మారకం విలువకు ఎలాంటి లక్ష్యాన్నీ నిర్దేశించలేదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. ఈ మధ్యకాలంలో రూపీ మారకం విలువ క్షీణించడానికి డాలర్లకు డిమాండ్ పెరగడమే ప్రధాన కారణమన్నారు. "అమెరికాతో భారత్ సానుకూలమైన వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటుందన్న విశ్వాసం ఉంది. ఆ డీల్ రూపాయిపై ఒత్తిడిని తగ్గిస్తుందని ఆశిస్తున్నాం. అమెరికా సుంకాలు, వాణిజ్య సంబంధ కారణాలతోనే ఈ మధ్య రూపాయి విలువ గణనీయంగా క్షీణించింది" అని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో గురువారం జరిగిన వీకేఆర్‌వీ రావు స్మారకోపన్యాస కార్యక్రమంలో మల్హోత్రా అన్నారు. ఈ ఏడాదిలో ఆసియా కరెన్సీల్లోకెల్లా రూపాయి అధికంగా క్షీణించింది. ఇప్పటివరకు రూపాయి మారకం విలువ 3.6% పతనమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% సుంకాలు, యూఎస్‌తో వాణిజ్యపరమైన ఇబ్బందులు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు ఇందుకు ప్రధాన కారణం.

మల్హోత్రా ఇంకా ఏమన్నారంటే..

- ఆర్‌బీఐ వద్ద విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు భారీగానే ఉన్నాయి. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
- ఆర్థిక స్థిరత్వమే ఆర్‌బీఐ ప్రథమ ప్రాధాన్యత. వ్యవస్థ రక్షణకు ఎలాంటి భంగం కలుగకుండా నిబంధనలను సరళీకరిస్తున్నాం.
- త్వరలో భారత్‌కు చెందిన మరిన్ని బ్యాంక్‌లు ప్రపంచంలోని 100 అతిపెద్ద బ్యాంక్‌ల జాబితాలో చేరతాయని ఆశిస్తున్నాం. ఆర్థిక విస్తరణ, బ్యాంకింగ్ రంగంలో వేగవంత వృద్ధి ఇందుకు దోహదపడనున్నాయి. ప్రస్తుతం భారత్ నుంచి ఎస్‌బీఐ (43వ స్థానం), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (73వ స్థానం) మాత్రమే ఈ లిస్ట్‌లో ఉన్నాయి.
- క్రిప్టోకరెన్సీలు, స్టేబుల్ కాయిన్స్‌తో ముప్పు ఎక్కువ. అందుకే వాటి విషయంలో ఆర్‌బీఐ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. అయితే, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఈ- లెండింగ్ వంటి డిజిటల్ ఆవిష్కరణలను సమర్థించడంతో పాటు ప్రోత్సహించాం.
- బ్యాంకింగ్ రంగంలో సైబర్ మోసాలను కట్టడి చేయడమే లక్ష్యంగా నకిలీ ఖాతాల ఏరివేత కోసం ప్రవేశపెట్టిన మ్యూల్‌హంటర్.ఏఐ టూల్ ఆశించిన ఫలితాలనిస్తోంది. ప్రతినెలా 20,000 వరకు నకిలీ ఖాతాను గుర్తిస్తోంది.

మల్హోత్రా కర్మ సిద్ధాంతం..

ఆర్‌బీఐ గవర్నర్ కావాలంటే ఏం చేయాలంటూ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ విద్యార్థులు మల్హోత్రాను అడిగారు. అందుకు ఆయన "మీ కర్మను (విధిని) ఇష్టంతో, ఉత్సాహంతో చేయండి.. ఫలితం దానంతట అదే వస్తుంది" అన్నారు.



మార్కెట్‌లోకి హోండా 'ఎలివేట్ ఏడీవీ'

ఎక్స్ షోరూమ్ ధర రూ.16.66 లక్షలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హోండా కార్స్ ఇండియా సరికొత్త ఎస్‌యూవీ 'ఎలివేట్ ఏడీవీ' ని మార్కెట్లో ప్రవేశపెట్టింది. యువతను ఆకట్టుకునేలా దీనికి అనేక అధునాతన ఫీచర్లు జోడించినట్టు మార్కెటింగ్ అండ్ సేల్స్ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ చెప్పారు. రెండు వెర్షన్లలో లభించే ఈ కారు ఎక్స్ షోరూమ్ ధర హైదరాబాద్‌లో రూ.15.20 లక్షల నుంచి రూ.16,66,800 వరకు ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలు తమకు అత్యంత కీలక మార్కెట్లని తెలిపారు. తమ మొత్తం అమ్మకాల్లో ఈ 2 రాష్ట్రాల వాటా ఏడు శాతం వరకు ఉంటుందన్నారు.

వచ్చే ఏడాది అల్ఫా ఈవీ: వచ్చే ఆర్థిక సంవత్సరం అల్ఫా ఈవీ కారును భారత్‌లోనూ విడుదల చేయబోతున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం ఇప్పటికే చార్జింగ్ పాయింట్ ఆపరేటర్లతో చర్చిస్తున్నట్టు కునాల్ చెప్పారు. ఈ ఈవీ కారును భారత్‌లో తయారుచేసి జపాన్‌తో సహా అనేక దేశాలకు ఎగుమతి చేయబోతున్నట్టు తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన ర్యాలీ

26,100 పాయింట్ల పైన నిఫ్టీ



ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ లాభాల బాట పట్టింది. ప్రధాన సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ ఒక దశలో 52 వారాల గరిష్ఠ స్థాయిలను తాకాయి. సెన్సెక్స్ చివరికి 446.21 పాయింట్ల లాభంతో 85,632.68 వద్ద ముగిసింది. నిఫ్టీ చివరికి 139.50 పాయింట్ల లాభంతో 26,192.15 వద్ద క్లోజయింది. ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల షేర్లు, ఎంపిక చేసిన కొన్ని ఫైనాన్సియల్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు గురువారం దేశీయ స్టాక్ మార్కెట్‌ను లాభాల బాట పట్టించాయి. ఎఫ్‌పీఐలు తిరిగి కొనుగోళ్లకు దిగడం, ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవడం కూడా ఇందుకు కలిసి వచ్చింది. పెద్ద అడ్డంకులేమీ లేకపోతే ఈ ఏడాది చివరికల్లా సెన్సెక్స్ 91,500 పాయింట్లకు చేరవచ్చునన్నది టెక్నికల్ విశ్లేషకుల అంచనా.

దూసుకుపోయిన రిలయన్స్ మార్కెట్ క్యాప్ : గురువారం రిలయన్స్ షేర్లు రేసుగుర్రంలా పరిగెత్తాయి. ఒక దశలో బీఎస్ఈలో షేరు ధర 2.42% లాభంతో రూ.1,550.90ని తాకడంతో మార్కెట్ క్యాప్ రికార్డు స్థాయిలో రూ.21 లక్షల కోట్లకు చేరింది. చివరికి 2.01 శాతం లాభంతో రూ1,549.10 వద్ద ముగిసింది. దీంతో షేర్ల మార్కెట్ విలువ రూ.20.96 లక్షల కోట్ల వద్ద ముగిసింది.

పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ రుణ సేకరణ పరిమితి పెంపు

పవర్ మెక్ ప్రాజెక్ట్స్ తన రుణ సేకరణ పరిమితిని ప్రస్తుత రూ.5,000 కోట్ల నుంచి రూ.7,500 కోట్లకు పెంచుకోవాలని భావిస్తోంది. ఇందుకు అవసరమైన తీర్మానానికి ఈ-ఓటింగ్ ద్వారా సేకరిస్తోంది. వాటాదారులు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 20 వరకు ఈ-ఓటింగ్ ద్వారా ఈ తీర్మానానికి తమ ఆమోదం లేదా తిరస్కరణ తెలపవచ్చునని పేర్కొంది.

2031 నాటికి 5 జీ యూజర్లు 100 కోట్లు

ఎరిక్సన్ మొబిలిటీ అంచనా



న్యూఢిల్లీ: భారత్‌లో 5జీ వినియోగదారులు వేగంగా పెరుగుతున్నారని, 2031 చివరినాటికి దేశంలో 5జీ యూజర్లు 100 కోట్లు మించిపోనున్నారని అంచనా వేసింది. ఈ ఏడాది చివరినాటికి 5జీ కస్టమర్లు 39.4 కోట్లకు చేరుకోవచ్చని, మొత్తం మొబైల్ వినియోగదారుల్లో వీరి వాటా 32 శాతంగా ఉండనుందని ఎరిక్సన్ పేర్కొంది. దేశంలో డిజిటలీకరణలో 5జీ ఇప్పటికే కీలక మౌలిక వసతిగా మారిందని ఎరిక్సన్ ఇండియా ఎండీ నితిన్ బన్సల్ అన్నారు.

డేటా సెంటర్ వ్యాపారంలో రూ.18,000 కోట్ల పెట్టుబడి

పీఈ సంస్థ టీపీజీతో టీసీఎస్ జట్టు

ముంబై: ఐటీ సర్వీసుల దిగ్గజం టీసీఎస్ తాను ఏర్పాటు చేయబోయే ఏఐ డేటా సెంటర్ వ్యాపారంలో సహకారానికి పీఈ కంపెనీ టీపీజీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ డేటా సెంటర్‌పై ఉభయ సంస్థలు రూ.18,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. హైపర్‌వాల్ట్‌గా నామకరణం చేసిన ఈ డేటా సెంటర్‌లో టీపీజీ రూ.8870 కోట్లు ఇన్వెస్ట్ చేయడం ద్వారా 27.5 నుంచి 49% మధ్యలో వాటా కలిగి ఉంటుంది. ఈ తరహా డేటా సెంటర్ ద్వారా కస్టమర్లు, భాగస్వాములకు సంపూర్ణంగా ఏఐ సొల్యూషన్లు అందించగలుగుతామని టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ అన్నారు.

బయోలాజికల్-ఇ వ్యాక్సిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్-ఇ తయారుచేసిన న్యూమోకోకల్ కాంజుగేట్ వ్యాక్సిన్ (పీసీవీ) న్యూబెవాక్స్ 14కి (బీఈ-పీసీవీ-14) ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు లభించింది. డబ్ల్యూహెచ్ఓ నుంచి బీఈ ప్రీ క్వాలిఫికేషన్ సాధించిన 11వ వ్యాక్సిన్ ఇది. 14 రకాల స్ట్రెప్టోకోకస్ న్యూమోనియా, మెదడువాపు, సెప్సిస్ వ్యాధుల నుంచి న్యూబెవాక్స్ రక్షణ కల్పిస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆరు వారాల వయసు గల పిల్లలకు దీన్ని వేయవచ్చు. ఈ గుర్తింపుతో ప్రపంచ దేశాలకు అత్యున్నత నాణ్యత గల పీసీవీ వ్యాక్సిన్లను సరఫరా చేసే అవకాశం తమకు కలిగిందని బయోలాజికల్-ఇ ఎండీ మహిమ దాట్ల అన్నారు.

కొండెక్కిన కోడి గుడ్ల ధర

100 గుడ్ల ధర రూ.673.. రిటైల్ ధర రూ.7 పైనే

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో కోడి గుడ్ల ధర కొండెక్కింది. చిత్తూరు జిల్లా హోల్‌సేల్ మార్కెట్లో 100 గుడ్ల ధర రికార్డు స్థాయిలో రూ.673కు చేరింది. విశాఖ, హైదరాబాద్ మార్కెట్లలోనూ 100 గుడ్ల ధర రూ.635కు (శుక్రవారం విక్రయించే ధర) చేరింది. విజయవాడ ప్రాంతంలోనూ హోల్‌సేల్ మార్కెట్‌లో ధర రూ.660కి చేరింది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ రూ.639 పలుకుతోంది. దీంతో రిటైల్ మార్కెట్లో ఒక్కో గుడ్డు ధర ఏడు రూపాయలు దాటిపోయింది. ఈ ధర ఇంకా పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఉత్తర భారతంలో చలితో గుడ్ల వినియోగం బాగా పెరిగింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అక్కడికి ఎగుమతులు భారీగా పెరిగాయి. దీనికి తోడు ఇటీవల ఏపీ, తెలంగాణలో వ్యాధులతో పెద్ద మొత్తంలో కోళ్లు చనిపోయి గుడ్ల ఉత్పత్తి తగ్గింది. దీంతో కోడి గుడ్ల ధర కొండెక్కిందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గుడ్ల ధర కొండెక్కినా కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.226కు తగ్గడం విశేషం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) — 21వ తేదీ



హైదరాబాద్	635	విజయవాడ	660
వరంగల్	637	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	106
వరంగల్	112	గుంటూరు	108
కరీంనగర్	112	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	105	అనంతపురం	109
గోదావరి	106		

హైదరాబాద్‌లో మరో రెండు అంతర్జాతీయ సంస్థల కార్యాలయాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మరో రెండు అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలు నెలకొల్పాయి. వాటిలో సొనోకో ప్రోడక్ట్స్, ఈబీజీ గ్రూప్ ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో అత్యాధునిక ఐటీ పెర్ఫార్మెన్స్ హబ్‌ను ప్రారంభించిన సొనోకో ఇప్పుడు శాశ్వత భవనంలోకి మారింది. హైదరాబాద్‌లో ఫైనాన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటు చేయనున్నట్టు కూడా కంపెనీ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారి రాజీవ్ అంకిరెడ్డిపల్లి ప్రకటించారు.

◆ వెల్‌నెస్, మొబిలిటీ, టెక్నాలజీ, రియల్టీ, లైఫ్‌స్టైల్ రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఈబీజీ గ్రూప్ హైదరాబాద్‌లోని డల్లాస్ సెంటర్‌లో ఈబీజీ పవర్ హౌస్‌ను ప్రారంభించింది. రాబోయే రెండేళ్ల కాలంలో ఈ సెంటర్‌పై 70 లక్షల డాలర్లు (రూ.6,160 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్టు కంపెనీ తెలిపింది.

స్పోర్ట్స్

నిఖత్ పసిడి పంచ్

9 స్వర్ణాలు కొల్లగొట్టిన భారత్ ● మొత్తం 20 పతకాలతో అదుర్స్



నిఖత్

ప్రీతి పవార్ · నూపుర్ · మీనాక్షి · అరుంధతి

వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్

గ్రేటర్ నోయిడా: వరల్డ్ బాక్సింగ్ కప్‌లో భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. మొత్తం 20 మంది బరిలోకి దిగితే.. అందరికీ పతకాలు లభించాయి. మనోళ్లు ఏకంగా 9 స్వర్ణాలతో అదరగొట్టారు. మహిళా బాక్సర్లు నిఖత్ జరీన్ (51 కిలోలు), మీనాక్షి హుడా (48 కి), ప్రీతి పవార్ (54 కి), జాస్మిన్ లంబోరియా (57 కి), పర్వీన్ (60కి), అరుంధతి చౌధరి (70 కి), నూపుర్ షెరాన్ (80+ కి)తోపాటు సచిన్ (60 కి), హితేష్ (70 కి) పసిడి కాంతులీనారు. మొత్తంగా భారత్ (9 బంగారు, 6 రజత, 5 కాంస్య) 20 పతకాలు సాధించింది. గురువారం జరిగిన ఫైనల్లో నిఖత్ 5-0తో గువా యి గ్జువాన్ (చైనీస్ తైపీ)ని మట్టికరిపించింది. పారిస్ ఒలింపిక్స్ రౌండ్-16లో ఓటమి తర్వాత వరల్డ్ చాంపియన్ నిఖత్ తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకుంది. వేగంగా కదులుతూనే పవర్ పంచ్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. ప్రతి రౌండ్‌లోనూ సాంకేతికంగా మెరుగైన ప్రదర్శన కనబర్చింది. ఈ పోటీల్లో నిఖత్ ఆడింది 2 బౌట్లు మాత్రమే. బై లభించడంతో ఆమె నేరుగా సెమీస్‌లో తలపడింది. ఇక మీనాక్షి 5-0 తో ఆసియా చాంపియన్ ఫర్జోనా ఫొటిలోవా (ఉజ్బెకిస్థాన్)పై, అరుంధతి 5-0తో జొకిరోవా (ఉజ్బెకిస్థాన్)పై, ప్రీతి 5-0తో సిరిన్ చర్రా బీ (ఇటలీ)పై, నూపుర్ 3-2తో సోతిమ్‌బయేవా (ఉజ్బెకిస్థాన్)పై, వరల్డ్ చాంపియన్ జాస్మిన్ 4-1తో పారిస్ ఒలింపిక్స్ పతక విజేత ఉ షి (చైనీస్ తైపీ)పై, పర్వీన్ 3-2తో అయాక తగుచి (జపాన్)పై గెలిచి స్వర్ణాలు నెగ్గారు. అయితే, 80 కిలోల విభాగంలో కజ్మర్‌స్కా (పోలెండ్) చేతిలో ఓడిన పూజారాణి రజతానికే పరిమితమైంది. పురుషుల విభాగం ఫైనల్లో సచిన్ 5-0తో సీట్‌బెక్ (కిర్గిస్థాన్)పై, హితేష్ 3-2తో నూర్‌బెక్ (కజకిస్థాన్)పై నెగ్గి స్వర్ణాలు సాధించారు. జాదూమణి (50 కి), పవన్ బర్త్వాల్ (55 కి), అవినాష్ (65 కి), అంకుష్ (80), నరేందర్ (90+ కి) తుది పోరులో ఓడి రజతాలు దక్కించుకొన్నారు.

ప్రతి ఒక్కరికీ పతకం: భారత్‌నుంచి మహిళలు, పురుషుల విభాగాల్లో పదేసి మంది చొప్పున 20 మంది దిగారు. వీరిలో ప్రతిఒక్కరూ పతకం సాధించారు. మహిళలకు 7 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు లభించాయి. పురుషులు 2స్వర్ణాలు, 5 రజతాలు, 3 కాంస్యాలు కైవసం చేసుకున్నారు.

టాప్ బాక్సర్లు దూరం..

అగ్రశ్రేణి బాక్సర్లు చాలా మంది ఈ ఈవెంట్‌కు దూరం కావడంతో టోర్నీ కళతప్పింది. బాక్సింగ్ పవర్‌హౌస్‌లైన కజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లు తృతీయ శ్రేణి జట్లను బరిలోకి దించడంతో మనోళ్లకు పెద్దగా పోటీ ఎదురుకాలేదు.

మళ్లీ ఒలింపిక్స్ రేసులోకి..

దాదాపు ఇరవై నెలల తర్వాత అంతర్జాతీయ బాక్సింగ్ రింగ్‌లో నిఖత్ జరీన్ గర్జించింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఓటమి తర్వాత కొద్ది కాలం గాయాలతో.. ఆ తర్వాత వెయిట్ విభాగంలో మార్పులతో ఒడిదుడుకులకు లోనైన నిఖత్.. వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో స్వర్ణం సాధించి మరోసారి సత్తా చాటుకుంది. ఈ విజయానంతరం 'ఆంధ్రజ్యోతి'తో నిఖత్ పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే...



సుదీర్ఘ విరామం తర్వాత అంతర్జాతీయ పోటీల్లో పసిడి పతకం సాధించడం సంతోషంగా ఉంది. ఈ విజయం నన్ను తిరిగి ఒలింపిక్స్ రేసులోకి తీసుకొచ్చింది. పారిస్ ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్‌లో ఓడిన తర్వాత తేరుకోవడానికి చాలా సమయం పట్టింది. ఈ విజయం నాలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఈ ఉత్సాహంతో త్వరలో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ సత్తా చాటుతా. వచ్చే ఒలింపిక్స్‌కు రెట్టింపు ఉత్సాహంతో ఇప్పటినుంచే సన్నాహకాలు మొదలుపెడతా. ఇందుకోసం వచ్చే రెండేళ్లు అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణించాల్సి ఉంది.

హైదరాబాద్‌లో సరైన సదుపాయాలు లేవు..

హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగిన విధంగా బాక్సింగ్‌లో సాధన చేసేందుకు అకాడమీలు, సదుపాయాలు లేవు. నేను కూడా పటియాల, బళ్లారి వంటి ప్రాంతాలకు వెళ్లి సాధన చేయాల్సి వస్తోంది. నగరంలో మంచి బాక్సింగ్ అకాడమీని నెలకొల్పేందుకు గతంలో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించాను. ఆయన సానుకూలంగా స్పందించారు. బాక్సింగ్‌లో నాలాంటి అమ్మాయిలు తెలంగాణ నుంచి మరింత మంది రావాలంటే రాష్ట్రంలో బాక్సింగ్ మౌలిక సదుపాయాలు మెరుగుపడాల్సి ఉంది. ఇందుకోసం అకాడమీ ఏర్పాటుపై ముఖ్యమంత్రిని మరోసారి కలిసి చర్చిస్తాను.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)



గిల్ సంగతేంటి?

ప్రాతినిధ్యంపై అనిశ్చితి.. నేడు ఫిట్‌నెస్ టెస్టు

ఆ తర్వాతే స్పష్టత.. దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు



గువాహటి: దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో స్పిన్ ఉచ్చులో పడిన టీమిండియా ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి జరిగే ఆఖరిదైన రెండో టెస్టులో గెలిచి తీరాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఈ కీలక పోరులో శుభ్‌మన్ గిల్ ఆడతాడా? లేదా? అనే విషయమై టీమ్ మేనేజ్‌మెంట్‌కు స్పష్టత లేదు. ప్రస్తుతం జట్టుతో పాటు గువాహటికి వెళ్లిన గిల్ ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నాడు. ఈడెన్ టెస్టులో అతను మెడ నొప్పితో బ్యాటింగ్ మధ్యలోనే క్రీజును వీడాల్సి వచ్చింది. గువాహటి టెస్టులో ఆడేదీ లేనిదీ శుక్రవారం గిల్ ఫిట్‌నెస్‌ను పరీక్షించాక తేలుతుందని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టం చేశాడు. ఏదేమైనా గిల్‌పై అనవసర రిస్క్ తీసుకోవద్దన్న ఆలోచనలో బోర్డు ఉంది.

సాయికే బెర్త్!: కెప్టెన్ గిల్ ఫిట్‌నెస్ టెస్టులో విఫలమైతే అతడి స్థానంలో ఎవరిని ఆడిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. కీపర్ రిషభ్ పంత్‌కు జట్టు పగ్గాలు అప్పజెప్పనుండగా.. సాయి సుదర్శన్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే ఇప్పటికే వన్‌డౌన్‌లో సుందర్ మెరుగ్గానే ఆడుతుండడంతో జురెల్‌ను నాలుగు, సాయిని ఆరో నెంబర్‌లో పంపవచ్చు. తుది జట్టులో స్థానం కోసం స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్, పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ మధ్య కూడా పోటీ నెలకొంది. కానీ పిచ్ పరిస్థితిని బట్టి వీరిద్దరిలో ఒకరు రెండో టెస్టులో ఆడనున్నారు. ఎర్ర మట్టితో చేసిన పిచ్ కావడంతో పేస్, బౌన్స్ లభిస్తుంటుంది. ఆ దిశగా ఆలోచిస్తే.. నితీశ్‌ను తీసుకుంటే ముగ్గురు పేసర్లతో జట్టు ముందుకెళ్లినట్టవుతుంది.

రో-కోకు పొగబెట్టారు!

మనోజ్ తివారీ





న్యూఢిల్లీ: భారత జట్టు మేనేజ్‌మెంట్‌పై మాజీ ఆటగాడు మనోజ్ తివారీ నిప్పులు చెరిగాడు. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను బలవంతంగా టెస్ట్ క్రికెట్ నుంచి వైదొలిగేలా చేశారని ఆరోపించాడు. కృత్రిమమైన సంధి దశను సృష్టించి వారిద్దరినీ ఇబ్బందులకు గురి చేశారన్నాడు. వాస్తవంగా రో-కో రెడ్ బాల్ క్రికెట్‌లో మరికొన్ని రోజులు కొనసాగాలనుకొన్నారని తివారీ చెప్పాడు. కానీ, వారిద్దరూ ఇమడలేని పరిస్థితులు సృష్టించారన్నాడు. 'నా దృష్టిలో సంధి దశ అనేది భారత్‌కు వర్తించదు. మన దేశవాళీ క్రికెట్‌లో అవకాశాలకోసం ఎదురుచూస్తున్న ఎంతో మంది ప్రతిభావంతులున్నార'ని తివారీ చెప్పాడు. కోల్‌కతా టెస్ట్ ఓటమి తర్వాత ఆటగాళ్లను కోచ్ గంభీర్ విమర్శించడాన్ని కూడా తివారీ తప్పుబట్టాడు. బ్యాటర్ల టెక్నిక్‌లో లోపముందని గుర్తించినప్పుడు.. కోచ్ ఎందుకు సరిదిద్దలేదని ప్రశ్నించాడు.

లిట్టన్, ముష్ఫికర్ శతక మోత

ఐర్లాండ్‌తో బంగ్లా టెస్టు

మీర్పూర్ : లిట్టన్ దాస్ (128), ముష్ఫికర్ రహీమ్ (106) శతక మోత మోగించగా, బౌలర్లు కూడా సత్తా చాటడంతో ఐర్లాండ్‌తో రెండో టెస్ట్‌లో బంగ్లాదేశ్ పూర్తిగా పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 292/4తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 476 రన్స్‌కు ఆలౌటైంది. వందో టెస్ట్‌లో ముష్ఫికర్ శతకం సాధించడం విశేషం. స్పిన్నర్ మెక్‌బ్రిన్ ఆరు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఐర్లాండ్.. బంగ్లా స్పిన్నర్ల ధాటికి రెండో రోజు చివరకు 98/5తో కష్టాల్లో పడింది.

లంకకు జింబాబ్వే షాక్

రావల్పిండి : ముక్కోణపు టీ20 టోర్నీలో శ్రీలంక జట్టుకు జింబాబ్వేకు షాకిచ్చింది. గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో 67 పరుగులతో లంకను చిత్తు చేసింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 162/8 స్కోరు చేసింది. బెన్నెట్ (49), కెప్టెన్ సికిందర్ రజా (47) సత్తా చాటారు. హసరంగ మూడు, ఇషాన్ మలింగ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో శ్రీలంక 20 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ షనక (34), రాజపక్ష (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ఇవాన్స్ మూడు, ఎన్ గవారా రెండు వికెట్లు తీశారు.

దీక్ష.. స్వర్ణ చరిత్ర

మహిత్‌కు రజతం.. బధిర ఒలింపిక్స్



టోక్యో : బధిర ఒలింపిక్స్‌లో భారత గోల్ఫర్ దీక్షా డాగర్ చరిత్ర సృష్టించింది. గురువారం జరిగిన మహిళల వ్యక్తిగత స్ట్రోక్‌ప్లే ఫైనల్ రౌండ్‌లో 24 ఏళ్ల దీక్ష అద్భుత ప్రదర్శనతో స్వర్ణం దక్కించుకుంది. 2021 బధిర ఒలింపిక్స్‌లో పసిడి పతకం సొంతం చేసుకున్న దీక్షా డాగర్ ఈసారి ఆ పతకాన్ని నిలబెట్టుకోవడం ద్వారా కొత్త చరిత్ర లిఖించింది. షూటింగ్ మహిళల 50 మీ. ప్రోన్ ఫైనల్లో మహిత్ సంధూ 246.1 పాయింట్లు స్కోరు చేసి రజత పతకం చేజిక్కించుకుంది. ఈ ఒలింపిక్స్‌లో మహిత్ సంధూకిది మూడో పతకం. క్వాలిఫికేషన్‌లో సంధూ ప్రపంచ రికార్డు సృష్టించింది.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

- ప్రణయ్, తరుణ్, శ్రీకాంత్ ఓటమి
- ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్

సిడ్నీ : టాప్ సీడ్ సాత్విక్/చిరాగ్ జోడీ, సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుష్ షెట్టి ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్స్‌లోకి అడుగుపెట్టారు. అయితే ప్రణయ్, తరుణ్, కిడాంబి శ్రీకాంత్ రెండో రౌండ్‌లోనే వెనుదిరిగారు. గురువారం జరిగిన డబుల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి 21-18, 21-11తో తైపీ జంట సు చింగ్ హెంగ్/వు గువాన్ జున్‌పై నెగ్గారు. ఆయుష్ షెట్టి 21-17, 21-16తో నాలుగో సీడ్ కొడాయ్ నరోకా (జపాన్)కు షాకిచ్చాడు. లక్ష్యసేన్ 21-17, 13-21, 21-13తో చి యు జెన్ (తైపీ)పై పోరాడి నెగ్గాడు. క్వార్టర్ ఫైనల్లో ఆయుష్-లక్ష్యసేన్ అమీతుమీ తేల్చుకోనున్నారు. ఇక ప్రణయ్-ఫర్హాన్ అల్వీ (ఇండోనేసియా) చేతిలో, శ్రీకాంత్ 20-22, 16-21తో షోగో ఒగావా (జపాన్) చేతిలో, తరుణ్ మన్నేపల్లి 13-21, 21-19, 10-21తో లిన్ (తైపీ) చేతిలో ఓటమితో టోర్నీ నుంచి తిరుగుముఖం పట్టారు.

ఇంగ్లండ్ కల నెరవేరేనా?

నేటి నుంచి యాషెస్ సిరీస్



పెర్త్: ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ జట్ల మధ్య ప్రతిష్ఠాత్మక యాషెస్ టెస్టు సిరీస్‌కు రంగం సిద్ధమైంది. ఐదు టెస్టుల్లో భాగంగా శుక్రవారం నుంచి పెర్త్ స్టేడియంలో తొలి మ్యాచ్ జరుగనుంది. బెన్ స్టోక్స్ సేన ఆసీస్ గడ్డపై 15 ఏళ్లుగా యాషెస్ కోసం ఎదురుచూస్తున్నా నిరాశ తప్పట్లేదు. అటు గాయం కారణంగా ఆసీస్ కెప్టెన్ కమిన్స్, పేసర్ హాజెల్‌వుడ్ తొలి టెస్టుకు దూరం కానున్నారు. ఆసీస్ తాత్కాలిక కెప్టెన్‌గా స్మిత్ వ్యవహరించనున్నాడు.

భారత ఫుట్‌బాల్..6 మెట్లు కిందికి

న్యూఢిల్లీ: 'ఫిఫా' ఫుట్‌బాల్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు ఆరు స్థానాలు దిగజారి 142వ ర్యాంకుకు చేరింది. మంగళవారం బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోవడం భారత్ ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపింది. 2016 తర్వాత మన జట్టు ఇంత తక్కువ ర్యాంకుకు పడిపోవడం ఇదే తొలిసారి.


సదస్సు కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికారులు, సిబ్బంది కోసం తాత్కాలిక వసతులు

తెలంగాణ రైజింగ్..

గ్లోబల్ సమ్మిట్‌కు 1,300 కంపెనీలు

- భారత్ ఫ్యూచర్‌సిటీలో 100 ఎకరాల్లో సదస్సు
- పనులను పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, అధికారులు
- గిన్నిస్‌బుక్ రికార్డు లక్ష్యంగా 9వ తేదీన గ్రాండ్ డ్రోన్ షో

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/కందుకూరు)

జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025' సదస్సుకు చకచకా ఏర్పాట్లు సాగుతున్నాయి. డిసెంబరు 8, 9 తేదీల్లో హైదరాబాద్ శివార్లలోని భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు సుమారు 1,300 అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. సదస్సు కోసం మీర్‌ఖాన్‌పేట సమీపంలో 100 ఎకరాల భూమి చదును చేస్తున్నారు. మరో 200 ఎకరాల్లో పార్కింగ్, రోడ్ల విస్తరణ, విద్యుత్ సరఫరా తదితర పనులు చేపట్టారు. ఈ ఏర్పాట్లను సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు పూర్తవుతుండటం, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా ప్రజాపాలన- ప్రజావిజయోత్సవాల నినాదంతో ఈ సదస్సును నిర్వహించనున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ రివర్ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డుతోపాటు ఫార్మా తదితర రంగాలకు పెట్టుబడుల సాధనే లక్ష్యంగా దీనిని చేపట్టారు. ఈ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ భారీ ప్రాజెక్టులపై ప్రజెంటేషన్లు ఇస్తారు. పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు, భూముల కేటాయింపులూ జరగనున్నాయి. సామాన్యుల కోసం మరో 2 రోజులు సదస్సును పొడిగించారు. డిసెంబరు 10, 11వ తేదీల్లో వివిధ జిల్లాల నుంచి ప్రజలను సదస్సుకు తరలించి, ఎగ్జిబిషన్ చూసేందుకు అవకాశం కల్పిస్తారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల కేసుపై విచారణ వచ్చే నెలకు వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీల భర్తీ కేసుపై విచారణను జస్టిస్‌లు విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం డిసెంబర్‌కు వాయిదా వేసింది. బీఆర్ఎస్ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించిన దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను నాటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గతేడాది జనవరి 13న కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను ప్రతిపాదించగా గవర్నర్ ఆమోదం తెలిపారు. దీన్ని గతేడాది ఆగస్టు 4న శ్రవణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుదీర్ఘ వాదనల తర్వాత.. కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకాన్ని రద్దు చేసిన సుప్రీంకోర్టు.. తుది తీర్పు వెలువరించలేదు. భవిష్యత్తులో ఎవరిని నియమించినా తుది తీర్పునకు అనుగుణంగానే ఉంటుందని తేల్చిచెప్పింది. అందులో భాగంగానే విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు

మరోసారి స్పీకర్ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

టికెట్‌పై గెలిచిన దానం నాగేందర్, కడియం శ్రీహరి సహా పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారని, వారిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్ ప్రసాద్‌కుమార్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై వారు సుప్రీం కోర్టునూ ఆశ్రయించారు. ఆ పది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లపైన విచారణ ప్రక్రియను అక్టోబరు 31 కల్లా పూర్తి చేయాలంటూ కోర్టు ఆదేశాలూ జారీ చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు విచారణ ప్రక్రియను చేపట్టిన స్పీకర్ ప్రసాద్‌కుమార్.. పది మంది ఎమ్మెల్యేలకూ నోటీసులు జారీ చేశారు. ఈ పది మంది ఎమ్మెల్యేలలో దానం నాగేందర్, కడియం శ్రీహరిలు మినహా మిగిలిన 8 మంది ఎమ్మెల్యేలూ అఫిడవిట్ల రూపంలో వివరణ ఇచ్చారు. వాటిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరాలు చెప్పడం, ఆ 8 మంది ఎమ్మెల్యేలపై విచారణ ప్రక్రియను చేపట్టడం వెంటవెంటనే జరిగాయి. విచారణ ప్రక్రియ నడుస్తున్న నేపథ్యంలో స్పీకర్ కార్యాలయం సుప్రీం కోర్టును మరికొంత గడువు కోరింది. అయితే బీఆర్ఎస్ పార్టీ మరోమారు సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో నాలుగువారాల్లో విచారణ ప్రక్రియ ముగించాల్సిందిగా స్పీకర్‌కు అత్యున్నత న్యాయస్థానం సూచన చేసింది. ఈ నేపథ్యంలో.. బుధవారంనాటికి ఆరుగురు ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లపైన విచారణను స్పీకర్ పూర్తి చేశారు. గురువారంనాడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీలపై దాఖలైన పిటిషన్లపై విచారణ ముగించారు. ఈ 8 పిటిషన్లపైన స్పీకర్ తన నిర్ణయం వెలువరించాల్సి ఉంది. కాగా.. 8 మందితో పాటుగా నోటీసులు అందుకున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి.. వివరణ ఇవ్వడానికి అప్పట్లో సమయం కోరారు. విచారణ ప్రక్రియను ముగించేందుకు సుప్రీం కోర్టు నాలుగు వారాలు గడువు ఇచ్చిన నేపథ్యంలో ఆ ఇద్దరికీ స్పీకర్ మరోసారి నోటీసులు జారీచేశారు. శాసనసభలో సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యునిగా కొనసాగుతున్న దానం నాగేందర్.. గత లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇక, కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య.. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆమె తరఫున కడియం శ్రీహరి బాహాటంగానే తిరిగి ప్రచారం చేశారు. వీరిద్దరిలో.. దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారనడానికి స్పష్టమైన ఆధారాలు ఉన్న నేపథ్యంలో ఆయనపై అనర్హతవేటు పడేందుకు ఆస్కారం ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ స్పీకర్ మరోమారు నోటీసులు జారీ చేయడంతో.. దానం నాగేందర్ గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అక్కడ ఆయన అధిష్ఠానం పెద్దలను కలవనున్నట్లు చెబుతున్నారు.

గ్రామీణ భారతానికి నాడి.. నాబార్డు

నిశ్శబ్ద శక్తిగా ఆర్థిక వ్యవస్థకు దన్ను.. రాష్ట్రంలో టీ-ఫైబర్‌తో అనేక ప్రయోజనాలు

- నాబార్డు ఎర్త్ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి
- ఆవిష్కరణలతో రైతాంగానికి మహర్దశ: తుమ్మల


నాబార్డు ఎర్త్ సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న భట్టి, తుమ్మల

హైదరాబాద్/రాయదుర్గం, నవంబరు 31 (ఆంధ్రజ్యోతి): భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావటంలో జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) కృషి ఎనలేనిదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. నిశ్శబ్ద శక్తిగా పనిచేస్తూ ఆర్థిక వ్యవస్థకు నాబార్డు దన్నుగా నిలుస్తోందని తెలిపారు. నాబార్డు లేకపోతే గ్రామీణ భారతదేశం లేదని అన్నారు. నాబార్డు, భారత్ ఇంటర్నేషనల్ మొబైల్ అసోసియేషన్ సంయుక్తంగా మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన ఎర్త్ సమ్మిట్‌లో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాబార్డు సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి, వ్యవసాయ, నీటిపారుదల రంగాల అభివృద్ధికి కృషిచేస్తోందని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధునీకరణ, వ్యవసాయ డిజిటలైజేషన్, ఎఫ్‌పీవోలకు సుస్థిర శక్తి ఇవ్వటంలో నాబార్డు పాత్ర కీలకమని ప్రశంసించారు. డిజిటల్ హైవేల ఏర్పాటులో భాగంగా టీ-ఫైబర్ ద్వారా 43 వేల కిలోమీటర్ల మేర ప్రతి గ్రామాన్ని కలుపుతున్న వ్యవస్థ టెలి మెడిసిన్, రిమోట్ విద్య, ఈ-కామర్స్, ఆధునిక వ్యవసాయానికి ఎంతో శక్తిని అందిస్తోందని తెలిపారు. గ్రామీణ భారతావని అభివృద్ధికి సంస్కరణలు, కొత్త ఆవిష్కరణలతో బాటలు వేయొచ్చని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మిట్‌లో నాబార్డు చైర్మన్ షాజీ, సీజీఎం ఉదయభాస్కర్, గోవర్ధన్‌సింగ్ రావత్, డాక్టర్ అజయ్ కుమార్ సూద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎర్త్ సమ్మిట్‌లో ప్రదర్శించిన సరికొత్త ఆవిష్కరణలు ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక రంగాలకు సంబంధించిన ఆవిష్కరణలను ప్రదర్శించారు. అంకుర పరిశ్రమలు, మహిళల ఆధారిత ఎంటర్ పెన్యూర్‌షిప్, గ్రామీణ బ్యాంకులు ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేశాయి.

బయో ఫెర్టిలైజర్ మైక్రో మ్యాజిక్

పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులను రైతుస్థాయిలో తయారుచేసుకునేందుకు వీలుగా రూపొందించిన మైక్రో మ్యాజిక్ యూనిట్‌ను ఎర్త్ సమ్మిట్‌లో ప్రదర్శించారు. దీనితో నాణ్యమైన బయో ఫెర్టిలైజర్, బయోపెస్టిసైడ్‌లను ఉత్పత్తి చేసుకోవచ్చు. మార్కెట్లో బయో ఉత్పత్తులు లీటరుకు రూ.250 నుంచి రూ.400 వరకు ఖర్చు అవుతుంది. సొంతంగా మైక్రో మ్యాజిక్‌లో తయారు చేస్తే... ఒక లీటరు ఉత్పత్తికి రూ.25 నుంచి రూ.40 మాత్రమే రైతులకు ఖర్చు వస్తుందని తయారీదారులు తెలిపారు. దీని ఒక యూనిట్ విలువ రూ.3.50 లక్షలు. ఒక యూనిట్‌తో 2 వేల ఎకరాలకు సరిపడా 40 వేల లీటర్ల బయో ఎరువులు ఉత్పత్తి చేసుకోవచ్చు. ఒక్కో బ్యాచ్‌కు 600 లీటర్ల చొప్పున మూడునాలుగు రోజుల్లో మొత్తం ఉత్పత్తి వస్తుంది.

అర గంటలో భూసార పరీక్షలు



ఆటోమెటిక్ సాయిల్ టెస్టింగ్ యూనిట్‌ను కృషి తంత్ర సంస్థ ప్రదర్శించింది. భూమిలో నత్రజని, భాస్వరం, బోరాన్, సల్ఫర్, కాపర్, ఐరన్, జింక్, మాంగనీసు తదితర మూలకాల స్థాయి ఎంత ఉంది? భూసారం పెంచటానికి ఏంచేయాలి? నేల స్వభావం ఏమిటి? ఏ పంటలకు అనుకూలిస్తుంది? అనేవి కేవలం అరగంటలో వెల్లడించే భూసార పరీక్షలు చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. దీని ద్వారా 15 రకాల పరీక్షలను ఏకకాలంలో చేయొచ్చు. 95 శాతం కచ్చితత్వంతో ఫలితాలు ఇస్తుంది. ఒక యూనిట్ విలువ రూ. 1.80 లక్షలు.

రాళ్ల నేలల్లో రుద్ర స్టోన్ పికర్

రాళ్లు, రప్పలతో ఉన్న భూములను సాగుకు యోగ్యంగా మార్చటానికి 'రుద్ర స్టోన్ పికర్'ను అగ్రి బిజినెస్ ఇంక్యుబేషన్ ఫౌండేషన్, ఐఐటీ ఖరగ్‌పూర్ సంయుక్తంగా తయారుచేశాయి. 4 గంటల్లో ఒక ఎకరం విస్తీర్ణంలోని రాళ్లను ఇది తొలగిస్తుంది. 5 సెం.మీ నుంచి 50 సెం.మీ వరకున్న రాళ్లను ఇది ఏరి పారేస్తుంది. ఒక్కో యూనిట్ ధర రూ.7.50 లక్షలు కాగా... అద్దెకు కూడా ఇచ్చే వెసులుబాటు కల్పించారు. గంటకు రూ.2,500 అద్దె చెల్లించి రుద్ర స్టోన్ పికర్‌ను వినియోగించుకోవచ్చు.



ఒక్క చార్జితో 4 ఎకరాలు దున్నే ఎలక్ట్రిక్ ట్రాక్టర్

ఐఐటీ పాలక్కడ్, అలెప్, వీహబ్ సహకారంతో కెనారెక్స్ సంస్థ తయారుచేసిన ఎలక్ట్రిక్ ట్రాక్టర్ ఆకట్టుకుంది. ఈ ట్రాక్టర్‌కు ఒకసారి ఛార్జింగ్ పెడితే 4- 6 గంటలపాటు పనిచేస్తుంది. 4 ఎకరాలు దున్నుతుంది. దీని పైకప్పు సోలార్ ప్యానళ్లతో నిర్మితమై ఉంటుంది. ఎలాంటి శబ్దం, కాలుష్యం ఉండదు. జీపీఎస్, రిమోట్ సిస్టం, కెమెరా, బ్లూటూత్, సోలార్ ఎనర్జీ, మొబైల్ యాప్ ఇంటిగ్రేషన్ వంటి సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. రొటోవేటర్, కల్టివేటర్, ట్రైలర్, సీడ్‌డ్రిల్, స్ప్రేయర్... తదితర పనిముట్లను దీనితో వినియోగించుకోవచ్చు. దీని ధర రూ.12 లక్షలు అని కంపెనీ తెలిపింది.

జాతీయ కీలక ఖనిజాల కమిటీలో సింగరేణి

- 19న ఉత్తర్వులు జారీ చేసిన నీతి ఆయోగ్
- 2300 మెగావాట్ల థర్మల్-సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రాజస్థాన్ ఆమోదంపై డిప్యూటీ సీఎం భట్టి హర్షం

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో కీలక ఖనిజాల గుర్తింపు, అన్వేషణ కమిటీలో సింగరేణికి చోటు దక్కింది. ఈ మేరకు ఆ కమిటీలో సభ్యుడిగా సింగరేణి సీఎండీని నియమిస్తూ ఈనెల 19న నీతి ఆయోగ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి ఐఐటీ-ఐఎస్ఎం మినరల్స్ అడ్వైజర్ డీకే సింగ్ చైర్మన్‌గా ఉంటారు. సభ్యులుగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ డైరెక్టర్, సింగరేణి సీఎండీ, నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ సీఎండీ, కోల్ ఇండియా సీఎండీ, కరైకుడి సీఎస్ఐఆర్ డైరెక్టర్, కేంద్ర మైనింగ్ మంత్రిత్వశాఖ కార్యదర్శి, గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఇండియన్ ప్రైమరీ కాపర్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ సీఈవో, కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సెక్రటరీ జనరల్‌ఉంటారు. ఇక సభ్య కార్యదర్శిగా నీతిఆయోగ్ డిప్యూటీ అడ్వయిజర్ (మినరల్స్) శరవణభవన్ ఉన్నారు. కీలక ఖనిజ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ఇతర రాష్ట్రాల కన్నా ముందే కార్యాచరణ ప్రారంభించడంతో తెలంగాణ ప్రభుత్వం దేశవ్యాప్త గుర్తింపును పొందిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. జాతీయ స్థాయి కీలక ఖనిజాల గుర్తింపు, అన్వేషణ కమిటీలో సింగరేణికి నీతిఆయోగ్ ప్రముఖ స్థానం కల్పించడం దీనికి నిదర్శనమన్నారు. దేశీయ అవసరాలకు కీలక ఖనిజాల అన్వేషణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రోత్సహిస్తూ ముందుకెళ్తోందన్నారు. కీలక ఖనిజాల రంగంలో గల అవకాశాలపై అధ్యయనానికి ఏజెన్సీలను నియమించుకున్నామన్న భట్టి.. ఆస్ట్రేలియా, రష్యా, ఘనా వంటి దేశాలతో వ్యాపార విస్తరణ అవకాశాలపై చర్చిస్తున్నామన్నారు. ఇటీవల కేంద్రం నిర్వహించిన కీలక ఖనిజాల అన్వేషణ వేలంలో పాల్గొన్న సింగరేణి.. బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్స్ కూడా సాధించిందన్నారు. రాజస్థాన్ విద్యుత్‌ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్‌తో కలిసి సింగరేణి 2300 మెగావాట్ల థర్మల్, సౌరవిద్యుత్ ఉత్పాదనకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఆ రాష్ట్రం ఆమోదించడం హర్షణీయమని భట్టి తెలిపారు. దీంతో రాజస్థాన్‌లోని సోలార్ వ్యాలీలో ఏర్పాటుచేసే 1500 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటుకు స్థలం త్వరితగతిన సమకూరుతుందన్నారు.

భార్యాబిడ్డలను హతమార్చిన వ్యక్తికి ఉరి

- 2019 నాటి కేసులో వికారాబాద్ కోర్టు సంచలన తీర్పు
- 43 ఏళ్ల ఆ కోర్టు చరిత్రలో తొలిసారి ఒకరికి ఉరిశిక్ష


భార్య చాందిని, పిల్లలు ఆయాన్, ఏంజిల్‌తో ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రేమించి పెళ్లాడిన భార్యతోపాటు ఇద్దరు బిడ్డలను హతమార్చిన వ్యక్తికి వికారాబాద్ డిస్ట్రిక్ ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి శ్రీనివాస్‌రెడ్డి ఉరి శిక్ష విధించారు. 2019 నాటి కేసులో దోషిగా తేలిన ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తికి వ్యక్తికి ఉరిశిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా 6 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాలని తీర్పు వెలువరించారు. వికారాబాద్‌లో కోర్టు ప్రారంభమై 43 ఏళ్లు ఇవ్వగా.. ఒకరికి ఉరిశిక్ష విధించడం ఆ కోర్టు చరిత్రలో ఇదే ప్రథమం.. తాండూరుకు చెందిన ప్రవీణ్ కుమార్ కుటుంబం శేరిలింగంపల్లి శివారులో నివసించేది. అదే ప్రాంతానికి చెందిన చాందిని అనే వివాహితను ప్రవీణ్ ప్రేమించాడు. చాందిని భర్త దివ్యాంగుడు కాగా వారికి కుమారుడు అయాన్ ఉన్నాడు. చాందినికి దగ్గరైన ప్రవీణ్.. ఆమె కుమారుడు అయాన్‌ను సొంత కొడుకులా చూసుకుంటానని మాటిచ్చాడు. దీంతో ప్రవీణ్, చాందిని పెద్దలకు తెలియకుండా రహస్యంగా వివాహం చేసుకొని వికారాబాద్‌లో కాపురం పెట్టారు. ఆ తర్వాత వారికి ఏంజిల్ అనే కూతురు జన్మించింది. ప్రవీణ్ ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా, చాందిని స్థానికంగా ఓ ప్రైవేటు స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేసేవారు. పిల్లలిద్దరినీ చాందిని పనిచేసే బడిలోనే చేర్పించారు. అయితే, తన భార్య ఎవరితోనే ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతోందని ప్రవీణ్ అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య చాలాసార్లు గొడవలు జరిగాయి. అదే సమయంలో అయాన్‌ను పాఠశాలలో చేర్పించే సమయంలో తండ్రి పేరు స్థానంలో తన పేరు నమోదు చేయించేందుకు ప్రవీణ్ నిరాకరించాడు. దీంతో గొడవలు మరింత అధికమయ్యాయి. ఈ క్రమంలో 2019 ఆగస్టు 4న ప్రవీణ్ తల్లి, సోదరుడు వికారాబాద్‌లో వారింటికి రాగా.. ముగ్గురూ కలిసి ఇంట్లోనే మద్యం సేవించారు. దీనిపై చాందిని ఆగ్రహం వ్యక్తం చేయగా ప్రవీణ్ తల్లి, సోదరుడు వెళ్లిపోయారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ప్రవీణ్.. నిద్రపోతున్న చాందినిని ఇనుప రాడ్డుతో కొట్టి హతమార్చాడు. తాము లేకపోతే పిల్లలు అనాథలవుతారనే ఆలోచనతో అయాన్‌ను, కూతురు ఏంజెల్‌ను కూడా చంపేశాడు. ముగ్గురినీ హతమార్చిన తర్వాత ఆత్మహత్య చేసుకునేందుకు ప్రవీణ్ రైలు పట్టాల వైపు వెళుతుండగా.. పెట్రోలింగ్ పోలీసులు అడ్డుకొని విచారించడంతో జరిగిన దారుణం వెలుగు చూసింది. అప్పటి ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు సెక్షన్ 302 ఐపీసీ కింద 247/2019 కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అప్పటి సబ్ డివిజన్ డీఎస్పీ పి.సీతారాం (ఐవో-2), ఆ తర్వాత వచ్చిన డీఎస్పీ ఎ.సంజీవరావు (ఐవో-3) ఈ కేసు దర్యాప్తులో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా పర్యవేక్షించారు. నేరానికి సంబంధించిన పత్రాలు, సాక్ష్యాలను కోర్టులో సమర్పించారు. ఇరుపక్షాల వాదనలను విన్న డిస్ట్రిక్ ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి గురువారం తుది తీర్పు వెల్లడించారు. కాగా, కోర్టు తీర్పు విన్న వెంటనే ప్రవీణ్ కన్నీటి పర్యంతమయ్యాడు. భార్య, పిల్లలను హత్య చేసిన రోజే పోలీసులు పట్టుకోకుంటే తాను ఆరోజే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేవాడినని, అప్పుడే తన జీవితం ముగిసిపోయేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు పట్టుకోకపోతే తన జీవితం ఆనాడే ముగిసి ఉరిశిక్ష తప్పేదని వాపోయాడు.

కేటీఆర్ విచారణకు అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

వినతిని సెప్టెంబరు 9న రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపింది. దీనిపై న్యాయనిపుణుల సలహాలు తీసుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. తాజాగా ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చారు. ఈ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ (డీవోపీటీ) కూడా అనుమతినివ్వాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే డీవోపీటీకి లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన విజిలెన్స్ కమిషనర్.. అర్వింద్‌కుమార్ విచారణకు అనుమతి ఇచ్చారు. ఇక డీవోపీటీ అనుమతి కోసం ఏసీబీ అధికారులు ఎదురుచూస్తున్నారు. ఈ కేసులో ఏ3గా ఉన్న హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆయన విచారణకు విజిలెన్స్ అనుమతి సరిపోతుంది. ఫార్ములా-ఈ రేసుకు సంబంధించి గతేడాది ఏసీబీ కేసు నమోదు చేసిన తర్వాత ఈడీ సైతం మనీ లాండరింగ్ కోణంలో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. గత ప్రభుత్వంలో పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ మంత్రివర్గం అనుమతి లేకుండా, సచివాలయ నిబంధనలకు విరుద్ధంగా డబ్బు విడుదలకు అనుమతినివ్వడంతో హెచ్ఎండీఏకు రూ.54.88 కోట్ల నష్టం జరిగిందంటూ ఐఏఎస్ అధికారి దానకిషోర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ అధికారులు కేటీఆర్, అర్వింద్, బీఎల్ఎన్‌రెడ్డితో పాటు గ్రీన్ కో కంపెనీ యాజమాన్యాన్ని, ఫార్ములా-ఈ రేసు సీఈవోను పలుమార్లు విచారించారు. అనేక సాక్ష్యాధారాలను సేకరించారు. కేటీఆర్ ప్రమేయంతోనే చెల్లింపులు జరిగాయని నిర్ధారించుకున్న అధికారులు.. సెల్‌ఫోన్, ట్యాబ్‌ను అప్పగించాలంటూ నోటీసులిచ్చారు. ఫోన్ ఇవ్వడానికి నిరాకరిస్తూ కేటీఆర్ ఏసీబీకి లేఖ రాశారు. కేటీఆర్ తదితరులపై ఏసీబీ అధికారులు గతేడాది డిసెంబరు 19న కేసు నమోదుచేశారు. సాక్ష్యాధారాలన సేకరించిన ఏసీ బీ.. త్వరలోనే కోర్టులో చార్జిషీటు దాఖలు చేయనుంది. కేటీఆర్ తదితరులపై నమోదైన సెక్షన్లు బెయిలుకు వీల్లేనివి కావడంతో ఆయన్ను అరెస్టు చేస్తారన్న ప్రచారం జరుగుతోంది.

రేవంత్ ఆదేశించారు.. గవర్నర్ పాటించారు: బీఆర్ఎస్

ఫార్ములా-ఈ రేసు కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ అనుమతించడంపై బీఆర్ఎస్ నేతలు స్పందించారు. 'సీఎం రేవంత్ ఆదేశించారు.. గవర్నర్ పాటించారు' అని ఆరోపించారు. ఆ పార్టీ నేతలు సురేశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, కర్నె ప్రభాకర్, ఎర్రోళ్ల శ్రీనివాస్, దాసోజు శ్రవణ్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న కేటీఆర్ గొంతు నొక్కాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తోందన్నారు. ఏసీబీ విచారణకు గవర్నర్ అనుమతి తెలపడంతో కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్ఎస్‌పై చేస్తున్న కుట్ర తేటతెల్లమైందని చెప్పారు.

కాంగ్రెస్ సర్కారు కక్ష సాధింపులకు పోదు..

- అలా చేసుంటే కేసీఆర్ కుటుంబం జైల్లోనే ఉండేది
- గవర్నర్ అనుమతి ఎందుకు జాప్యమైందో కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లే చెప్పాలి: మహేశ్ గౌడ్




హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలకు పోదని.. అలా చేసి ఉంటే కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావులు ఈపాటికే జైల్లో ఉండి ఉండేవారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమితో బీజేపీకి దిమ్మ తిరిగిపోయిందని, దీంతో ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు గవర్నర్ అనుమతి వచ్చేసిందని చెప్పారు. గవర్నర్ అనుమతించేందుకు 6 నెలల సమయం ఎందుకు పట్టిందన్నది కేంద్ర మంత్రులు, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లే చెప్పాలన్నారు. గురువారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నట్లుగా ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌ల మధ్య చీకటి ఒప్పందాలే ఉంటే ఆరు నెలల కిందటే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలుకు గవర్నర్ నుంచి అనుమతి వచ్చి ఉండేది కదా అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్‌పై చట్ట ప్రకారమే విచారణ జరుగుతుందన్నారు. పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినంత మాత్రాన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పోరాటం ముగిసినట్లు కాదన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. కాగా, ఓట్ చోరీని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం కోసం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చైర్మన్‌గా ఓ కమిటీని మహేశ్‌గౌడ్ నియమించారు.

లొట్ట పీసు కేసన్న కేటీఆర్.. విచారణకు సహకరించాలి: చామల

ఫార్ములా ఈ రేసు కేసును లొట్ట పీసు కేసన్న కేటీఆర్.. విచారణకు సహకరించాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేటీఆర్‌పై చార్జ్‌షీట్ ఫైల్ చేయాలంటే ఏ2గా ఉన్న ఐఏఎస్ అర్వింద్ కుమార్‌నూ విచారించాల్సి ఉంటుందని.. అయితే ఆయనపై చార్జ్‌షీట్ దాఖలు కాకుండా డీఓపీటీలో ఆపే ప్రయత్నం బీజేపీ చేస్తోందని ఆరోపించారు. కేటీఆర్ నిజంగా నిజాయతీపరుడే అయితే.. ఫార్ములా ఈ రేసు కేసుకు సంబంధించి రక్షణ కోసం కోర్టులను ఆశ్రయించకుండా విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. తప్పు చేస్తే చట్టం ముందు ఎవరైనా ఒకటేనని.. కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ ఆమోదమన్నది రాజ్యాంగబద్ధమైన విషయమని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.కోటి పరిహారం హామీ ఏమైంది?

- 4నెలలైనా సిగాచి ప్రమాద బాధితులకు న్యాయం జరగలేదు
- మీరు చెప్పిన మాటకే విలువ లేదా?
- సీఎం రేవంత్‌కు హరీశ్ లేఖ



హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిగాచి ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామన్న హామీ ఏమైందని, 4 నెలలు గడిచినా ఎందుకు ఇవ్వలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు... సీఎం రేవంత్ రెడ్డికి రాసిన బహిరంగ లేఖలో ప్రశ్నించారు. సీఎం మాటలకే విలువ లేకపోతే ఆ బాధితులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలని అడిగారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి పరిశ్రమలో 54 మంది కార్మికులను పొట్టనపెట్టుకున్న నాటి దుర్ఘటన ఇంకా కళ్లముందే కదలాడుతోందని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోడ్డున పడ్డ కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. 'గత 4 నెలల్లో బాధితుల చేతికి అందింది రూ.26 లక్షలే (కంపెనీ ఇచ్చిన రూ.25 లక్షలు+ప్రభుత్వం తరఫున ఇచ్చిన రూ.లక్ష). ఒక్కో కుటుంబానికి రూ.74 లక్షలు బాకీ పడ్డారు. కానీ కార్మిక మంత్రి బాధితులకు రూ.40-50 లక్షలు అందించామని నిస్సిగ్గుగా చెబుతున్నారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ డబ్బులు వారి హక్కు. అది మీ భిక్ష కాదని గుర్తుంచుకోండి. ఆ డబ్బులూ మీరిచ్చే నష్టపరిహారంలో కలిపి లెక్కలు చెప్పడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమ'ని విమర్శించారు. కేంద్రం ప్రకటించిన రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా బాధితులకు అందలేదన్నారు.

కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట: హరీశ్


ఫార్ములా ఈ రేస్‌పై కాంగ్రెస్ సర్కార్ రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతోందని, అక్రమ కేసులతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తోందని హరీశ్‌రావు ఒక ప్రకటనలో ఆరోపించారు. కేటీఆర్ విచారణకు గవర్నర్ అనుమతిపై స్పందిస్తూ రేవంత్ సర్కార్ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ట అని పేర్కొన్నారు. కాగా, ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య వందో ఏట అడుగుపెట్టిన సందర్భంగా కేటీఆర్, హరీశ్ ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కక్ష సాధింపు రాజకీయాలకు నేను మొదటి బాధితురాలిని..

- ఇప్పుడు కేటీఆర్ వంతు వచ్చింది: కల్వకుంట్ల కవిత



మియాపూర్/రాజేంద్రనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'కక్ష సాధింపు రాజకీయాలకు మొదటి బాధితురాలిని నేను. ఇప్పుడు ఈ కక్షపూరిత రాజకీయాలకు కేటీఆర్ బలవుతున్నారు. అయినా చట్టం, న్యాయం మీద మాకు నమ్మకం ఉంది" అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం ఆమె శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ పీఏ నగర్‌లో జరిగిన జాగృతి జనం బాట కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై కేసులు పెట్టి వేధించడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఫార్ములా-ఈ రేసు కేసులో కేటీఆర్‌ను విచారించడానికి గవర్నర్ అనుమతించిన విషయంపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు స మాధానంగా ఆమె పైవిధంగా స్పందించారు. బీజేపీ వాళ్లకు వాళ్లమీద వీళ్లమీద కేసులు పెట్టటం తప్ప ఇంకో పని లేదని, కాంగ్రెస్ వాళ్లు ఇచ్చిన హామీలు నెరవేర్చటం లేదని విమర్శించారు. ఆ 2 పార్టీలు ప్రజలకు మొఖం చూపలేక ప్రతిపక్ష నేతల మీద కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిస్థితి పైన పటారం, లోన లొటారం అన్నట్లు ఉందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ డివిజన్‌లో పర్యటించిన కవిత మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతిపక్షం నిద్ర పోతోందని, పాలకపక్షం కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర పరువును తీసే విధంగా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని ఆరోపించారు. భూపాల్‌నగర్ కొండలపై పేదలు నిర్మించుకున్న ఇళ్లలోకి వెళ్లిన కవిత వాళ్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ సీనియర్ నేత చలసాని విష్ణుమూర్తి తన అనుచరులతో కలిసి జాగృతిలో చేరారు.



చుక్కా రామయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి పొన్నం

రామయ్య మాస్టారూ...'వంద'నం

- విద్యావేత్త చుక్కా రామయ్యకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ
- రామయ్యను సత్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్యకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం శత వసంత జన్మదినోత్సవం జరుపుకుంటున్న చుక్కా రామయ్య మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. యువత భవితకు బంగారు బాటలు వేసి ఐఐటీ రామయ్యగా పేరు గాంచి, తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన మేధావి చుక్కా రామయ్య అని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు. ఇక, హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఉన్న చుక్కా రామయ్య నివాసానికి వెళ్లిన మంత్రి పొన్నం ప్రభాకర్.. చుక్కా రామయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో చుక్కా రామయ్య శత వసంతాల అభినందన వేడుకను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించేలా ప్రణాళికలు తయారు చేస్తామని పేర్కొన్నారు. మంత్రి పొన్నంతోపాటు ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, హరగోపాల్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, పల్లా రాజేశ్వరరెడ్డి, బాసర సరస్వతీ దేవీ ఆలయ అధికారిణి అంజనీ దేవి తదితరులు చుక్కా రామయ్యను ఆయన ఇంట్లో స్వయంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, వయోభారం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలతో కొన్నాళ్లుగా కదల్లేని పరిస్థితిలో ఉన్న చుక్కా రామయ్య... తనను పరామర్శించడానికి వచ్చిన వారందరినీ గుర్తుపట్టారు. ప్రతి ఒక్కరిని పేరుతో పిలుస్తూ పలకరించారు.

స్కాలర్‌షిప్ బకాయిలు 161 కోట్లను ఇవ్వండి

- ఆర్థిక శాఖ అధికారులకు భట్టి ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన ప్రజాభవన్‌లో ఆర్థిక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 2,813 జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు రూ.161 కోట్ల బకాయిలు ఉన్నట్లు అధికారుల సమీక్షలో నిర్ధారించారు. ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

నేతన్నల రుణమాఫీకి 33 కోట్లు విడుదల: తుమ్మల

హైదరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నేతన్నలకు రుణమాఫీ ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... అందుకోసం రూ.33 కోట్లు విడుదల చేశారని వ్యవసాయ, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సీఎం నేతన్నల సంక్షేమం కోసం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. ప్రజా ప్రభుత్వ నిర్ణయాలతో నేత కార్మికులకు నిరంతర ఉపాధి లభిస్తోందని, అందులో భాగంగా టెస్కోకు రూ.588 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద పంపిణీ చేసే చీరలను సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, హన్మకొండ జిల్లాల్లోని యూనిట్లలో తయారవుతున్నాయని తెలిపారు. అన్ని శాఖలూ అవసరమైన వస్త్రాలను టెస్కో ద్వారా కొనాలని ఉత్తర్వులు జారీ చేశామని గుర్తుచేశారు. ప్రభుత్వం నేత కార్మికుల సంక్షేమం కోసం రూ.168 కోట్లతో చేనేత అభయహస్తం పథకం అమలు చేస్తోందని తుమ్మల వివరించారు.

జెహ ఏరోస్పేస్ రెండో యూనిట్ ప్రారంభం

- రాష్ట్రంలో 445 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటన

హైదరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విమానయానం, రక్షణ రంగంలో ఎదుగుతున్న స్టార్టప్ జెహ ఏరోస్పేస్.. తెలంగాణలో రెండో తయారీ యూనిట్‌ను గురువారం ప్రారంభించింది. వచ్చే 6-12 నెలల్లో రాష్ట్రంలో రూ.445 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ ప్రకటించింది. హైదరాబాద్ సమీపంలోని హారిజన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏర్పాటైన కొత్త యూనిట్ దాదాపు 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఆధునిక ఆటోమేషతో డిజిటల్ సప్లయ్ చైన్ సామర్థ్యాలను పెంచే విధంగా 'సాఫ్ట్‌వేర్ ఆధారిత స్మార్ట్ ఫ్యాక్టరీ'గా ఈ యూనిట్‌ను రూపకల్పన చేసినట్లు కంపెనీ తెలిపింది. జెహ ఏరోస్పేస్ గతేడాది జనవరిలో హైదరాబాద్‌లో మొదటి యూనిట్‌ను ప్రారంభించింది. కొత్త యూనిట్ ప్రారంభంతో నగరంలో సంస్థ కార్యకలాపాల విస్తీర్ణం 2.5 లక్షల చదరపు అడుగులకు చేరిందని కంపెనీ తెలిపింది.

అన్నింట్లో జోక్యం చేసుకోకుండా నిషేధం విధిస్తాం

- హైడ్రాకు హైకోర్టు హెచ్చరిక

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెప్పినా వినకుండా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే జలవనరులు, నాలాల పరిరక్షణ మినహా ఇతర కార్యకలాపాల్లో హైడ్రా జోక్యం చేసుకోకుండా నిషేధం విధించాల్సి ఉంటుందని హైకోర్టు హెచ్చరించింది. వివాదాస్పద స్థలంలోకి 15 రోజులపాటు వెళ్లకూడదంటూ హైడ్రా, సంధ్యా గ్రూప్‌లను నిషేధించింది. వ్యక్తిగత ప్లాట్ యజమానులు మాత్రం ఎఫ్‌సీఐ లేఅవుట్‌లోని వారి ప్లాట్లలోకి వెళ్లవచ్చని పేర్కొంది. గచ్చిబౌలిలోని ఎఫ్‌సీఐ లేఅవుట్‌లోని సంధ్య కన్వెన్షన్ నిర్మాణాలపై తలెత్తిన వివాదంపై హైకోర్టు విచారణ జరిపింది. కోర్టు ఉత్తర్వులు పట్టించుకోకుండా తమ భవనాలు కూల్చేశారని సంధ్య హోటల్స్ సంస్థ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం గురువారం విచారణ కొనసాగించింది. హైడ్రా తరపున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. నోటీసులు జారీ చేసినా సంధ్యా యజమాన్యం నుంచి స్పందన లేకపోవడంతో చట్టప్రకారమే కూల్చివేతలు చేపట్టినట్టు తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. 'ఆక్రమణకు గురైన రోడ్లు, ప్లాట్ల వివరాలను నోటీసుల్లో స్పష్టంగా ప్రస్తావించకుండా ఉదయమే ఎందుకు కూల్చివేయాల్సి వచ్చింది? ఎంతమేరకు ఆక్రమణలు జరిగాయో కనీసం నిర్ధారించారా? ఒక వ్యక్తి లేదా అధికారికి అపరిమిత అధికారాలు కట్టబెడితే.. ప్రభుత్వం కూడా నియంత్రించలేని రోజు వస్తుంది. హైడ్రాను నియంత్రించే విధంగా చట్టాల్లో స్పష్టత లేదు. హైడ్రాకు ఉన్న అధికార పరిధి ఏమిటి? హైడ్రా ఏదైనా స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని అనుసరిస్తోందా? జీహెచ్ఎంసీ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా హైడ్రా వ్యవహరిస్తోందా? ఈ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంద'ని వ్యాఖ్యానించింది. ఎఫ్‌సీఐ లేఅవుట్ కాపీని సమర్పించాలని పేర్కొంటూ తదుపరి విచారణ 24కు వాయిదా వేసింది.

కేటీఆర్, గోరేటి వెంకన్నలపై కేసు కొట్టివేత

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళికి విరుద్ధంగా సచివాలయం ఎదురుగా ఉన్న తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద డ్రోన్ కెమెరాను వినియోగించినందుకు మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్నపై నమోదైన కేసును హైకోర్టు గురువారం కొట్టేసింది. ఎఫ్ఐఆర్ నమోదులో విధానపరమైన లోపం ఉందని, సీఆర్పీసీ సెక్షన్ 195 ప్రొసీజర్‌ను అనుసరించలేదంటూ కేసును కొట్టేసింది.

బండి సంజయ్‌పై పేపర్ లీకేజీ కేసు కొట్టివేత

పదోతరగతి హిందీ పరీక్ష పేపర్ లీకేజీపై కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. సంజయ్ తరఫున న్యాయవాది వాదిస్తూ.. తెలంగాణ స్టేట్ పబ్లిక్ ఎగ్జామినేషన్ ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీసెస్ యాక్ట్ పిటిషనర్‌కు వర్తించదని పేర్కొన్నారు.

ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా హైదరాబాద్!

- రాష్ట్ర రాజధానిలో 8 వారాల పాటు పైలట్ ప్రాజెక్టు
- ట్రాఫిక్, ప్రజాభద్రత, అత్యవసర సేవలకు ఏఐ ఆధారిత అంచనాలు
- సీఎం రేవంత్ రెడ్డితో ఎనలాగ్ ఏఐ సీఈవో కిప్‌మన్ భేటీ



సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన ఎనలాగ్ ఏఐ సీఈవో కిప్‌మన్

హైదరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత నివాస యోగ్యమైన నగరంగా తీర్చిదిద్దేందుకురాష్ట్ర ప్రభుత్వం వీలైనంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎనలాగ్ ఏఐ సంస్థ సీఈవో అలెక్స్ కిప్‌మన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం స్వయంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. మూసీ నది పునరుజ్జీవం, తెలంగాణ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ ప్రాజెక్టుల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. అయితే, ట్రాఫిక్, పట్టణ ప్రాంతాల్లో వరద (అర్బన్ ఫ్లడింగ్), సరస్సుల రక్షణ, వాతావరణ అంచనా, పరిశ్రమల కాలుష్య నియంత్రణ అంశాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ఆధారంగా రియల్ టైమ్ సెన్సార్ నెట్‌వర్క్, స్మార్ట్ సిటీ నిర్వహణ పద్ధతులను అమలు చేసే వీలుందని కిప్‌మన్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. దీంతో హైదరాబాద్‌లో ఫిజికల్ ఇంటెలిజెన్స్ పైలెట్ ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయించారు. ఎనిమిది వారాల పాటు ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టు అమలవుతుంది. ఇందులో భాగంగా సీసీ కెమెరాల వ్యవస్థను రియల్ టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌గా మారుస్తారు. ట్రాఫిక్, ప్రజా భద్రత, అత్యవసర సేవలన్నీ ఏఐ ఆధారిత అంచనాలతో ఒకేచోట సమన్వయం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. ఆయా అంచనాల ఆధారంగా.. సమస్యలు, వాటికి కారణాలు, పరిష్కారాలను ఫిజికల్ ఇంటెలిజెన్స్ సూచిస్తుంది. ఈ ప్రయోగాత్మక కార్యక్రమం పూర్తయ్యే నాటికి హైదరాబాద్ దేశంలోనే తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా మారుతుందనే అంచనాలున్నాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. భారత్ ఫ్యూచర్ సిటీని పరిశోధన, సుస్థిర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను కిప్‌మన్‌కు వివరించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని అలెక్స్ కిప్‌మన్‌ను సీఎం ఈ సందర్భంగా ఆహ్వానించారు.

ఈశాన్య రాష్ట్రాలకు తెలంగాణ మరో ఇల్లు

అక్కడి ప్రజలు హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో ఉన్నారు

- ఫ్యూచర్ సిటీలో 'నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రానికి' భూ కేటాయింపు
- తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్ టెక్నో-కల్చరల్ ఫెస్టివల్‌లో సీఎం రేవంత్



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాలకు, తెలంగాణ మరో ఇల్లులాంటిద ని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారని.. ఔషధ, ఆరోగ్య, పర్యాటక, సాఫ్ట్‌వేర్ క్రీడలు తదితర రంగాల్లో వారు సక్సెస్ సాధించారని చెప్పారు. తెలంగాణ సమాజంతో కలిసిపోయి, ఇక్కడ అభివృద్ధికి తోడ్పడుతున్నారంటూ ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ప్రజలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు 1970, 1980ల్లో ఉత్తరాది వారు మన దక్షిణాది వాళ్లందరినీ 'మదరాసీలు' అని పిలిచేవారని, తెలుగువారికంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండేది కాదని. అలాగే ఈశాన్య రాష్ట్రాల పౌరులకూ ప్రాంతీయ గుర్తింపు లేదని, వారి బాధను తెలుగు ప్రజలు అర్థం చేసుకోగలరని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్' టెక్నో-కల్చరల్ ఫెస్టివల్‌లో రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ ఉత్సవం తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల మధ్య గల ఐక్యతా స్ఫూర్తిని చాటుతోందని పేర్కొన్నారు. మనదేశంలో ఈశాన్య ప్రాంతం ఎంతో అందమైనదని, విభిన్నమైనదని, పర్యావరణ సంపదతో పాటు సాంస్కృతిక చైతన్యం కలిగిన ప్రాంతమని కొనియాడారు. ఇప్పటికీ ఈశాన్య రాష్ట్రాల్లో వెలుగులోకి రాని అంశాలు చాలా ఉన్నాయన్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలను, వారి సంస్కృతిని దక్షిణాదివారిగా మనం మరింత బాగా అర్థం చేసుకోవాలని, వారితో కనెక్టివిటీ పెంచుకోవాలని అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో, భారతదేశపు మొట్టమొదటి 'నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రాన్ని' నిర్మించడానికి భూమి కేటాయిస్తామని సీఎం ప్రకటించారు. ఈ అనుబంధ కేంద్రంలో ప్రతి ఈశాన్య రాష్ట్రం వారి సొంత భవనాలను నిర్మించుకోవడానికి వెసులుబాటు కల్పిస్తామన్నారు. అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు వారి వారి ప్రత్యేక భవనంతో పాటు హాస్టల్ సౌకర్యం, ఆహారం, చేతివృత్తులు, సంస్కృతులు, కళల ప్రదర్శనకు వేదికలు ఉంటాయన్నారు. "తెలంగాణ సోదరుడు త్రిపుర గవర్నర్‌గా పనిచేస్తుంటే.. త్రిపుర సోదరుడు తెలంగాణ గవర్నర్‌గా పనిచేస్తున్నారని.. త్రిపుర, తెలంగాణ మధ్య ఈ అనుబంధం ఇలాగే కొనసాగాలి" అని ఆకాంక్షించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. ఈ ఉత్సవాన్ని జ్ఞానం, విజ్ఞానంతో ముందుకెళ్లాలనే తలంపుతో ప్రారంభించినట్లు చెప్పారు. ఉత్సవ లోగోలో కూడా పుష్పం చుట్టూ ఉండే 9 రేకులలో 8 ఈశాన్య రాష్ట్రాలను సూచిస్తే.. 9వది తెలంగాణను సూచిస్తోందని పేర్కొన్నారు. త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో ఉండే ప్రాంతాలను వెనకబడిన ప్రాంతాలుగా చెప్పేవారని.. ఆ ప్రాంతాల్లో ఉండేవారు తామంతా వేరే దేశస్థులమని భావించేవారని, ఇప్పుడు పరిస్థితి మారిందని.. భారత భూభాగమంతా తమదేశం, తమ ప్రాంతంగా అక్కడి ప్రజలు భావిస్తున్నారని వివరించారు. రానున్న రోజులలో త్రిపుర ఈశాన్య ప్రాంతాలకే కాకుండా.. ఈశాన్య ఆసియా దేశాలకు కూడా గేట్‌వేగా మారనుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి, పొంగులేటి, పొన్నం, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు. డీజీపీ శివధర్‌రెడ్డి, ఈశాన్య ప్రాంతాల ప్రముఖులు పాల్గొన్నారు.

నిబంధన సరే.. బస్సుల్లో బెల్టులేవీ?

- 50 శాతం బస్సుల్లో అవి లేనేలేవు.. అమలు సాధ్యమేనా?
- యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దాదాపు సగానికిపైగా ఆర్టీసీ బస్సుల్లో సీటు బెల్టులు లేకున్నా.. వాటిని తప్పనిసరిగా ధరించాలనే నిబంధన విధించిన యాజమాన్య వైఖరి పట్ల డ్రైవర్లు పెదవి విరుస్తున్నారు. బస్సుల్లో లేని బెల్టును ఎలా ధరించాలని వారు ప్రశ్నిస్తున్నారు. డ్రైవర్లు తప్పని సరిగా సీటు బెల్టు ధరించాలని సంస్థ ఎండీ ఇదివరకు ఆదేశాలు జారీ చేశారు. మోటారు వాహన చట్టం ప్రకారం వాహనం నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించడం తప్పనిసరి. అలా చేయని వారిని ఉల్లంఘనులుగా గుర్తించి జరిమానా విధిస్తారు. అయితే, జిల్లా బస్సులు మొదలు హైదరాబాద్ సిటీ బస్సుల్లో సగానికి పైగా అసలు సీటు బెల్టులే లేవు. ఈ తరుణంలో.. ప్రమాదాల నివారణ, జాగ్రత్తల పేరుతో యాజమాన్యం జారీచేసిన ఆదేశాలు అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అధికారుల ఆదేశాలు తమకు ఉపయోగకరంగానే ఉంటున్నా... అసలు అవి అమలుకు సాధ్యమవుతాయా లేదా అనే విషయాన్ని వారు గుర్తించాలని డ్రైవర్లు చెబుతున్నారు. మరోవైపు ఆర్టీసీ డ్రైవర్లు సెల్‌ఫోన్ వాడకంపైనా సంస్థ నిషేధం విధించింది. విధి నిర్వహణలో ఉన్న సమయంలో డ్రైవర్ సెల్‌ఫోన్ ఉపయోగించరాదు. రోజూ డ్యూటీ ఎక్కే ముందు డ్రైవర్ సెల్‌ఫోన్‌ను డిపోలో అధికారుల వద్ద భద్రపరిచి వెళ్లాలనే నిబంధన ఉంది. కానీ చాలా వరకు ఇది అమలు కావడం లేదు. కొన్ని డిపోల్లో అధికారులు బలవంతంగా అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తే డ్రైవర్ల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కొన్ని చోట్ల ఏకంగా అధికారుల తీరును నిరసిస్తూ డ్రైవర్లు ఆందోళనకు దిగుతున్నారు. రెండు రోజుల క్రితం జగిత్యాల డిపో వద్ద డ్రైవర్లు సెల్‌ఫోన్‌లతో విధులకు వెళ్లవద్దని అధికారులు చెప్పడంతో విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. 'సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం. అలాగని మొత్తానికే అనుమతించకపోవడం సరికాదు. అత్యవసర పరిస్థితుల్లో సెల్‌ఫోన్ లేకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. డ్రైవర్ ఫోన్ కండక్టర్ వద్ద ఉంచి అవసరమైతే బస్సు నిలిపిన సమయంలో మాట్లాడుకునేందుకు అవకాశం కల్పించాలి' అని డ్రైవర్లు కోరుతున్నారు.

కార్మికులపై దాడిచేస్తే కఠిన చర్యలు: ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి

ఆర్టీసీ కార్మికులపై దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని సంస్థ ఎండీ వై. నాగిరెడ్డి హెచ్చరించారు. విధినిర్వహణలో ఉన్న డ్రైవర్, కండక్టర్లపై దాడులకు పాల్పడుతుండటం సహించరాని చర్య అన్నారు. వారిపై దాడులు చేస్తే చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సంస్థ పరంగా కార్మికులకు పూర్తి భద్రత, భరోసా ఉంటుందని నాగిరెడ్డి హామీ ఇచ్చారు.

డెడికేటెడ్ కమిషన్ నివేదికకు ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

కోరిన మేరకు.. బూసాని వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ గురువారం తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. దీనికి మళ్లీ మంత్రి వర్గ ఆమోదం అవసరం. అయితే మళ్లీ మంత్రివర్గ సమావేశం ఈ నెల 25న ఉంది. కానీ.. అప్పటిదాకా కూడా ఆగకుండా.. వెంటనే మంత్రులందరికీ ఆ నివేదికను పంపి సంతకాలు సేకరించి ఆమోదముద్ర తీసేసుకుంది. సాధ్యమైనంత త్వరగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలనే ఉద్దేశమే దీనికి కారణం. గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్ల బకాయిలు త్వరగా వచ్చేలా చేసేందుకే ప్రభుత్వం ఇలా వేగంగా అడుగులు వేస్తోందని అంటున్నారు. ఆర్థిక సంఘం కాలపరిమితి మార్చి వరకూ ఉన్నా.. ఇప్పుడు ఎన్నికలు పూర్తయి, కొత్త పాలకవర్గాలు కొలువుదీరి, కేంద్రానికి పెండింగ్ నిధుల విడుదల కోసం లేఖలు రాసి, అవి వచ్చేసరికి సమయం పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే వీలైనంత తొందరగా ఎన్నికలకు వెళ్లనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకోసం డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం శుక్ర, శనివారాల్లోనే రిజర్వేషన్ల విధివిధానాలపై మార్గదర్శకాలతో ఉత్తర్వులను జారీచేయనుంది. వాటి ఆధారంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ విభాగాలు జిల్లాల జనాభాకు, ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్లను ఖరారు చేయనున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయిన వెంటనే ఈ ప్రక్రియను రెండురోజుల్లోనే పూర్తిచేసేందుకు సంబంధిత విభాగాలు సమాయత్తమవుతున్నాయి. సర్కారు వేగానికి దీటుగా.. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ మొదలు పెట్టింది. అందులో భాగంగా ఇప్పటికే ఓటరు జాబితా సవరణపై దృష్టి పెట్టిన ఎస్ఈసీ.. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో పాటు జిల్లాలవారీగా కలెక్టర్లు, డీపీవోలతో గురువారం వీడియోకాన్ఫరెన్సు(వీసీ) నిర్వహించింది. జిల్లాలవారీగా ఎన్నికల సంసిద్ధతను ఎస్ఈసీ రాణి కుముదిని ఈ సందర్భంగా సమీక్షించారు. తుది ఓటరు జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది, పోలింగ్ సామగ్రి, శాంతిభద్రతలు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, మోడల్ కోడ్ కమిటీ, ఎన్నికల నిర్వహణకు మార్గదర్శకాల రూపకల్పన వంటి అంశాలపై సమీక్షించారు. కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్రస్థాయి రివ్యూ కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

మూడుదశల్లో ఎన్నికల నిర్వహణ: డీజీపీ

ఎన్నికల నిర్వహణలో గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని స్థానిక సంస్థల ఎన్నికలను మూడుదశల్లో నిర్వహించాలని డీజీపీ శివధర్‌రెడ్డి ప్రతిపాదించారు. ఒకచోట ఎన్నికలు పూర్తయ్యాక మరోచోట ఎన్నికల నిర్వహణకు రెండు రోజుల విరామం ఉండాలని పేర్కొన్నారు. దీనివల్ల పోలింగ్ సిబ్బందికి, భద్రతా బలగాలకు తగిన సమయం లభిస్తుందని, బందోబస్తు నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టగలరని ఆయన పేర్కొన్నారు.

ఆహార భద్రత పథకం ప్రపంచానికే ఆదర్శం

- సరైన రికార్డులు అందజేస్తే 'సీఎంఆర్ డెలివరీ' సొమ్ము 1400 కోట్లు ఇస్తాం
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- నల్లగొండలో ఎఫ్‌సీఐ ఆఫీసు ప్రారంభం
- అదనపు రైల్వే ర్యాక్‌లు ఇవ్వండి: ఉత్తమ్
- బత్తాయి రైతులను ఆదుకోండి: కోమటిరెడ్డి



నల్లగొండలో ఎఫ్‌సీఐ డివిజన్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రం అమలు చేస్తున్న ఆహార భద్రత పథకం ప్రపంచానికే ఆదర్శమని కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ఆర్థిక వేదిక వంటి అంతర్జాతీయ సంస్థలు ఈ విషయాన్ని వెల్లడించాయన్నారు. దేశంలో 80 కోట్ల మంది పేదలకు ప్రతి నెలా ఐదు కిలోల చొప్పున ఉచితంగా బియ్యాన్ని అందిస్తున్న సర్కారు తమదేనన్నారు. నల్లగొండలోని ఎఫ్‌సీఐ కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మించిన డివిజన్ కార్యాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని, పన్నెండేళ్ల తమ ప్రభుత్వ హయాంలో దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచామన్నారు. తెలంగాణ నుంచి కేంద్రం సేకరించే ధాన్యం పదేళ్లలో 600 శాతం పెరిగిందని చెప్పారు. ఆహార భద్రత పథకం కింద తెలంగాణకు ప్రతీ నెలా 1.11 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను కేంద్రం అందిస్తోందని తెలిపారు. రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తిపై ప్రహ్లాద్ జోషి స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సరైన రికార్డులు సమర్పిస్తే సీఎంఆర్ డెలివరీకి సంబంధించి పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.1400 కోట్లను మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి కొవిడ్ సమయంలో పెండింగ్ ఉన్న రూ.343 కోట్ల సబ్సిడీని కూడా విడుదల చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్రం రాష్ట్రానికి అదనపు రైల్వే ర్యాక్‌లు కేటాయిస్తే బియ్యం తరలింపు సులభమవుతుందని ఉత్తమ్ తెలిపారు. 2024-25కు బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని పెంచాలని కోరారు. నల్లగొండలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో అదనపు గోదాములు నిర్మించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరగా.. ప్రహ్లాద్ జోషి స్పందిస్తూ ప్రస్తుతం ఇక్కడ 62 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు ఉన్నాయని, వాటిని లక్ష మెట్రిక్ టన్నులకు పెంచేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. అదనపు గోదాముల విషయంలో భూసేకరణ చేసి ప్రతిపాదనలు పంపితే పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' (ఓడీవోపీ) పథకంలో నల్లగొండ జిల్లా నుంచి బత్తాయి పంటను చేర్చి రైతులను ఆదుకోవాలని కూడా కోమటిరెడ్డి కోరారు.

రాష్ట్రంలో అర్బన్ నక్సల్స్ జల్సాలు

- ప్రభుత్వంలో ఏం నచ్చిందని భాగస్వాములయ్యారు
- నామినేటెడ్ పదవులతో రూ.కోట్లు దండుకుంటున్నారు: సంజయ్



హైదరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్బన్ నక్సల్స్ నగరాల్లో ఉంటూ జల్సాలు చేస్తున్నారని, నామినేటెడ్ పదవులు దక్కించుకుని పైరవీలు చేసుకుంటూ రూ.కోట్లు దండుకుంటున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నిప్పులు చెరిగారు. పేదల కోసమే పోరాటాలు చేస్తామని ప్రకటించుకునే వారు, ఏం నచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో భాగస్వాములయ్యారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు ఏ హామీని అమలు చేసిందని నిలదీశారు. ఏమాత్రం నైతికత ఉన్నా వారు పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంజయ్ మీడియాతో మాట్లాడారు. అమాయక పిల్లలను పాటలు, మాటల ద్వారా రెచ్చగొట్టి.. తుపాకీ పట్టించడం ఏం సిద్ధాంతమని నిలదీశారు. తుపాకీ పట్టుకుని పది రోజులు అడవిలో తిరిగితే ఎలా ఉంటుందో అర్బన్ నక్సల్స్‌కు తెలుస్తుందని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు ప్రభుత్వం ఇచ్చే రివార్డుతో నిజాయితీగా ఉంటున్నారని..అర్బన్ నక్సల్స్ మాత్రం రూ.కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఏమైనా అంటే సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మీటింగ్‌లు పెట్టి, ఇందిరా పార్కు వద్ద ధర్నా చేస్తారని విమర్శించారు.

కేటీఆర్ విచారణపై సీఎం స్పందించాలి..

ఈ-కార్ రేస్ కేసులో కేటీఆర్ విచారణకు గవర్నర్ అనుమతిచ్చిన నేపథ్యంలో.. సీఎం రేవంత్ స్పందించాలని సంజయ్ అన్నారు. కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపిస్తానని, అవినీతి సొమ్మును కక్కిస్తానని సీఎం రేవంత్ గతంలో ప్రకటించారని గుర్తుచేశారు. జైలుకు పంపడం సంగతేమోగానీ, కనీసం వారిని టచ్ కూడా చేయలేదని ఎద్దేవా చేశారు.

ఈటలతో విభేదాలు లేవు..

ఎంపీ ఈటల రాజేందర్‌కు, తనకు మధ్య విభేదాలు లేవని సంజయ్ స్పష్టం చేశారు. బీజేపీ ఏ మతానికీ వ్యతిరేకం కాదని, ఏనాడూ ముస్లింలను కించపరచలేదని తెలిపారు. కాగా, దర్శకుడు రాజమౌళి వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఆయన దేవుడిని నమ్మేవిధంగా దేవుడి కరుణ ఉండాలని కోరుకుంటున్నా" అని అన్నారు.

దేశమంతా.. సన్నబియ్యం

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. గురువారం ఉదయం హైదరాబాద్‌కు వచ్చిన ప్రహ్లాద్ జోషితో ముఖ్యమంత్రి తాజ్ హోటల్‌లో భేటీ అయ్యారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ఇలా ప్రజలు తినే బియ్యాన్ని పంపిణీ చేయడం వల్ల పథకం లక్ష్యం నెరవేరిందని.. పీడీఎస్ బియ్యం రీ సైక్లింగ్ తగ్గిందని, బహిరంగ మార్కెట్లోనూ ధరలు స్థిరపడ్డాయని చెప్పారు. దీనిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌కు ప్రహ్లాద్ జోషి చెప్పారు. కాగా.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగిన సహకారం అందించాలని కోరుతూ సీఎం రేవంత్ ఈ భేటీలో పలు అంశాలను ప్రస్తావించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 10లక్షల టన్నుల బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని కోరారు. పీడీఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించి రూ.1,468 కోట్ల సబ్సిడీని విడుదల చేయాలన్నారు. పీఎంజీకేఏవై అయిదో దశకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.343.27 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల చేయాలని కోరారు. 2025-26 ఖరీఫ్‌లో అత్యధికంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులన్నీ సానుకూలంగా పరిశీలిస్తామని ప్రహ్లాద్ జోషి హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్ వినియోగం తగ్గిందని, మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఎగుమతి అవకాశాలను పరిశీలించాలని సలహా ఇచ్చారు.

రాష్ట్రపతి నిలయంలో కళా మహోత్సవ్

» నేడు ప్రారంభించనున్న రాష్ట్రపతి ముర్ము

అల్వాల్, బేగంపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర ప్రజలకు పశ్చిమ రాష్ట్రాల కళ, సంస్కృతి, సంప్రదాయాలను చూసే అవకాశం లభించనుంది. గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, దాద్రా నగర్ హవేలి, డామన్ డయ్యూల సంస్కృతి, ప్రజల ఆహార అలవాట్లను తెలుసుకోవడానికి అవకాశం కలగనుంది. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, జౌళి మంత్రిత్వ శాఖల సహకారంతో బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఈ నెల 22 నుంచి 30 వరకు నిర్వహించనున్న రెండవ భారతీయ కళా మహోత్సవాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేడు ప్రారంభిస్తారు. ప్రదర్శనలో భాగంగా హస్తకళలు, చేనేత ఇతర ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. గుజరాత్‌కు చెందిన కచ్ బందాని, రాజస్థాన్ నుంచి కోట డోరియా చీరలు, మహారాష్ట్ర నుంచి కొల్హాపురి చెప్పులు, పైథాని చీరలు, గోవా నుంచి కుంబి చీరల ప్రదర్శనలతో పాటు విక్రయాలు నిర్వహిస్తారు. ఆయా రాష్ట్రాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. రాజస్థాన్, గుజరాత్, గోవా, మహారాష్ట్రల ప్రత్యేక వంటకాలు కూడా ఫుడ్ కోర్ట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటాయి. పుస్తక ప్రదర్శన సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలతో ప్రత్యేక సెషన్‌లను కూడా నిర్వహిస్తారు.

అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలకు జీహెచ్ఎంసీ నోటీసులు

» తక్కువ విస్తీర్ణం చూపి వ్యాపార లైసెన్సులు పొందినందుకే

ఖైరతాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్నపూర్ణ, రామానాయుడు సినీ స్టూడియోలకు జీహెచ్ఎంసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వినియోగిస్తున్న స్థలం కంటే తక్కువ స్థలం చూపుతూ వ్యాపార లైసెన్సు పొందారంటూ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ జూబ్లీహిల్స్ సర్కిల్(18) అధికారులు ఈ నోటీసులు ఇచ్చారు. ఇదే విషయమై గత జూలైలో నోటీసులిచ్చినా స్పందించకపోవడంతో తాజాగా మరోసారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 2లోని అన్నపూర్ణ స్టూడియో 1,92,066 చదరపు అడుగుల్లో ఉండగా 8 వేల చదరపు అడుగులకు మాత్రమే వ్యాపార లైసెన్సులు పొందారు. విస్తీర్ణాన్ని బట్టి ఈ స్టూడియో రూ.11.52 లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.49,032 చెల్లిస్తున్నట్లు సమాచారం. ఫిలింనగర్‌లోని రామానాయుడు స్టూడియో (సురేష్ ప్రొడక్షన్స్ పేరుతో ఉంది) 68,276 చదరపు అడుగుల్లో ఉండగా 1700 చదరపు అడుగుల విస్తీర్ణానికి మాత్రమే వ్యాపార లైసెన్సు ఫీజు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ.2,73,104 చెల్లించాల్సిఉండగా.. రూ.7,614 కడుతున్నట్లు సమాచారం.

ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారికి సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు జాతీయ అవార్డును అందుకున్న సందర్భంగా బోర్డులో ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి సత్యనారాయణను ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్‌లు సత్కరించారు. గురువారం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఔటర్ పరిధిలో ఇంకుడు గుంతల నిర్మాణంలో సత్యనారాయణ క్రియాశీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి తెలిపారు. కాగా వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిని గురువారం టీజీవో హైదరాబాద్ జిల్లా నాయకులు, కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా జాతీయ అవార్డును అందుకున్న నేపథ్యంలో ఎండీకి అభినందనలు తెలిపారు.

బంజారాలను ఎస్సీ, ఎస్టీలుగా గుర్తించాలి

» ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బంజారా భారత్ ధర్నా

న్యూఢిల్లీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాల్లో బీసీలుగా ఉన్న బంజారాలను ఎస్సీ లేదా ఎస్టీలుగా గుర్తించాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బంజారా భారత్ వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న బంజారా తండాలను గ్రామపంచాయతీలుగా చేయాలని డిమాండ్ చేశారు. బంజారా భాషను 8 షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గతంలో బంజారా తండా ఉన్న ప్రస్తుత పార్లమెంట్ ప్రాంగణంలో లక్కీషా, మక్కాన్ షా విగ్రహాలను నెలకొల్పాలని రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు.

డిసెంబరు 12 నుంచి ఆటా వేడుకలు

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో డిసెంబరు 12 నుంచి ఆటా వేడుకలు నిర్వహిస్తామని అమెరికా తెలుగు అసోసియేషన్(ఆటా) అధ్యక్షుడు జయంత్ చల్ల, వేడుకల కమిటీ చైర్మన్ సతీశ్‌రెడ్డి తెలిపారు. డిసెంబరు 12 నుంచి 27 వరకు ఈ వేడుకలు కొనసాగుతాయని చెప్పారు. డిసెంబర్ 12న రంగారెడ్డి జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ప్రారంభించి, అదేరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న ముగింపు వేడుకల్లో భాగంగా రవీంద్రభారతిలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆటా పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు ఆటా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని వేడుకల కమిటీ చైర్మన్ సతీశ్‌రెడ్డి తెలిపారు.

7 జిల్లాల్లో గ్రామ సురక్ష పథకం: డీజీపీ

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను నివారించడానికి ప్రయోగాత్మకంగా 7 జిల్లాల్లో గ్రామ సురక్ష పథకం(సేఫ్ విలేజ్ ప్రాజెక్టు) ప్రారంభిస్తున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో నేరాలపై జిల్లాల ఎస్పీలు, వివిధ కమిషనరేట్ల కమిషనర్లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తూ పై సంగతి తెలిపారు. తీవ్ర నేరాలు, ఆర్థిక నేరాలు, బాలల నేరాలపై సుదీర్ఘంగా జరిగిన చర్చలో డీజీపీ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సేఫ్ విలేజ్ ప్రాజెక్టుపై తొలి దశలో మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, భద్రాద్రి-కొత్తగూడెం, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. పొరుగు రాష్ట్రాల సరిహద్దులు గల జిల్లాల ఎస్పీలు.. ఆయా రాష్ట్రాల పోలీసు అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకుని అంతరాష్ట్ర నేరాలు జరుగకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని డీజీపీ తెలిపారు.

ఆగని నకిలీ ఓఆర్ఎస్ అమ్మకాలు..

» ఎఫ్ఎస్ఎస్ఏఐ సీరియస్.. చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్రాలకు ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్) పేరు వాడుకుంటూ జనాన్ని మోసం చేస్తున్న కంపెనీలపై భారత ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆగ్రహం వ్యక్తం చేసింది. పండ్ల రసాలు, ఎనర్జీ డ్రింక్స్, రెడీ-టు-సర్వ్ డ్రింక్స్‌కు ఓఆర్ఎస్ అని పేరు పెట్టి అమ్మితే సహించేది లేదని మరోసారి హెచ్చరించింది. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఇలాంటి ఉత్పత్తులన్నింటినీ తక్షణం షాపులు, మాల్స్, ఆన్‌లైన్ స్టోర్ల నుంచి తొలగించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబరులోనే చెప్పినప్పటికీ అమ్మకాలు ఆగకపోవడంతో రాష్ట్రాల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు వెంటనే రంగంలోకి దిగాలని సూచించింది. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్ఎస్ పేరుతో శీతల పానీయాలు, పండ్ల రసాలు కనిపిస్తే వాటిని వెంటనే సీజ్ చేయాలని, సదరు కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

హైదరాబాద్‌లోనూ రప్పా రప్పా

(మొదటిపేజీ తరువాయి)



బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న వైసీపీ శ్రేణులను అదుపు చేస్తున్న పోలీసులు

కలిగించారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో గురువారం ఉదయం 11 గంటలకు జగన్ బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయన వెంట మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పేర్నినాని, విడదల రజని ఉన్నారు. విమానాశ్రయం వెలుపలకు రాగానే అప్పటికే అక్కడకు చేరుకున్న జగన్ అభిమానులు ఆయనకు మద్దతుగా నినాదాలు చేశారు. ఒకదశలో పోలీసులను నెట్టుకుంటూ జగన్‌ను కలిసేందుకు కొందరు ప్రయత్నించారు. మరోవైపు.. అభిమానులకు అభివాదం చేస్తూ కారులో నాంపల్లి కోర్టుకు బయలుదేరారు. నాంపల్లి సీబీఐ కోర్టుకు వెళ్లే మార్గంలో ఎక్కడి చూసినా వైసీపీ నాయకులు, కార్యకర్తలు గుంపులు గుంపులుగా వచ్చి రోడ్లపై హడావుడి చేశారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం నాంపల్లి, బజార్‌ఘాట్, రెడ్‌హిల్స్ ప్రాంతాల్లో హంగామా సృష్టించారు. వైఎస్ జగన్ ఫొటోలతో కూడిన ప్లకార్డులను పట్టుకొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రోడ్లమీద వెళ్లే సామాన్యులను సైతం ఇబ్బందులకు గురి చేశారు. బజార్‌ఘాట్ మీదుగా కోర్టు వైపు జగన్ వెళుతున్న సమయంలో పోలీసులను తోసుకుంటూ పార్టీ శ్రేణులు వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే.. భారీగా మోహరించిన పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి, జగన్ ఉన్న ఒక కారుతో పాటు మరో కారును మాత్రమే వెళ్లేందుకు అనుమతించారు. అలా జగన్.. 11.37 గంటలకు నాంపల్లి కోర్టుకు చేరుకున్నారు. నాంపల్లి కోర్టులోని మొదటి గేటు నుంచి సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. కోర్టులో విచారణ సుమారు అరగంటకు పైగా జరిగింది. 12.10 గంటలకు రెండో గేటు నుంచి పోలీసులు జగన్ కాన్వాయ్‌ను బయటకు పంపించారు. జగన్ పర్యటన సందర్భంగా బజార్‌ఘాట్ వైపు నుంచి నాంపల్లి సీబీఐ కోర్టుకు వెళ్లే మార్గంలో స్థానికులు, వ్యాపార సంస్థల నిర్వాహకులను పోలీసులు అడ్డుకున్నారు. గుర్తింపు కార్డులు చూపిస్తేనే లోపలికి పంపించారు.

కోర్టు బయట గందరగోళం

జగన్ నాంపల్లి కోర్టుకు వస్తున్న సమయంలో పార్టీ శ్రేణులు 'రప్పా రప్పా' ప్లకార్డులు ప్రదర్శించారు. 2029లో కాబోయే సీఎం జగన్, జై జగన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆయన కాన్వాయ్ వైపు దూసుకువచ్చే ప్రయత్నం చేశారు. వైసీపీ శ్రేణులను పోలీసులు లాగేయడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నాంపల్లి పరిసర ప్రాంతాల్లో సుమారు అర కిలోమీటరు వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వైసీపీ శ్రేణులు అతి చేయడంపై పలువురు వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒక దశలో ఏసీపీ ప్రవీణ్‌పైకి కార్యకర్తలు దూసుకొచ్చే ప్రయ త్నం చేశారు. పోలీసులను వెనక్కినెట్టే ప్రయత్నం చేయగా, వారు గట్టిగా అడ్డుకుని నిలువరించారు. జగన్ కోర్టు హాల్‌ను వీడుతున్న సందర్భంగా కూడా విపరీతమైన తోపులాట జరిగింది. ఆయన కోర్టు హాల్‌ను వీడి కారిడార్లలో ప్రవేశించగానే ఒక్కసారిగా జనం మీదపడ్డారు. తోపులాటలో కొంతమంది న్యాయవాదులు కిందపడిపోయారు. మధ్యాహ్నం 1:15 గంటలకు జగన్.. లోటస్‌పాండ్‌లోని నివాసానికి వచ్చారు. పార్టీకి చెందిన పలువురు నాయకులతో ఇంట్లో చర్చలు జరిపారు. 2గంటల తర్వాత బేగంపేట ఎయిర్‌పోర్టుకు బయలుదేరివెళ్లారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరు వెళ్లారు. జగన్ వెంట ఎంపీ మిథున్ రెడ్డి ఉన్నారు. కాగా, కోర్టు సముదాయంలో జై జగన్.. జై జగన్ అంటూ కొందరు నినాదాలు చేయడం సబబు కాదని నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి కిషోర్ అన్నారు.

కొసమెరుపు: జగన్ మీద ప్రేమతో హైదరాబాద్‌లో బలప్రదర్శనకు జనం వచ్చారని వైసీపీ నేతలు నమ్మబలుకుతున్నారు. అదే నిజమైతే.. ఆయన వెంట జనం చివరిదాకా ఉండాలి. అయితే న్యాయస్థానం నుంచి లోటస్‌పాండ్‌లోని జగన్ నివాసానికి వెళ్లినప్పుడు.. అక్కడి నుంచి బెంగళూరుకు వెళ్లేందుకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నప్పుడు జనం పలుచగా కనిపించారు. ఉదయానికి ఉన్న అభిమానం మధ్యాహ్నానికి కరిగిపోయిందా అని రాజకీయవర్గాలు అంటున్నాయి.

మీరేమైనా చెప్పదలచుకున్నారా?

» జగన్‌కు సీబీఐ కోర్టు జడ్జి ప్రశ్న.. ఏమీ లేదన్న ఏ-1

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడి(ఏ-1)గా ఉన్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి గురువారం నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరయ్యారు. ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి కోర్టులో ఉదయం 11.50 నిమిషాలకు ఆయన అడుగుపెట్టారు. దాదాపు 25 నిమిషాలు ఉన్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో న్యాయవాదులు, ఇతరులు కోర్టులోకి రావడంతో విపరీతంగా తోపులాట జరిగింది. న్యాయవాదులు, ఇతరులు అధిక సంఖ్యలో రావడంతో లోపల కోర్టు హాలు, బయట కారిడార్లు కిక్కిరిసిపోయాయి. వారందరినీ అదుపు చేయడం పోలీసులకు కష్టంగా మారింది. కేసులు లేని న్యాయవాదులు బయటకు వెళ్లాలని కోర్టు సిబ్బంది పదే పదే విజ్ఞప్తి చేసినా హాలు నుంచి ఎవరూ వెళ్లలేదు. ఆ పరిస్థితుల్లోనే జగన్ అక్రమాస్తులకు సంబంధించిన దాల్మియా సిమెంట్స్ కేసులో కొద్దిసేపు వాదనలు జరిగాయి. ఆ తర్వాత జగన్‌కు సంబంధించిన అప్లికేషన్ విచారణకు రావడంతో ఆయన న్యాయాధికారి టి.రఘురాం ఎదుటకు వచ్చారు. ఈ సందర్భంగా 'మీరేమైనా చెప్పదలచుకున్నారా' అని న్యాయాధికారి ఆయన్ను ప్రశ్నించారు. ఏమీ లేదని జగన్ సమాధానం ఇచ్చారు. ఆయన వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావడాన్ని న్యాయాధికారి రికార్డు చేశారు. యూరప్ పర్యటనకు సంబంధించిన అప్లికేషన్‌లో విచారణను ముగించారు. అనంతరం జగన్ కోర్టు హాలు నుంచి నిష్క్రమించారు. ఇటీవల యూరప్ ట్రిప్‌కు వెళ్లడానికి జగన్‌కు అనుమతి ఇచ్చిన కోర్టు.. తిరిగి వచ్చాక వ్యక్తిగతంగా రావాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే తాను వస్తే భద్రతాపరమైన ఇబ్బందులు వస్తాయని.. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతానని జగన్ దరఖాస్తు చేయగా కోర్టు అంగీకరించలేదు. కోర్టుకు రావలసిందేనని స్పష్టంచేసింది. దీంతో దాదాపు ఆరేళ్ల తర్వాత సీబీఐ కోర్టులో ఆయన అడుగుపెట్టారు.

పలకరించుకోని జగన్, సునీత

కాగా.. కోర్టు హాలులో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. జగన్ విజిటర్స్ కుర్చీల వైపు కూర్చోగా.. ఎదురుగా సీబీఐ న్యాయవాదులు కూర్చునే చోట.. హత్యకు గురైన ఆయన చిన్నాన్న, మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె, ఆయన చెల్లెలు నర్రెడ్డి సునీతారెడ్డి కూర్చున్నారు. ఆ తర్వాత జగన్ జడ్జి ముందుకు వచ్చినప్పుడు.. ఎదురుగా కూర్చున్న సునీతను చూశారు. అయినా ఇద్దరూ ఒకరినొకరు పలకరించుకోలేదు.

అక్టోబరులో పన్నుల రాబడి రూ.16,372 కోట్లు

» ఎక్సైజ్ ఆదాయమే రూ.3,675 కోట్లు

» కాగ్ అక్టోబరు నివేదికలో వెల్లడి

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానాకు అక్టోబరులో భారీగా పన్నుల ఆదాయం సమకూరింది. ఈ నెలలో అన్ని రకాల పన్నుల కింద రూ.16,372.44 కోట్ల రాబడి వచ్చింది. ప్రధానంగా ఎక్సైజ్ పన్నులే ఖజానాకు ఊతమిచ్చాయి. సాధారణంగా ప్రతి నెలా పన్నుల కింద రూ.13,000-14,000 కోట్ల రాబడి సమకూరుతుంది. అక్టోబరులో మాత్రం రూ.16వేల కోట్ల మార్కు దాటడం గమనార్హం. అక్టోబరులో ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ కింద వైన్ షాపులను కేటాయించడంతో భారీ మొత్తంలో రాబడి సమకూరింది. అక్టోబరులో ఎక్సైజ్ సుంకాల ద్వారానే రూ.3,675 కోట్లు వచ్చాయి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గురువారం విడుదల చేసిన రాష్ట్ర ఆదాయ, వ్యయాల అక్టోబరు నివేదికలో ఈమేరకు వివరాలు వెల్లడయ్యాయి. రాష్ట్ర ఎక్సైజ్ సుంకాల కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.27,623.36 కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేయగా.. ఇందులో అక్టోబరు నాటికి రూ.13,296.75 కోట్లు (48.14%) వచ్చాయి. ప్రతి నెలా దాదాపు రూ.2,000 కోట్ల పైచిలుకు ఎక్సైజ్ రాబడి సమకూరుతుంది. జీఎస్టీ, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, అమ్మకం పన్ను, ఎక్సైజ్ సుంకాలు, ఇతర పన్నులు, సుంకాలు, కేంద్ర పన్నుల్లో వాటా వంటి అన్ని రకాల పన్ను రాబడి కింద అక్టోబరులో రూ.16,372.44 కోట్లు వచ్చాయి. ఈ పన్నుల కింద సెప్టెంబరు నాటికి రూ.71,836.66 కోట్లు రాగా అక్టోబరుకల్లా రూ.88,209.10 కోట్లకు పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం పన్నుల కింద మొత్తం రూ.1,75,319.35 కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేయగా.. అక్టోబరు నాటికి (ఏడు నెలల్లో) రూ.88,209.10 కోట్లు (50.31%) వచ్చాయి. ఎక్సైజ్ రాబడి ఇందుకు ప్రధానంగా దోహదపడింది. మార్కెట్ నుంచి రూ.54,009.74 కోట్ల అప్పులు తీసుకోనున్నట్లు ప్రభుత్వం ప్రకటించగా... రూ.50,541.22 కోట్ల (93.58%) రుణాలను సేకరించింది.

- ఈసారి రెవెన్యూ, మూలధన రాబడులన్నింటి కింద రూ.2,84,837.29 కోట్లు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రకటించగా.. ఏడు నెలల్లో రూ.1,45,124.52 కోట్లు సమకూరాయి.
- అక్టోబరు నాటికి మొత్తంగా ప్రభుత్వం రూ.1,33,920.93 కోట్లు ఖర్చు చేసింది. అంచనా వ్యయం రూ.2,63,486కోట్లలో ఇది 50.83 శాతం. ఇందులో పథకాలకు రూ.40,175.66 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.16,529.88 కోట్లు, ఉద్యోగుల జీతాలకు రూ.27,663కోట్లు వ్యయం చేసింది.

అక్టోబరు నాటికి వచ్చిన రాబడి..

- జీఎస్టీ కింద రూ.30,569.02 కోట్లు
- స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.8,606.43 కోట్లు
- సేల్స్ టాక్స్ ద్వారా రూ.19,057.06 కోట్లు
- కేంద్రపన్నుల్లో వాటా కింద రూ.11,954.94 కోట్లు
- పన్నులు, సుంకాల కింద రూ.4,724.46 కోట్లు
- పన్నేతర రాబడి కింద రూ.3,401.40 కోట్లు

సునీతారెడ్డిది వితండవాదం!

» తదుపరి దర్యాప్తు కోరడంపై భాస్కర్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి ఆక్షేపణ

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తు కోరుతూ ఆయన కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతారెడ్డి వితండవాదం చేస్తున్నారని నిందితులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఆరోపించారు. వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు చేస్తేనే అసలు వ్యక్తులు బయటకు వస్తారని.. చాలా అంశాలపై ఇంకా విచారణ జరగాలని ఆమె దాఖలుచేసిన పిటిషన్‌పై నాంపల్లి సీబీఐ కోర్టులో గురువారం విచారణ కొనసాగింది. నిందితుల తరఫున న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. పిటిషనర్ సునీతారెడ్డి పరస్పర విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని.. ఓ వైపు వేగంగా ట్రయల్ చేపట్టాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని.. మరోవైపు తదుపరి దర్యాప్తు అవసరమంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. ఒకవేళ సీబీఐ తదుపరి దర్యాప్తు చేపడితే ట్రయల్ ఎలా ముందుకు సాగుతుందని ప్రశ్నించారు. ట్రయల్ ఆలస్యమవుతోందని ఆరోపిస్తూనే అది ముందుకు సాగకుండా చేస్తున్నారని తెలిపారు. అలాగే హత్య జరిగింది పులివెందులలో కాబట్టి తదుపరి దర్యాప్తు కోసం కడప కోర్టుకే వెళ్లాల్సి ఉంటుందన్నారు. అమాయకులైన తమ క్లయింట్లను నిందితులుగా చేర్చారని.. నిందితులు, నిందితులంటూ పదే పదే మీడియాలో రావడం వల్ల వారి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో సునీతారెడ్డి పిటిషన్‌ను కొట్టేసి.. వేగంగా ట్రయల్ చేపట్టాలని కోరారు. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

కల్తీ నెయ్యి వెనుక కథేంటి?

టీటీడీ మాజీ చైర్మన్ వైవీపై పశ్నల వర్షం.. ఎవరి సిఫారసుతో 'నందిని'ని మార్చారు?



వైవీ సుబ్బారెడ్డిని విచారించడానికి హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వస్తున్న సిట్ అధికారులు

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి కాంట్రాక్టులు ఎవరెవరి సిఫారసు మేరకు కుదిరాయి? కొందరికి అనుకూలంగా ఉండేలా షరతులు మార్చడంలో అప్పటి టీటీడీ చైర్మన్‌గా మీ పాత్ర ఏమిటి? మైసూర్‌లోని ప్రయోగశాల నాణ్యత రిపోర్టులు ఇచ్చిన తర్వాత కూడా భోలే బాబా సంస్థ నుంచి నెయ్యి సరఫరా ఎందుకు కొనసాగించారు? అంత భారీస్థాయిలో నెయ్యి సరఫరా సేకరణకు సంబంధించిన ఫైళ్లను మీ పీఏ అప్పన్న ఎందుకు చూశారు? అంత అధికారం మీరెందుకు ఇచ్చారు? వేలల్లో జీతం తీసుకునే ఆయనకు రూ.కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి? అంటూ వైఎస్ జగన్ బాబాయ్, టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిపై సిట్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. కల్తీ నెయ్యి కేసులో దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ అధికారులు గురువారం హైదరాబాద్‌లో వైవీ సుబ్బారెడ్డి నివాసంలోనే సుమారు ఏడుగంటలపాటు ప్రశ్నించారు. ఈ కేసులో 24మందిపై కేసు నమోదు చేసిన 'సిట్' వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు చిన్న అప్పన్న సహా తొమ్మిది మందిని అరెస్టు చేసింది. టీటీడీ మాజీ ఇన్‌చార్జి ఈవో ధర్మారెడ్డితోపాటు చిన్న అప్పన్న ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వైవీని ప్రశ్నించారు. ఆయన వైసీపీ హయాంలో 2019 నుంచి 2023వరకూ రెండు విడతల్లో నాలుగేళ్లు టీటీడీ చైర్మన్‌గా ఉన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి అవసరమైన నెయ్యి టెండర్లు కుదుర్చుకోవడంలో చేసిన మార్పులు, సరఫరాదారుల ఎంపికలో జరిగిన ఉల్లంఘనలు, సంబంధిత టెండర్ ఫైళ్లు చైర్మన్ కాకుండా ఆయన పీఏ చూడటం వెనకున్న కారణాలు, నాణ్యత తనిఖీల్లో లోపాలు, ఆడిట్ ప్రాసెసింగ్ విధానం, మరీ ముఖ్యంగా... మైసూర్ ల్యాబ్ నివేదిక తర్వాత కూడా భోలే బాబా నుంచి నెయ్యి కొనుగోలు చేయడంపై సిట్ ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. టీటీడీకి అప్పటిదాకా కర్ణాటక పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్యకు చెందిన 'నందిని' సంస్థను ఎవరి సిఫారసు మేరకు పక్కన పెట్టి... భోలేబాబాను తెర పైకి తెచ్చారని అడిగినట్లు సమాచారం. పలు ప్రశ్నలకు వైవీ సుబ్బారెడ్డి సూటిగా సమాధానం చెప్పలేక నీళ్లు నమిలినట్లు తెలిసింది. నాణ్యత తనిఖీల్లో వచ్చిన సందేహాలతోపాటు లడ్డూ పోటు సిబ్బంది అభిప్రాయాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని అడగ్గా.. అవన్నీ అధికారులు చూసుకోవాలి అంటూ దాటవేసినట్లు సమాచారం. "మీ పీఏ అప్పన్నను పలువురు కాంట్రాక్టర్లు తరచూ సంప్రదించడం వెనుక మీరు పొందిన లబ్ధి ఏంటి? ఆడిట్ నివేదికలు బోర్డు ముందు ఎందుకు ఉంచలేదు?" అని కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. దీనిపై వైవీ సుబ్బారెడ్డి సమాధానాలు, స్పందనలను 'సిట్' అధికారులు రికార్డు చేసుకున్నారు. గురువారం నాటి విచారణలో సుబ్బారెడ్డి చెప్పిన సమాధానాలను ఇప్పటికే ధర్మారెడ్డి, చిన్న అప్పన్న ఇచ్చిన వాంగ్మూలాలు.. సీజ్ చేసిన రికార్డులతో సరిపోల్చుకుని దర్యాప్తును మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశముంది.

దేవ్‌జీ, రాజిరెడ్డి పోలీసుల దగ్గరున్నారా?


» పిటిషనర్లకు హైకోర్టు ప్రశ్న

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి(దేవ్‌జీ), మల్లా రాజిరెడ్డిలను కోర్టు ముందు హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన హేబియస్ కార్పస్ పిటిషన్‌పై గురువారం హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. వారు ఇరువురూ పోలీసులు వద్ద ఉన్నారని నిరూపించేందుకు ఆధారాలు ఏమైనా ఉంటే, వాటిని కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లను ఆదేశించింది. ఇలాంటి వ్యాజ్యాలలో తాము జోక్యం చేసుకోవాలంటే ప్రాథమిక ఆధారాలు ఉండాలని పేర్కొంది. పిటిషనర్ల తరఫు న్యాయవాది జైభీమారావు వాదనలు వినిపిస్తూ.. ఈనెల 18న మావోయిస్టులు-పోలీసుల మధ్య కాల్పులు జరిగాయని, ఆ సందర్భంగా దేవ్‌జీ, రాజిరెడ్డిలను పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారన్నారు. పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది విష్ణుతేజ స్పందిస్తూ.. పోలీసులు అరెస్టు చేసిన 50 మంది మావోయిస్టులను సంబంధిత మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చామన్నారు. కాగా, ఎన్‌కౌంటర్ జరిగిన రోజున పోలీసులు మీడియాతో మాట్లాడుతూ 9 మంది కీలక నేతలు తమ అదుపులో ఉన్నారని ప్రకటన చేశారని.. ఆ వీడియోను కోర్టు ముందు ఉంచుతామని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తెలిపారు. దీంతో కోర్టు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

పూవర్తి కన్నీటిసంద్రం

» గ్రామ శివారులో హిడ్మా, ఆయన జీవన సహచరి రాజీ అంత్యక్రియలు పూర్తి.. ఒకే చితిపై ఇద్దరి మృతదేహాలు

» కడసారి వీడ్కోలు పలికేందుకు తరలివచ్చిన 2వేలమంది



కడచూపు కోసం భారీగా తరలివస్తున్న ఆదివాసీలు; హిడ్మా మృతదేహాన్ని స్పృశిస్తున్న తల్లి మాంజు

చర్ల/చింతూరు/రంపచోడవరం,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ అగ్రనేత, దండకారణ్య స్పెషల్ జోన్ కార్యదర్శి మడావి హిడ్మా, ఆయన జీవన సహచరి రాజీ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం హిడ్మా స్వగ్రామమైన ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూవర్తిలో 2వేల మంది ఆదివాసీల సమక్షంలో దహన సంస్కారాలు జరిగాయి. ఇద్దరి మృతదేహాలను ఏపీ నుంచి ప్రత్యేక వాహనంలో పూవర్తికి తీసుకొచ్చారు. కొద్దిసేపు ఇంటి ఎదురుగా మృతదేహాలను ఉంచి.. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం మధ్యాహ్నం ఒంటిగంటకు దహన సంస్కారాలకు తరలించారు. హిడ్మా, రాజీని ఒకే పాడెపై మోసి.. ఒకే చితిపై ఉంచారు. చితిపై ఉంచాక.. హిడ్మా తల్లి మాంజు మృతదేహాలను తడుముతూ విలపించడాన్ని చూసి అక్కడివారి గుండెలు బరువెక్కాయి. హిడ్మా బాల్యంలో ఉపయోగించిన సామగ్రిని కూడా చితిపై ఉంచి దహనం చేశారు. అంత్యక్రియలకు 2వేల మంది దాకా ఆదివాసీలు హాజరవడంతో పూవర్తి జనసంద్రమైంది. మరోవైపు అల్లూరి జిల్లా మారేడుమిల్లిలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ సహా నలుగురు మావోయిస్టుల మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. మిగిలిన ఏడుగురి మావోయిస్టుల మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

అటవీ సంపదను కొల్లగొట్టేందుకే మారణకాండ

» సీపీఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

హైదరాబాద్/జనగామ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు అడ్డంకిగా మారిన మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో కేంద్రం హత్య చేస్తోందని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం మఖ్దూంభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వామపక్ష, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌరహక్కుల నాయకులు హాజరయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. జనజీవన స్రవంతిలో కలుస్తామని ముందుకొచ్చే మావోయిస్టులను పట్టుకుని చంపేస్తున్నారని అన్నారు. బీజేపీ లాంటి ఫాసిస్ట్ శక్తులు బలపడితే దేశానికి, సమాజానికి ప్రమాదకరమని.. ఈ తరుణంలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. మావోయిస్టుల మృతదేహాలకు న్యాయమూర్తి, కుటుంబ సభ్యుల సమక్షంలో శవపరీక్షలు నిర్వహించాలని, దీన్ని వీడియో తీయించాలని డిమాండ్ చేశారు. టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ మాట్లాడుతూ వ్యక్తులను చంపి, వారిని అణచివేయవచ్చని, కానీ వ్యవస్థను అణచివేయడం సాధ్యం కాదన్నారు. కాగా, బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ శుక్రవారం ట్యాంక్‌బండ్ అబేడ్కర్ విగ్రహం వద్ద అఖిలపక్ష పార్టీల ధర్నా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.